RNI: APTEL/2012/47372

# సెన్సేషనల్ క్రైమ్

SENSATIONAL CRIME

మాసపత్రిక

MONTHLY MAGAZINE

సమాజంలో **పోలీస్** రాజకీయ, సామాజిక, విద్య, వాణిజ్య వార్తలతో ...

నేటి భారతం

సంపుటి : 12 సంచిక : 02 ఫిబ్రవరి 2024 హైదరాబాద్ పేజీలు : 68 రూ. 30/-

ఎడిటర్ : డి.బసవరాజ్
అసోసియేట్ ఎడిటర్ : ఎస్.ఎల్.నర్సింహ్మా రావు
వి.ఎ.రాజు
సబ్ ఎడిటర్ : ఓమ్ ప్రకాశ్ చౌదరి
న్యూస్ కరస్పాండెంట్ : పి.సుధీర్ కుమార్
మీడియా కన్సల్‌టెంట్ : రఘురామరాజు

రిపోర్టర్స్ :
శాంతారామ్, ఎల్.మధుబాబు, రాకేష్ కుమార్,
కె.గోపాల్, డి.చిరంజీవి, షేక్ జహంగీర్, హారిక
జి.బాలాకృష్ణ, అంబదాస్, రాజని
బాలా సిద్దేశ్వర్ – ఫోటోగ్రాఫర్

ఆనరరీ అడ్వైజరీ కమిటీ :
సుంకర సత్యనారాయణ
(రిటైర్డ్ అడిషనల్ డి.సి.పి)
డి.రాములు (రిటైర్డ్ పోలీసు ఆఫీసర్),
తెలంగాణ రాష్ట్ర చీఫ్ (కోడ్ 0347) ఆల్
ఇండియా అఖిల భారత మానవ హక్కుల సంఘం
అడ్వైజరీ కమిటీ :
ఆర్.నీల్‌కంఠ్, డి.చంద్రశేఖర్, బి.యస్.కెశవ,
రాజు ఉస్తాద్, కె.చంటిబాబ్, పి.మురళీ,
ఎస్.అజయ్‌రాజ్,
లీగల్ అడ్వైజరీ కమిటీ :
అరుణ్ కుమార్ దొడ్డ, సునీల్ బాబు B.Tech, LLB.
ప్రతాప్ సింగ్ సుభేధార్, డి.కిషన్ రావ్,
డాక్టర్ షేక్ జిలానీ హైకోర్టు సీనియర్ న్యాయవాది
ఛీప్ అడ్వైజరీ కమిటీ :
డా॥ ఠాకూర్ సురేఖదీప్ సింగ్(అడ్వకెట్)
ఎం.ఏ, బి.యిడి, ఎల్ఎల్ఎం, ఎడిఆర్, ఎఫ్‌డిఆర్

D.BASAWARAJ, Owner/Printer/Publisher
**SENSATIONAL CRIME**
RNI No. APTEL/2012/47372
TELUGU MONTHLY NEWS MAGAZINE
H.No. 13-6-823/70, Hasim nagar, Langer Houz,
Hyderabad - 500 008, Telangana State, INDIA
Email:sensationalcrime@gmail.com,
basawaraj_press@yahoo.com
**Ph: 9849425798, 9490617493**
ANY DISPUTES SUBJECT TO HYDERABAD JURISDICATION ONLY

## లోపలి పేజీల్లో...

| | |
|---|---|
| పదేళ్లు నేనే సీఎం... ప్రజలు ఆశీర్వదిస్తే మరో పదేళ్లు ఇందిరమ్మ రాజ్యం | 05 |
| జాతీయ రహదారి రోడ్డు భద్రత మాసోత్సవాలు.. | 11 |
| సమతామూర్తి చిట్ ఫండ్ మోసం కేసులో నిందితులు అరెస్ట్ | 13 |
| విభజన హామీల అమలుకు 17 గెలవాలి | 15 |
| నియోజకవర్గానికి రూ.కోటి | 17 |
| క్విడ్ ప్రోకోతో భూముల కొనుగోలు! | 19 |
| కండక్టర్‌పై మహిళ దాడి సజ్జనార్ సీరియస్ కామెంట్స్ | 20 |
| విశేషాల సమాహారం రాష్ట్రపతి నిలయం | 23 |
| ఎన్నికల ముంగిట.. ఎన్నో ఆశలు.. | 25 |
| బెంగళూరు టు హైదరాబాద్ | 28 |
| మళ్లీ పునర్వ్యవస్థీకరణ! | 30 |
| వైద్య విద్యలో 'వెనుకబాటు' | 34 |
| కుమారిపై ప్రతిపక్షాల టార్గెట్ అందుకేనా? | 36 |
| అక్షర తోరణం! | 40 |
| నైతిక ప్రమాణాలను కోల్పోయిన భారత్ | 44 |
| స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందపు డొల్లతనం | 47 |
| జాతీయీకరణ నుండి జాతి గర్వించే స్థాయికి .. | 50 |
| కేంద్రం పూర్తి పెత్తనంలోకి ఎన్నికల కమిషన్ | 54 |
| పెన్షన్ల గురించి | 60 |
| రాష్ట్ర ఎన్నికల్లో కీలకం కానున్న మైనారిటీలు ! | 64 |

**SURAKSHA PUBLICATIONS & MEDIA BROADCASTING**
#13-6-823/70,Hasim Nagar,LangerHouse,Hyderabad,500008.
Office:9-1-34/1to34/5,BapuNagar,LangerHouse,Hyd-08. Regd:1114/2020
Mobile:9849425798,9490617493.Email:surakshapublications@gmail.com

Edited Printed Published and Owned by Doddamani Basawaraj, Printed at Natural Grey Offset Press, 10-2-11/1, A.C. Guards, Hyderabad - 500 004, T.S. India. Published at: H.No. 13-6-823/70, Hasim Nagar, Langer Houz, Hyderabad - 500 008, Telangana State, INDIA. Email: sensationalcrime@gmail.com, basawaraj_press@yahoo.com **Editor : Doddamani Basawaraj**

# సంపాదకీయం



ఎడిటర్ : డి.బసవరాజ్

గతంలో (1984 ఆగస్టు) ఎన్‌టి రామారావు గుండె చికిత్స కోసం అమెరికా వెళ్ళగా కేంద్రంలోని అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయనను గద్దె దించి నాదెండ్ల భాస్కర్ రావును ముఖ్యమంత్రిని చేసి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని పొడిచి చంపిన ఉదంతం తెలిసిందే. ఆ జుగుప్సాకరమైన ఉదంతం అప్పటి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రామ్ లాల్ మహాశయుని దర్శకత్వం లో జరిగింది. ఆ తర్వాత సంభవించిన పరిణామాల్లో ఎన్‌టిఆర్ తన పార్టీ శాసన సభ్యులను కర్నాటకకు తీసుకెళ్లి అక్కడి రిసార్టుల్లో దాచి ఉంచడమూ ఎరుకే. కేంద్రంలోని పాలక పక్షాల బాహాటమైన వెన్నుదన్నుతో రాష్ట్రాల్లో ప్రజల తీర్పుకి పట్టపగలే తూట్లు పొడిచే నిర్వాకం మహారాష్ట్రలో ఏక్‌నాథ్ షిండే నాయకత్వంలో అధికార శివసేనను చీల్చి శాసన సభ్యులను గుజరాత్‌కు, అసోమ్‌కు తీసుకుపోయి దాచిపెట్టిన సందర్భంలో మరింత రక్తి గట్టింది. ఇప్పుడు ఇదే రిసార్ట్ రాజకీయం జార?ండ్, బీహార్‌లలో చోటు చేసుకొన్నది. జార?ండ్ మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ 8 ఎకరాల భూమిని తన పేరిట అక్రమంగా బదలాయింప జేసుకొన్నాడన్న ఆరోపణపై దర్యాప్తు చేస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఇడి) ఆయనను పెట్టిన ముప్పుతిప్పలు కళ్ళ ముందున్నవే.

చివరికి ఆయన రాజీనామా చేసేలా చేసి అరెస్టు చేసేంత వరకు నిద్రపోలేదు. హేమంత్ రాజీనామా తర్వాత అధికార కూటమి అసెంబ్లీలో స్పష్టమైన మెజారిటీ కలిగినప్పటికీ చంపయ్ సోరెన్ చేత ప్రమాణ స్వీకారం చేయించడానికి గవర్నర్ ఒక రోజు ఆలస్యం చేశారు. దానితో పాలక కూటమి బలపరీక్ష జరిగే వరకు తన ఎంఎల్ఎలను హైదరాబాద్‌లో దాచి ఉంచక తప్పలేదు. బీహార్‌లో నితీశ్ కుమార్ మళ్ళీ మరొక్కసారి రాజకీయ విధేయతను మార్చుకొని మహాఘట్‌బంధన్ నుంచి ఎన్‌డిఏ కూటమికి ఫిరాయించిన పిమ్మట వెనువెంటనే ఆయన చేత తిరిగి ప్రమాణ స్వీకారం చేయించి ఆయన కొత్త ప్రభుత్వ బలపరీక్ష తేదీని దూరం దూరం జరుపుతున్నారు. ఈ నేపథ్యంలో అక్కడి ఆర్‌జెడి కూటమిలోని కాంగ్రెస్ శాసన సభ్యులను కాపాడుకోడం కోసం హైదరాబాద్ రిసార్టుల్లో ఉంచారు. ప్రజల తీర్పును జుట్టు పట్టుకొని రిసార్టులకు ఈడ్చే ఈ దౌర్భాగ్యం కూడా భారత స్వాతంత్ర్య శతాబ్ది 2047 వరకూ కొనసాగి వికసిత్ భారత్ అంటే అదేనని ఇల్లెక్కి చాటడం ఖాయమనిపిస్తున్నది. లేక పాకిస్తాన్‌లో ఎన్నికల సందర్భంగా ఇమ్రాన్ ఖాన్ మద్దతుదార్లను సైన్యం ఆదేశాలతో పోలీసులే హింసలకు గురిచేస్తున్న మాదిరిగా మన దేశంలో కూడా అప్పటి కేంద్ర పాలక పక్షం గవర్నర్ల ద్వారా ముఖ్యమంత్రులను మార్పించే విధానం శాసనబద్ధం అవుతుందేమో!

హేమంత్ సోరెన్ అన్నట్టు పార్లమెంటు సభ్యులను, రాష్ట్రపతులను సైతం ఇడి చేత అరెస్టు చేయించే రోజులు దాపురిస్తాయేమో, ప్రజాస్వామ్య భవనాన్ని కూల్చడం ప్రారంభించిన తర్వాత అది ఒక చోట ఆగుతుందా? జార?ండ్ అసెంబ్లీలో సోమవారం నాడు జరిగిన విశ్వాస పరీక్షలో కొత్త ముఖ్యమంత్రి పంచయ్ సోరెన్ ప్రభుత్వానికి అనుకూలంగా 47 మంది, వ్యతిరేకంగా 29 మంది శాసన సభ్యులు ఓటు వేశారు. ఒక ఇండిపెండెంటు సభ్యుడు ఓటింగ్‌లో పాల్గొన లేదు. మొత్తం శాసన సభ బలం 81. బలపరీక్ష ఘట్టం పాలక కూటమికి హేమంత్ సోరెన్ పట్ల గల విధేయతను చాటింది. ముఖ్యమంత్రి చంపయ్ విశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ చేసిన ప్రసంగాన్ని 'హేమంత్ సోరెన్ తమకు దన్నుగా ఉంటే చాలు ధైర్యంగా ముందుకు పోతాం అని, హేమంత్ ప్రభుత్వం రెండో భాగానికి నాయకత్వం వహిస్తున్నందుకు సంతోషంగా ఉందని అన్నారు. రాష్ట్రాన్ని అస్థిర పరచాలనే కుట్రను తమ ఐక్యత భగ్నం చేసిందని పంచయ్ సోరెన్ %ఇ% లో ప్రకటించారు. తనపై ఆరోపణలను రుజువు చేస్తే జార?ండ్‌ను విడిచిపెడతానని మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ సవాలు చేశారు.

రాజ్‌భవన్ ప్రోద్బలంతోనే ఒక ముఖ్యమంత్రిని ఇలా అరెస్టు చేశారని, గిరిజనులను బిజెపి అంటరానివారుగా చూస్తున్నదని డా. అంబేద్కర్ మాదిరిగానే వారు బుద్ధిజాన్ని స్వీకరించక తప్పనిస్థితి తల ఎత్తుతున్నదని కూడా అభిప్రాయపడ్డారు. జార?ండ్ అసెంబ్లీకి ఎన్నికలు ఈ సంవత్సరాంతంలోగా జరగవలసి ఉంది. ఈ కొద్ది కాలానికే ముఖ్యమంత్రిని బలవంతంగా దింపి అరెస్టు ద్వారా అప్రతిష్ఠపాలు చేయడంలో కేంద్ర పాలకుల కుట్రే కనిపిస్తున్నదన్న విమర్శ తోసిపుచ్చదగినదిగా కనిపించడం లేదు. ఢిల్లీ నుంచి రాంచీ వరకు హేమంత్ సోరెన్‌ను ఇడి వేటాడి, వెంటాడిన తీరు సమంజసం అనిపించడం లేదు. ఘోరమైన ఆర్థిక నేరాలకు పాల్పడిన వారు బిజెపిలో చేరి సురక్షితంగా ఉండగలుగుతున్న ఉదంతాలున్నాయి. బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇడి అడుగుపెట్టలేకపోడంలోనే కేంద్ర పాలకులు ప్రతిపక్ష నేతలను పనికట్టుకొని రాచి రంపాన పెడుతున్నారని రుజువు అవుతున్నది.

# పదేళ్లు నేనే సీఎం... ప్రజలు ఆశీర్వదిస్తే మరో పదేళ్లు ఇందిరమ్మ రాజ్యం




- దున్నపోతుకాదు... రేసుగుర్రాన్ని... కంచెర గాడిదను ఇంటికి పంపి రేసు గుర్రాన్ని తెచ్చారు
- అటెండరుకు ఉన్న ఇంగిత జ్ఞానం... ముఖ్యమంత్రిగా చేసిన చంద్రశేఖర్ రావుకు లేదు
- కేసీఆర్ నీ పనైపోయింది... ఖేల్ ఖతం... దుకాణ్ బంద్
- 13445 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు ఎంపిక పత్రాలు అందించిన సీఎం రేవంత రెడ్డి
- అధైర్య పడొద్దు... మీ అన్నగా... రేవంత అన్నగా అండగా ఉంటా
- ఈ ప్రభుత్వం మీది... మీ సమస్యలు పరిష్కరించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుంది
- రాబోయే కాలంలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ
- మేడిపండు చందంగా మేడిగడ్డ మారిందని ఎద్దేవ
- చీకటి మిత్రుడు జగన్ సహాయంతో నాగార్జున సాగర్‌పైకి ఏపీ పోలీస్‌లు

వచ్చే పదేళ్లు తానే సీఎంగా ఉంటానని ప్రజలు ఆశీర్వదిస్తే మరో పదేళ్లు తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం కొనసాగుతుందని ముఖ్యమంత్రి రేవంత రెడ్డి తెలిపారు. నల్లగొండ సభలో మాజీ సీఎం చంద్రశేఖర రావు

మాట్లాడుతూ... పాలిచ్చే బర్రెను కాదని దున్నపోతును గెలిపించారని మాట్లాడారని కానీ... ప్రజలు కంచెర గాడిదను ఇంటికి పంపి రేసు గుర్రాన్ని గెలిపించారన్నారు. ఏ పోటీకెళ్లినా ఈ రేసు గుర్రానిదే గెలుపని రేవంత రెడ్డి అన్నారు. ఆయా విభాగాల్లో శిక్షణకు ఎంపికైన 13445 మంది కానిస్టేబుల్ అభ్యర్థులకు ఎల్బీ స్టేడియంలో బుధవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో సీఎం రేవంత రెడ్డి ఎంపిక పత్రాలు అందజేశారు. మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, సీఎస్ శాంతి కుమారి, డీజీపీ రవిగుప్తాతోపాటు రాజకీయ ప్రముఖులు, అధికారులతో కలిసి అభ్యర్థులకు సీఎం రేవంత రెడ్డి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా రేవంత రెడ్డి మాట్లాడారు. "లక్షలాది మంది నిరుద్యోగులు ఉద్యమబాటపట్టి ఉద్యోగాల కోసం తెలంగాణ సాధించుకున్న యువకులు ఉద్యోగం సాధించి కుటుంబ సభ్యులతో కలిసి ఎల్బీస్టేడియంలో కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది. డిసెంబరు 7న ఇదే ఎల్బీ స్టేడియం వేదికగా సోనియాగాంధీ, మల్లిఖార్జున ఖర్గే, ప్రియాంకా గాంధీ, రాహుల్ గాంధీ ముఖ్య అతిధులుగా పాల్గొని ఇక్కడే ప్రజా ప్రభుత్వం ఏర్పాటు చేశారు. నేను సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు నాకు ఎంత ఆనందాన్ని ఇచ్చిందో ఈ రోజు మీకు ఉద్యోగ నియామక పత్రాలు అందించినప్పుడు అంతే ఆనందాన్ని, సంతోషాన్ని ఇచ్చింది." అన్నారు.

## కంచెర గాడిదను ఇంటికి పంపి...రేసు గుర్రాన్ని తెచ్చారు...

"శాసన సభలో చర్చకు రాలే. నీళ్ల మీద చర్చ అంటే రాలే. నిధుల మీద చర్చ అంటే రాలే. నియామకాల గురించి మాట్లాడుదామంటే రాలే. కానీ నల్లగొండకు పోయి బీరాలు పలుకుతున్నారు. పొంకనాలు కొడుతున్నారు. పాలిచ్చె బర్రెనిచ్చి... దున్నపోతును తెచ్చుకున్నారన్నారు. ఈ రోజు శాసన సభలో ఓ అటెండర్ నాతో మాట్లాడారు. సార్ ఎల్బీ స్టేడియంలో ఒక్క మాట చెప్పాలని అన్నాడు. కంచెర గాడిదను ఇంటికి పంపించి రేసు గుర్రాన్ని తెచ్చుకున్నారని మీరు చెప్పండి అన్నాడు. గత ప్రభుత్వంలో ఉన్న కంచెర గాడిదను ఇంటికి పంపి ఈ ప్రభుత్వంలో రేసు గుర్రాన్ని తెచ్చుకున్నారు. ఏ రేసుకు పోయినా ఆ గుర్రానిదే గెలుపు. ఆ కంచెర గాడిదకు మళ్లీ అధికారం అన్నది కలలో మాట అన్న సంగతి మీరు చెప్పాలి సార్... మీరు చెబితే నేను వింటా అన్నాడు. ఆ అటెండర్‌కు ఉన్న ఇంగిత జ్ఞానం ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రశేఖర రావుకు ఎందుకు లేదు. ఆయనంటా మళ్లీ వస్తాడంటా... నడవడానికే వస్తలేదంటివి, వీల్ ఛైర్‌లో తిరుగుతున్నా అంటున్నావు. ఎట్లొస్తావని నేను అడుగుతున్నా. ఒక వేళ నువ్వు రావాలనుకుంటే ఇన్ని వేల ఉద్యోగాల వచ్చిన వారు ఊరుకుంటారా. పోలీస్ నౌకరి వచ్చిన వారు ఊరుకుంటారా. ట్రైనింగ్ తర్వాత రాష్ట్రం నలుమూలల ఈ యువకులేగా ఉండేది. తెలంగాణను దోచుకున్న నిన్ను... ఈ తెలంగాణను నీ కుటుంబం కోసమే బలిచ్చిన నిన్ను ఈ పిల్లలు పోలీసులయ్యి లాఠీలతో నాలుగు మోకాళ్ల చిప్పలమీద కొట్టి తీసుకుపోయి లాకప్‌లో వేస్తరు. ఇంతకాలం వాళ్ల చేతిలో పెత్తనం లేకుండే. ఇవ్వల వాళ్ల చేతిలోకే పెత్తనం వచ్చింది. ఎట్ల తిరుగుతవో తిరుగు. సంపుతారా సంపుర్రి అని డైలాగులు కొడుతున్నాడు. సచ్చినపామును సంపనీకే మాకేమైనా పిచ్చా. నీ పనైపోయింది. ఖేల్ ఖతం... దుకాణ్ బంద్. చిన్నగా సానుభూతి కథ మొదలు పెట్టిండు. సావునోట్ల తలపెట్టి తెలంగాణ సాధించిన అని చెబితే పిల్లలు చూడలేదు కాబట్టి నిజమే అనుకున్నారు. ఈయాల నువ్వు ఆడే డ్రామాలు చూసిర్రు. ఉత్తప్పుడు బాగనే నడుస్తుండు. మీటింగ్‌కు రాగానే వీల్ ఛైర్‌లో కూసుండు." అని సీఎం రేవంత రెడ్డి తెలిపారు.

## రాబోయే రోజుల్లో 2 లక్షల ఉద్యోగాల భర్తీ...

"ఒక్కో సమస్యను పరిష్కరించుకుంటు, ఉద్యోగ నియామకాల్లో ఒక్కో అడుగు ముందుకేస్తు మీ జివితాల్లో వెలుగు తేవాలని, మీరు ఉంచిన నమ్మకం, విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలని మా ప్రభుత్వం పనిచేస్తుంది. ఏ తప్పు జరగకుండా, ఎవరికి నష్టం లేకుండా రాబోయే రోజుల్లో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు భర్తీ చేస్తాం. టీఎస్పీఎస్సీలో జరిగిన అక్రమాల్ని నిలువరించి, ఆ నాడు పోటీ పరీక్షల ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్లలో పల్లీ బఠాణీల మాదిరిగా అమ్ముకుంటున్న కమిటీని రద్దు చేశాం. కొత్త కమిటీ, ఛైర్మన్, సభ్యుల్ని నియమించాం. గ్రూప్-1 పరీక్షల్ని పదేళ్లు నిర్వహించలేదు. 567 గ్రూప్-1 పరీక్షలు నిర్వహించేందుకు

మా ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ పదేళ్లు నియామకాలు చేపట్టకపోడం వల్ల వయస్సు మీరిన నిరుద్యోగ యువతకు 44 సంవత్సరాల నుంచి 46 సంవత్సరాలకు వయస్సు పొడగించాం. ఎవరికి నష్టం కలగొద్దన్న ఆలోచనతోనే అందరికి అవకాశం కల్పించాం. పోటీ పరీక్షలకు సన్నద్ధం కాండి. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగ, ఉపాధి కల్పించే బాధ్యత నేను తీసుకుంటా. మీ కోసం కృషి చేస్తాం." అని చెప్పారు.

## పదేళ్లు ఈ బాధ్యతల్లోనే... చంద్రశేఖర రావు చేతనైతే వెంట్రుక పీకి చూడు...

"రాబోయే 10 సంవత్సరాలు రోజుకు 24 గంటలు పనిచేస్తా. పదేళ్లు ఈ బాధ్యతల్లో ఉంటా. మీరు ఆశీర్వదిస్తే ఇంకో పదేళ్లు ఇందిరమ్మ రాజ్యం ఉంటది. చంద్రశేఖర రావు నీకు సూటిగా సవాలు విసురుతున్నా... ఈ పదేళ్లలో నీకు చేతనైతే ఒక్క వెంట్రుక పీకి చూడు అప్పుడు నీకు తెలుస్తది. ఆయన వెంబడే అధికారంలోకి వస్తా అంటున్నాడు. రా... బిడ్డ ఎట్ల వస్తవో. ఇక్కడే ఉంటా నీ సంగతేందో చూస్తా. ఆయన శాసన సభకు రావడానికి అయితలేదు. నల్లగొండకు పోయిండు. ఆయన మాటల మాయలో పడొద్దు. పదేళ్లు ఆయన కుర్చీలో ఉండి తెలంగాణకు రావాల్సిన నీళ్లు తీసుకురాలే. కట్టాల్సిన ప్రాజెక్టులు కట్టలే. పదేళ్లలో చేయలేని పని 60 రోజుల్లో అన్ని పరిష్కరించుకుంటు ముందుకెళ్తున్నాం. ఈ రోజుకు 69 రోజులైంది. అప్పుడే ఈ ప్రభుత్వం ఏ చేయలేదని శాపనార్థాలు పెడుతున్నారు." అని సీఎం రేవంత రెడ్డి అన్నారు.

## మా అన్న దగ్గరకు పోయినమని హరీష్ రావుకు చెప్పండి...

"ఈ రోజు రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది నిరుద్యోగులకు ఈ వేదిక మీది నుంచి పిలుపునిస్తున్నా. ఆ నాటి ప్రభుత్వం చిక్కుముళ్లు వేస్తే... ఒక్కో చిక్కుముడి విప్పుకుంటూ... సమస్యల్ని పరిష్కరించుకుంటు 6956 స్టాఫ్ నర్సుల ఉద్యోగాలు ఇదే ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన కార్యక్రమంలో వారికి అందించాం. ఆ తర్వాత సింగరేణిలో 441 కారుణ్య నియామకాలు చేపట్టాం. వచ్చే 15 రోజుల్లో ఎవరు అడ్డుపడ్డా... కేసీఆర్, హరీష్ అరిచి గోల పెట్టినా... అంగీ, లాగు చించుకున్న తప్పకుండా ఉద్యోగ నియామకాలు






చేపడతానని ఆ రోజే చెప్పా. 10 రోజుల్లోనే సుమారు 13500 నియామకాలు ఈ రోజు చేపట్టడం వల్ల మీ సంతోషం, ఆనందంలో భాగం పంచుకున్నాం. రేపు ఇదే ప్రాంగణంలో 2 వేల పైచీలుకు ఉద్యోగాలు చేపట్టేందుకు మా అధికారులు, ప్రభుత్వం ప్రయత్నం చేస్తుంది. రేపు వారి కళ్లల్లో ఆనందం చూడాలనుకుంటున్నాం. చాలా మంది అంటున్నారు. హరీష్

రావు అంటున్నారు ఎవరి నియామక పత్రం వారి ఇంటికి పంపిస్తే సరిపోతుంది కదా అంటున్నారు. ఇంత మందిని ఇక్కడికి ఎందుకు పిలవాలంటున్నారు. నేను అడుగుతున్నా... నీ కడుపు నొప్పి ఏంది. వీళ్లంతా మా తమ్ముళ్లు, చెల్లెళ్లు వారితో ప్రత్యక్షంగా కలిసి వారి ఆనందంలో భాగస్వామ్యం తీసుకుంటే ఇంటికెళ్లిన తర్వాత నాకు కంటినిండ నిద్ర పడతది. బుక్కెడు బువ్వ ఒంటపడ్తది. ఎందుకంటే నా బాధ్యతను నేను నెరవేస్తున్నానన్న నమ్మకం నాకు ఏర్పడతది. మీ లాంటి లక్షలాది మంది కొట్లాడితేనే ఈ నాడు ఈ ప్రభుత్వం ఏర్పడింది. మీ అన్నగా, రేవంత అన్నగా ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టా. అందుకే ఈ రోజు ఈ సంతోషకరమైన సందర్భంలో మిమ్మల్ని కలిసి, చెప్పేది వినాలనే ఆలోచనతోనే ఈ కార్యక్రమాలకు ఎల్బీ స్టేడియాన్ని వేదిక చేశాం. నేను సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు మా కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, మా అభిమానులు ఎంత ఆనందపడ్డారో... మీ నియామకాల సందర్భంగా కూడా మీ తల్లిదండ్రులు, సోదరులు, కుటుంబ సభ్యులు ఆ సంతోషంలో భాగస్వాములు కావాలన్నదే మా ప్రభుత్వ ఆలోచన. అందుకే మిమ్మల్ని ఇక్కడికి రప్పించాం. మీ సంతోషంలో మేం భాగస్వామ్యం అయ్యేందుకే నియామక పత్రాలు అందించే కార్యక్రమం చేపట్టాం. ఆ హరీష్ రావు ఎక్కడైనా అడ్డం పడితే చెప్పండి. మా అన్న దగ్గరికి పోయినం. మా అన్నను కలిసినం. మా అన్న మాకు అండగా నిలబడ్డడని ఆయనకు చెప్పండి." అని సీఎం రేవంత రెడ్డి అన్నారు.

## మీ కుటుంబాన్ని తెలంగాణ సమాజం బహిష్కరించింది....

"ఇంకో మాట కేసీఆర్‌కు గుర్తు చేయదలుచుకున్న. 2 జూన్ 2014న తెలంగాణ ఏర్పడితే ఒక్క గంట కూడా ఆలస్యం చేయలే. గవర్నర్ అపాయింట్‌మెంట్ తీసుకున్నావు. మంత్రివర్గం ఏర్పాటు చేసుకున్నావు. అందులో మీరు, మీ కొడుకు, అల్లుడు ఉండే. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో కూతురికి నిజామాబాద్ ఎంపీగా టిక్కెట్ ఇచ్చి గెలిపించుకున్నావు. ఆ తర్వాత మీ బంధువు వినోద్ రావును ఎంపీగా చేసుకున్నావు. ఆ తర్వాత సంతోష్ రావుకు రాజ్యసభ ఇచ్చావు. పార్టీ పిరాయించిన ఎర్రబెల్లి దయాకర రావుకు మంత్రి పదవి ఇచ్చావు. 2019 ఎన్నికల్లో వినోద్ రావు, కవిత ఓడిపోతే ఆరు నెలలు ఆలస్యం చేయకుండా కూతురికి ఉద్యోగం లేకపోతే తండ్రిగా కళ్లల్లో నీళ్లు వచ్చాయి. దుఃఖం వచ్చింది. కూతురికి శాసన మండలి సభ్యురాలిగా, బంధువు వినోద్ రావును ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్ చేశావు. నీ కుటుంబ సభ్యులకు, బంధువులకు ఉద్యోగం లేకపోతే వంద రోజులు కూడా ఆగలేకపోయినవ్. నీ కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇచ్చావు. ఈ పిల్లలు ఏం పాపం చేశారు. 3650 రోజుల నుంచి దాదాపు 10 సంవత్సరాలు ఉద్యోగ నియామకాల కోసం 30 లక్షల మంది నిరుద్యోగులు ఎదురుచూస్తున్నారు. ఎప్పుడైనా పిల్లల ఉద్యోగాల గురంచి ఆలోచన చేశావా ?. ఈ రోజు మేం ఆ దిశగా ఆలోచన చేస్తుంటే అభినందించకపోగా మా కాళ్లల్లో కట్టెపెట్టే ప్రయత్నం ఎందుకు చేస్తున్నావని అడుగుతున్నా. ఇప్పటికైనా మీకు అర్థం కాలేదా మీ కుటుంబాన్ని తెలంగాణ సమాజం తిరస్కరించింది, బహిష్కరించిందని అర్థం కాలేదా. తెలంగాణ ఉద్యమకారుణ్ణి... తెలంగాణ సాధించినా అంటున్నావు అదే నిజమైతే కామారెడ్డిలో ఎందుకు బండకేసి కొట్టిందెందుకని నేను అడుగుతున్నా. నువ్వు చెప్పింది నమ్మకనే కదా... నువ్వు తెలంగాణను దోచుకుంటున్నా, మోసం చేస్తున్నావనే ఆలోచనతోనే నిన్ను తిరస్కరించింది, ఓడించింది." అని సీఎం రేవంత రెడ్డి అన్నారు.

## చీకటి మిత్రుడు జగన్ సహాయంతో సాగర్‌పైకి ఏపీ పోలీస్‌లు...

"చంద్రశేఖర రావు కృష్ణా నది జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీ నీళ్లను కేటాయించి తెలంగాణకు రావాల్సిన హక్కుల్ని తాకట్టు పెట్టి 299 టీఎంసీలను ఈ పది సంవత్సరాలు శాశ్వతంగా వారికి రాసిచ్చిండు. పదేళ్లు ఆయన రాసిస్తే... నేను వచ్చిన 10 రోజుల్లోనే ఆ నీళ్లు తేలేదని నన్ను తిడుతున్నాడు. ఆయన సంతకం పెట్టడమే ఇప్పుడు గుదిబండగా మారింది. ఆయన చేతకాకపోతే, ఏం చేయకుండా పక్కన పడేసి ఉంటే నేనే కొట్లాడి నీళ్లు తెచ్చే వాడిని. నీ సంతకాలు మా పాలిట గుదిబండగా మారాయి. తెలంగాణ రైతుల పాలిట మరణ శాసనాలుగా మారాయి. నవంబరు 30న తెలంగాణలో ఎన్నికలు ఉంటే యువకులు ఎన్నికల

నిర్వహణలో ఉండగా నీ చీకటి మిత్రుడు జగన్ మోహన్ రెడ్డి వందలాది మంది పోలీస్‌లను నాగార్జున సాగర్ మీదికి పంపించాడు. ఆ పోలీస్‌లను తొలగించేందుకు నరేంద్ర మోదీ సీఆర్‌పీఎఫ్ పోలీస్‌ల్ని నాగార్జున సాగర్ బ్రిడ్జిమీదికి పంపించాడు. జగన్ మోహన్ రెడ్డి ఆక్రమించకపోతే నరేంద్ర మోదీ సీఆర్‌పీఎఫ్ బలగాల్ని అక్కడికి పంపి ఉండేవాడు కాదు. ఆ రోజు నుంచి ఇప్పటి వరకు సీఆర్‌పీఎఫ్ బలగాలు అక్కడ ఉన్నాయి. ఎన్నికల్లో తెలంగాణ సెంటిమెంట్‌తో నెగ్గాలని, ఆంధ్రావాళ్లు నాగార్జునా సాగర్‌ను ఆక్రమించుకున్నారని పెడబొబ్బలు పెట్టి కుట్ర చేస్తే తెలంగాణ సమాజం తిప్పికొట్టి నిన్ను బొంద పెట్టారు. ఢిల్లీతో కొట్లాడదామంటే ఇంటి నుంచి కదలరు. ఏ దారి లేక నీళ్లదారి పట్టిండు. పరిపాలనలో చేసిందేమి లేదు. కాళేశ్వరంలో లక్ష కోట్లు ఖర్చు పెడితే లక్ష ఎకరాలకు నీళ్లు ఇవ్వలేదని విజిలెన్స్‌తోపాటు ఇతర విచారణ సంస్థలు నివేదిక ఇచ్చాయి. ఆ అవినీతి కుంభకోణం బయటపడుతుందని, అది మేడిగడ్డ కాదు... మేడి పండు అని దాని పొట్టవిప్పితే మొత్తం పురుగులున్నాయన్న విషయం బయటపడుతుందని దాన్ని కప్పిపుచ్చేందుకు కృష్ణా నది జలాల్ని అడ్డుపెట్టుకుని నల్లగొండలో సభ అంటున్నాడు. నల్లగొండ చైతన్యవంతమైన జిల్లా. అందుకే యువకులు తిరగబడ్డారు. కోడి గుడ్లు, టమాటాలు విసిరారు. పోలీస్‌లు ఉండబట్టే ఆయన వీపు చింతపండు కాలేదు. నల్లగొండ యువకులు చింతపండు చేసి పంపేవారు." అన్నారు.

## గంజాయి పదం పలకాలంటే వనుకు పుట్టాలి...

"పంజాబ్‌లో యువత నిర్వీర్యమైంది. అక్కడ గంజాయి, డ్రగ్స్‌తో రాష్ట్రాన్ని నిర్వీర్యం చేశారు. ఇప్పుడు తెలంగాణను కబలించేందుకు గంజాయి, డ్రగ్స్ ముఠాలు నలు మూలల తిరుగుతున్నాయి. ఎన్ని పట్టుకున్నా... ఎంత ప్రయత్నం చేసినా ఇంకా వాళ్లు ఆ దిశగానే ప్రయత్నం చేస్తున్నారు. హుక్కా సెంటర్ల పేరుమీద పిల్లల్ని, యుదతను వీటికి బానిసలుగా చేసే ముఠాలు తిరుగుతున్నాయి. వాటిని ఎదుర్కొనేందుకు టీఎస్‌నాబ్, నార్కొటిక్స్ విభాగాన్ని బలోపేతం చేశాం. కోట్ల రూపాయల నిధులిచ్చాం. అధికారులనిచ్చాం. ఇక్కడ ఎంపికైన వారికి ఒక్కటే మాట చెబుతున్నా... ఏది జరిగినా.. ఈ రాష్ట్రంలో గంజాయి మొక్కలు ఉండొద్దు. తులసి వనంలో మొలసిన గంజాయి మొక్కల్ని కూకటి వేళ్లతో కదలించాల్సిన బాధ్యత మీపై ఉంది. ఈ రాష్ట్రంలో డ్రగ్స్, గంజాయి పదం పలకాలంటే మోకాళ్లలో వనుకు పుట్టాలి. కడుపులో చలిజరం జొరబడాలి. మన రాష్ట్రాన్ని, యువతను నిర్వీర్యం చేసే బలహీనతలు తెలంగాణలో ఉండొద్దు. తెలంగాణ యువకులు అంటే సలసల మరిగే రక్తంతో ఉరకలెత్తే యువకులు. తెలంగాణ ఉద్యమంలో ఉవ్వెతున్న ఉస్మానియా, కాకతీయ యూనవర్సిటీల్లో ప్రపంచం దృష్టిని ఆకర్శించి ఈ రాష్ట్రాన్ని సాధించిన నవ యువకులు. ఆత్మ బలిదానాలతో ఆకాశంలో తారలై వెలిగిన యువకులు ఈ రోజు గంజాయి, డ్రగ్స్‌కు మానిసైతే సమాజం నిర్వీర్యం అవుతుంది. సమాజం నిర్వీర్యం అయితే మన భవిష్యత తరాలు ఎందుకు ఉపయోగం లేకుండా పోతాయి. నియామక పత్రాలు పొందుతున్న ప్రతి ఒక్కరు రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్‌ను సమూలంగా నాశనం చేస్తామని ప్రమాణం చేయండి. నీతిగా నిజాయితీగా ఈ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచేలా, తెలంగాణ మోడల్‌ను దేశం అనుకరించేలా గతంలో ఉంది భవిష్యతలో కూడా కొనసాగించాలి." అని సీఎం రేవంత రెడ్డి తెలిపారు.

## మీ అన్నగా... మీ రేవంత అన్నగా అండగా ఉంటా....


''ఆనాటి తెలంగాణ ఉద్యమంలో ప్రజాప్రతినిధులకంటే, రాజకీయ నాయకులకంటే యువతే ముందు నిలబడి ఉద్యమాన్ని ఉవ్వెత్తున నడిపించినందుకే తెలంగాణ ఏర్పడింది. ఏర్పడ్డ తెలంగాణ రాష్ట్రంలో 2వ ముఖ్యమంత్రిగా బా?ధ్యతలు స్వీకరించి ప్రమాణ స్వీకారం చేశా. డిసెంబరు 7న సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణం నుంచి లక్షలాది మంది నిరుద్యోగుల కల సాకారం చేయాలనుకున్నా. మా ఉద్యోగాలు చూసుకుని మా కుటుంబాల అభ్యున్నతికి పాటుపడటం కాదు. మా కుటుంబం అంటే 4 కోట్ల తెలంగాణ ప్రజలు. మా కుటుంబం అంటే తెలంగాణ రాష్ట్రం అని భావించి నిరుద్యోగులు సంవత్సరాలుగా ఎదురుచూస్తున్న అటు పోలీస్ ఉద్యోగం కావచ్చు. ఎక్సైజ్ శాఖ కావచ్చు, ఇతర శాఖల్లో ఉన్న ఖాళీలు పరీక్షలు రాసి ఎదురు చూసి నిరుత్సాహానికి గురై ఆత్మహత్యలు చేసుకునే

పరిస్థితి నుంచి మిమ్మల్ని గట్టెక్కించాలని నిర్ణయించాం. మీ పైనే ఆశలు పెట్టుకుని కల్లల్లో ఒత్తులు పెట్టుకుని చూస్తున్న మీ తల్లిదండ్రులు కూలీలకు పోయి రూపాయి రూపాయి కూడబెట్టి మిమ్మల్ని ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీలకు పంపించి పీజీలు, పీహెచ్‌డీలు చదివించి ప్రభుత్వ ఉద్యోగం వస్తే భవిష్యత్తుకు బంగారు బాటలు పడతాయనుకున్నారు. 2014లో తెలంగాణ వచ్చాక లక్షలాది మంది నిరుద్యోగులు తమ బాదలు తీరుతాయని, కలలు నెరవేరుతాయని ఎదురు చూశారు. కానీ నాటి పాలకులు నిరుద్యోగ యువత సమస్యలు పరిష్కరించకుండా తమ కుటుంబం కోసం, పదవుల కోసం, సంపాదన కోసం తాపత్రయ పడ్డారు. మీ సమస్యల్ని పరిష్కరించాలని ఆలోచన చేయలేదు. తొమ్మిదిన్నర సంవత్సరాలు ప్రభుత్వ ఉద్యోగ ఖాళీల భర్తీ చేయాలన్న ఆలోచన గానీ ఆ దిశగా ప్రయత్నం చేసిన పాపాన పోలేదు. అందుకే తమ ప్రభుత్వం బాధ్యత తీసుకున్న తర్వాత శాఖల వారిగా సమీక్షించి, న్యాయస్థానాల్లో ఉన్న కేసుల్ని పరిశీలించి ఆ కేసులన్నింటిని పరిష్కరించాం. గత ప్రభుత్వం నిర్లక్షం వహించడంతో ఏప్రిల్ 2022లో నోటిఫికేషన్ వస్తే దాదాపు 22 నెలలు ఉద్యోగ నియామకాలు చేపట్టలేదు. అందుకే అధికారులతో సమీక్షించి, న్యాయపరమైన చిక్కులు తొలగించి ఈ రోజు 13445 ఉద్యోగాల ఖాళీలు భర్తీ చేసి నా తమ్ముళ్లు, చెల్లెళ్ల కల్లల్లో వెలుగులు చూడాలని ఈ రోజు ఈ కార్యక్రమం చేపట్టాం. మీ అన్నగా... మీ రేవంత అన్నగా అండగా ఉంటా. మీరెవ్వరు అధైర్య పడొద్దు. మీ సమస్యల్ని పరిష్కరించే బాధ్యత మా ప్రభుత్వం తీసుకుంటుంది. ఈ ప్రభుత్వం మీది. ఈ ప్రభుత్వం పేదలది. ఈ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం. ప్రజలకోసం పనిచేస్తుంది. ప్రజల సమస్యలు పరిష్కరిస్తుంది.” అని సీఎం రేవంత రెడ్డి అన్నారు.





# జాతీయ రహదారి రోడ్డు భద్రత మాసోత్సవాలు..




రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ జనవరి 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డు భద్రతా మాసంగా ప్రకటించినందున ఈ నెల మొత్తం మహబూబాబాద్ జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండి వివిధ రకాల కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు రోడ్డు భద్రత మరియు హెల్మెట్ ధరించడం, అతివేగం, ప్రమాదల పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ డా సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ IPS గారు తెలిపారు.. ఈ రోజు రోడ్డు భద్రత మాసం లో చివరి రోజు కావున జిల్లా వ్యాప్తంగా గా పోలీస్ సిబ్బంది అధికారులు, విద్యార్థులతో ర్యాలీ, మానవహారం లాంటి కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అంతే కాకుండా అన్ని పోలీస్ స్టేషన్స్ పరిధిలో హెల్మెట్ వాడే వారికి చాక్లేట్ ఇచ్చి, హెల్మెట్ లేని వారికీ పువ్వు ను అందించి అవగాహనా కల్పించడం జరిగింది.. రోజురోజుకు పెరుగుతున్న వాహనాలు, ప్రయాణికులు జాగ్రత్తలు పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం, సీటు బెల్టు పెట్టుకోకపోవడం, అతివేగం, ప్రమాదకర డ్రైవింగ్, డ్రైవింగ్‌లో మొబైల్ ఫోన్లు మాట్లాడటం వంటి కారణాలతో రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయన్నారు.

స్పీడ్ గన్‌లు, బ్రీత్ ఎనలైజర్లు ద్వారా కొంతమీరకు రోడ్డు ప్రమాదాలు నిరవాణ అవుతుందని అన్నారు.రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడే బాధ్యత ప్రతి ఒక్క పౌరుడికి ఉందని, నిబంధనలకు కట్టుబడి ఉన్న పౌరులను గుర్తించి మహబూబాబాద్ జిల్లా పోలీసు శాఖ తరపున ప్రశంసలు అందించడం జరుగుతుంది అని ఎస్పీ అన్నారు

ముఖ్యంగా యువత హెల్మెట్ ధరించాలని, అతివేగాన్ని నివారించాలని విజ్ఞప్తి చేసారు.అలాగే మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం సాహించేది లేదన్నారు

లైసెన్సు లేని తక్కువ వయస్సు పిల్లలు వాహనాలు నడిపితే బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని మరియు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ కూడా ఇవ్వబడుతుంది ఎస్పీ తెలిపారు.

# రాష్ట్రపతి నిలయంలో ప్రథమ చికిత్స అవగాహన కార్యక్రమం జరిగింది




అగ్ని భద్రతపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహనా కలిగించే విధముగా బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో ఫిబ్రవరీ 15న అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలంగాణ విపత్తు ప్రతిస్పందన మరియు అగ్నిమాపక సేవల విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు.

భాష్యం బ్రూక్స్, శాంతినికేతన్, సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాల, శివ శివాని కాలేజీ, CVR ఇంజనీరింగ్ కళాశాల, MPPS, స్వామి రామానంద తెరథ మెమోరియల్, రెడ్ క్రాస్ వాలంటీర్ (భవన్స్ కాలేజీ), తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, గాంధీ మెడికల్ కాలేజీ, CMR కాలేజీ తదితర పాఠశాలలు మరియు కళాశాలల నుండి హాజరైన వివిధ విద్యార్థిని విద్యార్థులకు అగ్ని భద్రతా మరియు పారిశ్రామిక అగ్ని భద్రతా చర్యలు గురించి అవగాహనా కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి నిలయ సివిల్ మరియు ఎలక్ట్రికల్ సిబ్బంది, ITBP మరియు TSSP సెక్యూరిటీ పాల్గొన్నారు. తెలంగాణ విపత్తు ప్రతిస్పందన మరియు అగ్నిమాపక సేవల విభాగంవారు అగ్ని భద్రతకు సంబందించిన వీడియోస్ ప్రదర్శిస్తూ మోక్ డ్రిల్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహాయక జిల్లా అగ్నిమాపక అధికారి శ్రీ.జె.రంజిత్ రెడ్డి గారు. కంటోన్మెంట్ అగ్నిమాపక కేంద్రం యొక్క స్టేషన్ అగ్నిమాపాక అధిక రే శ్రీ.రాఘవ్ రెడ్డి గారు, స్టేషన్ అగ్నిమాపాక అధికారి (హజమత్ వెహికల్) శ్రీ.శివ ప్రసాద్ గారు మరియు సిబ్బంది హాజరయ్యారు.

అగ్నిమాపక చర్యల ఆవశ్యకత ఇప్పటి ఆధునిక పరిస్థితులలో ప్రతి ఒక్కరికి తెలియాల్సిన అవసరం ఉన్నందున అటువంటి అవగాహన కార్యక్రమలు విద్యార్థులు నిమిత్తం నిర్వహించడం జరుగుతుందని రాష్ట్రపతి నిలయ అధికారి డా.కె.రజని ప్రియ తెలుపుతూ కార్యక్రమాన్ని ముగించారు.

# సమతామూర్తి చిట్ ఫండ్ మోసం కేసులో నిందితులు అరెస్ట్

బోగస్ చిట్ ఫండ్ మోసం కేసులో నిందితులు రూ.ఐదు కోట్లకుపైగా కాజేసినట్లు తమ విచారణలో తేలిందని మాదాపూర్ డీసీపీ తెలిపారు. బుధవారం తన కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం రామకృష్ణాపూర్‌నకు చెందిన ఏల్పుల శ్రీనివాస్, అతని కుమారుడు రాకేశ్‌వర్మ మంచిర్యాలకు చెందిన గణేష్‌తో కలిసి గతేడాది మాదాపూర్ గుట్టల బేగంపేట్‌లో సమతామూర్తి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటుచేశారు. ముగ్గురూ డైరెక్టర్లుగా శాఖలు ఏర్పాటు చేసి తమ అక్రమ వ్యాపారాన్ని విస్తరించి చిట్టీలు కట్టించుకున్న విషయం తెలిసిందే.

130 మంది వరకు చిట్టీలు వేశారు. తొలుత కమీషన్ అందించి నిందితులు తర్వాత డబ్బులు కాజేసి బిచాణా ఎత్తేశారు. బాధితులు సైబరాబాద్ సీపీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాలతో రంగంలోకి దిగిన మాదాపూర్ పోలీసులు




శ్రీనివాస్, రాకేశ్‌వర్మలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గణేష్ పరారీలో ఉన్నాడు. బాధితుల సంఖ్య, వారు కొట్టేసిన నగదు ఇంకా పెరిగే అవకాశం ఉందని డీసీపీ తెలిపారు. నిందితులు ఎలాంటి లైసెన్స్‌లేకుండానే చిట్‌ఫండ్స్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బాధితులు ఎవరైనా ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. నిందితుల ఆస్తులను అటాచ్ చేయనున్నట్లు తెలిపారు.

# డిఎస్పీ అఖిల్ మహాజన్ గారికి పులమొక్క అందించిన జి.మహేష్ బాబు

1.కరీంనగర్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ లో డిఎస్పీ గా విధులు నిర్వహిస్తూ బదిలీ పై వచ్చి రాజన్న సిరిసిల్ల జిల్లా స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ గా శుక్రవారం నాడు బాధ్యత లు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ గారిని మర్యాదాపూర్వకంగా కలిసి పులమొక్క అందించిన డిఎస్పీ జి.మహేష్ బాబు.

2.వరంగల్ కమిషనరేట్ ఏ. ఆర్ డిఎస్పీ గా విధులు నిర్వహిస్తూ అటాచ్ మెంట్ పై జిల్లా ఆర్మడ్ రిజర్వ్ డిఎస్పీ గా వచ్చి జిల్లా ఎస్పీ గారిని మర్యాదాపూర్వకంగా కలిసి పులమొక్క అందించిన డిఎస్పీ గంగాధర్.

3.వరంగల్ కమిషనరేట్ లో ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తూ బదిలీ పై రాజన్న సిరిసిల్ల జిల్లా డీసీఆర్బీ ఇన్స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ గారిని మర్యాదాపూర్వకంగా కలిసి పులమొక్క అందించిన సి.ఐ శ్రీనివాస్.



# భూమి విషయంలో చీటింగ్ చేస్తూ చంపుతానని బెదిరించిన సిరిగిరి రమేష్ అనే వ్యక్తి పై కేసు నమోదు:సిరిసిల్ల టౌన్ సి.ఐ రఘుపతి



సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ నగర్ కి చెందిన శిరిగిరి రమేష్ అనే వ్యక్తి సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ నగర్ కి చెందిన సిరిగిరి సురేష్ అనే వ్యక్తికి సర్వే నంబర్. 112 మరియు 129 ముస్తిపల్లి లో గల రెండు ప్లాట్స్ మొత్తం 320 గజాల భూమిని తేదీ 5-2-2015 నాడు అమ్మి వేములవాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ నందు రిజిస్టర్ చేయడం జరుగుతుంది. శిరిగిరి రమేష్ అనే వ్యక్తి మరల తప్పుడు కాగితాలు తయారు చేసి, సంతకాలు ఫోర్జరీ చేసి అందులోని ప్లాట్స్ నంబర్ 16 గల 150 గజాల భూమిని తంగాల్లపల్లి కి చెందిన తక్కల్ల అశోక్ అనునతనికి అమ్మి తేది 24-05-2019 నాడు సిరిసిల్ల సబ్ రిజిస్టర్ ఆఫీస్ సిరిసిల్లలో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుంది. సిరిగిరి సురేష్ రమేష్ వద్దకి వెళ్లి నాకు 320 గజాల ప్లాట్ రిజిస్ట్రేషన్ చేసి మరల తక్కల్ల అశోక్ కి ఎలా అమ్ముతావ్ అని అడుగగా సిరిగిరి రమేష్ అనే వ్యక్తి నాకు మరల 80,000 రూపాయలు ఇస్తే మళ్ళీ రిజిస్ట్రేషన్ చేస్తానని చెప్పి అడిగితే చంపుతానని సురేష్ ని బెదిరించగా సురేష్ సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా సిరిసిల్ల టౌన్ సి.ఐ రఘుపతి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సిరిగిరి రమేష్ కి సంబంధించిన బాధితులు నిర్భయంగా సిరిసిల్ల టౌన్ పోలీస్ స్టేషన్ లో లేదా జిల్లా పోలీస్ కార్యాలయంలో పిర్యాదు చేయవచ్చని తెలిపారు.

# మరుగుదొడ్ల విషయం లో సిపిఐ ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ గారికి ఫిర్యాదు చేసిన అధికారులు



కుత్బుల్లాపూర్ సర్కిల్ 127 డివిజన్ పరిధిలోని గురుమూర్తి నగర్ బస్తీలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ మరుగుదొడ్ల స్థలమును సిపిఐ కాంగ్రెస్ పార్టీల ఆధ్వర్యంలో డిప్యూటీ కమిషనర్ గారికి ఫిర్యాదు చేసిన విషయమై ఈరోజు టౌన్ ప్లానింగ్ అధికారులు సంబంధిత ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలించి ఐదు రోజుల్లో అక్కడ వ్యాపారాలు చేసుకుంటున్న వారి కోరిక మేరకు గడువు ఇచ్చి వ్యక్తిగత హామీ పత్రం రాతపూర్వకంగా తీసుకోవడం జరిగింది ఎట్టి పరిస్థితులలో ఆక్రమణలను ఉపేక్షించే లేదని స్థానికుల అవసరాలకు ఉపయోగపడేటట్లు జరుగునట్లు చూడగలమని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో 127 డివిజన్ సిపిఐ నాయకులు వి శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్ పి నరసయ్య కాంగ్రెస్ నాయకులు ఉస్మాన్, ఆరిఫ్, నయీమ్ బిజెపి నాయకులు శివరాజ మరియు మర్కంటి నర్సింగరావు ,అర్జున్ రావు, శివకుమార్, చంద్రమోహన పాల్గొనడం జరిగింది.

# విభజన హామీల అమలుకు 17 గెలవాలి




- కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే విభజన హామీల అమలు
- మోదీని మళ్లీ గెలిపించేందుకు బీజేపీ, బీఆర్ఎస్ మధ్య చీకటి ఒప్పందం
- సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపణ

తెలంగాణ ప్రజలకిచ్చిన విభజన హామీలు అమలు కావాలంటే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 17కు 17 స్థానాల్లోనూ కాంగ్రెస్ గెలవాలని.. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడాలని ముఖ్యమంత్రి, టీపీసీసీ చీఫ్ ఎ. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందుకోసం ప్రజాస్వామిక శక్తులన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు.

మంగళవారం గాంధీ భవన్‌లో జరిగిన టీపీసీసీ ఎన్నికల కమిటీ (పీఈసీ) భేటీ అనంతరం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, పీఈసీ సభ్యులు షబ్బీర్ అలీ, అంజన్‌కుమార్ యాదవ్, సంపత్‌కుమార్, శివసేనారెడ్డిలతో కలసి రేవంత్ విలేకరులతో మాట్లాడారు. పీఈసీ భేటీలో భాగంగా లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించామన్నారు.

**కేసీఆర్ అడిగింది లేదు.. మోదీ ఇచ్చింది లేదు..**

'విభజన హామీల్లో పొందుపర్చిన అంశాలను సాధించుకోవాలంటే కేంద్రంలో కాంగ్రెస్ గెలవాలి.

దీనిపై పదేళ్లు కేసీఆర్ అడిగింది లేదు... మోదీ ఇచ్చింది లేదు'అని రేవంత్ విమర్శించారు. రాష్ట్రంలో కేసీఆర్ రూ. 7 లక్షల కోట్ల మేర అప్పులు చేస్తే ప్రధాని మోదీ రూ. 100 లక్షల కోట్ల అప్పులు తెచ్చి దేశాన్ని ప్రపంచంలోనే దివాలా తీసిన దేశంగా నిలబెట్టారని ఆరోపించారు. అందువల్ల రాహుల్ గాంధీ లాంటి నాయకుడు ప్రధానిగా ఉండాల్సిన అవసరముందని రేవంత్ పేర్కొన్నారు.

**బీజేపీతో బీఆర్ఎస్ చీకటి చర్చలు..**

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చీకట్లో మోదీతో జరుపుతున్న చర్చలను, బిల్లా%--%రంగాలు (కేటీఆర్, హరీశ్‌లను ఉద్దేశించి) మాట్లాడుతున్న మాటలను తెలంగాణ ప్రజలు గమనించి కాంగ్రెస్‌కు అండగా నిలవాలని రేవంత్ కోరారు.

'అధికారం నుంచి దింపాల్సింది మోదీనైతే బిల్లా%--%రంగాలు బీజేపీని పల్లెత్తు మాట అనకుండా కాంగ్రెస్ ఉండటమే మంచిది కాదన్న ధోరణిలో మాట్లాడుతున్నారు. దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాకపోతే అధికారంలోకి వచ్చేది మోదీనే కదా? ఆ రెండు పార్టీలు చేసుకున్న చీకటి ఒప్పందం ప్రజలకు అర్థం కావడం లేదనుకుంటున్నారా?'అని ప్రశ్నించారు.

**కోదండరాంను అలాంటి వాళ్లతో పోలుస్తారా?**

ఎన్నికైన ఎమ్మెల్సీలు ప్రమాణం చేస్తామంటే రాజకీయ కుట్రతో వాయిదా వేయించే ప్రయత్నం చేశారని రేవంత్ మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దొడ్లో చెప్పులు మోసేవాళ్లతో ప్రొఫెసర్ కోదండరాంను పోల్చడంలో అర్థముందా? అని నిలదీశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ చచ్చిపోయిందని, ఆ పార్టీని ప్రజలు బొందపెట్టారని వ్యాఖ్యానించారు.

**కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌కైనా అపాయింట్‌మెంట్ ఇస్తా..**

తనను ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కలవడంపై సీఎం రేవంత్ స్పందించారు. ఎమ్మెల్యేలు ఎవరడిగినా సీఎంగా అపాయింట్‌మెంట్ ఇస్తానని, అవసరమైతే కేసీఆర్, హరీశ్, కేటీఆర్‌లు కూడా తనను అపాయింట్‌మెంట్ అడగొచ్చన్నారు. ఒకవేళ తాను ఆ సమయంలో అందుబాటులో లేకపోతే ఉపముఖ్యమంత్రిని కలవచ్చని చెప్పారు.

**రాజ్యసభ అభ్యర్థుల ఖరారు బాధ్యత ఖర్గేకు..**

రాజ్యసభ ఎన్నికల్లో అభ్యర్థులను నిర్ణయించే అధికారాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, కేంద్ర ఎన్నికల కమిటీకి బదిలీ చేస్తూ పీఈసీ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశామని రేవంత్ చెప్పారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కోసం స్క్రీనింగ్ కమిటీ రాష్ట్రానికి వచ్చి దరఖాస్తులపై చర్చించి కేంద్ర ఎన్నికల కమిటీకి ఇస్తుందని, ఈ నెల 15-20లోగా సమావేశాలు జరుగుతాయన్నారు. వీలైనంత త్వరగా అభ్యర్థులపై అధిష్టానం నిర్ణయం తీసుకొనే అవకాశముందని చెప్పారు.

ఫిబ్రవరి 2న కనీవినీ ఎరగని రీతిలో ఇంద్రవెల్లిలో కాంగ్రెస్ బహిరంగ సభ ఉంటుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నా రు. సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనే ఈ బహిరంగసభపై మంగళవారం గాంధీభవన్‌లో టీపీసీసీ నేతలతో సమావేశం నిర్వహించారు. మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఇంద్రవెల్లి స్తూపం వద్ద స్మృతి వనం కడతామని సీఎం చెప్పారన్నారు.

రేవంత్‌రెడ్డి టీపీసీసీ చీఫ్ అయిన తర్వాత ఇంద్రవెల్లి నుంచి ప్రచారం కార్యక్రమం మొదలైందని గుర్తు చేశారు. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడు తూ ఇంద్రవెల్లిలో సీఎం పలు అభివృద్ధి కార్య క్రమాలు ప్రారంభిస్తారని వెల్లడించారు. సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, నేతలు మోత్కుపల్లి నర్సింహులు, హరివర్ధన్‌రెడ్డి, శ్రీహరిరావు, డీసీసీ అధ్యక్షులు, ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

# నియోజకవర్గానికి రూ.కోటి

- ➡ తాగునీటి కోసం విడుదల చేయాలని అధికారులకు సీఎం రేవంత్ ఆదేశం
- ➡ ప్రత్యేక అభివృద్ధి నిధుల్లోంచి ఖర్చు చేయండి
- ➡ సర్పంచ్‌ల పదవీకాలం ముగుస్తున్నందున తాగునీటి నిర్వహణ మీరే చేపట్టండి
- ➡ మంత్రులు సీతక్క, కోమటిరెడ్డితో కలసి సమీక్ష



గ్రామాల్లో తాగునీటి నిర్వహణ బాధ్యతను పూర్తిగా సర్పంచ్‌లకు అప్పగించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశించారు. అయితే సర్పంచ్‌ల పదవీకాలం నెలాఖరుతో ముగుస్తున్నందున అధికారులు ఆ బాధ్యతలను సమర్థంగా నిర్వహించాలని సూచించారు. రోడ్లు%--%భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్కతో కలసి సచివాలయంలో మంగళవారం ఉన్నతాధికారులతో సీఎం రేవంత్ సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్ మాట్లాడుతూ వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) కింద కేటాయించిన రూ.10 కోట్లలోంచి రూ. కోటి చొప్పున తాగునీటి అవసరాలకు ఖర్చు చేయాలని ఆదేశించారు. మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక్ సాగర్ లాంటి కొత్త రిజర్వాయర్లన్నింటినీ తాగునీటి అవసరాలకు ఉపయోగించుకోవాలని.. తద్వారా చుట్టుపక్కల గ్రామాలకు తాగునీటి సరఫరా సులభమవుతుందని సీఎం తెలిపారు. గ్రామాల వరకు రక్షిత మంచినీటిని సరఫరా చేసే బాధ్యతను మిషన్ భగీరథ విభాగమే తీసుకోవాలని, ఇంటింటికీ నీళ్లను అందించే బాధ్యతను సర్పంచ్‌లకు అప్పగించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. అందుకు అవసరమైన విధివిధానాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో తాగునీటి నిర్వహణ, నల్లాలు, పైపులైన్ల మెయింటెనెన్స్‌ను సర్పంచులకే అప్పగించాలన్నారు.

**నీరురాని గ్రామాల సర్వే..**

రాష్ట్రంలో ఏయే ప్రాంతాలకు తాగునీరు అందట్లేదో సమగ్ర సర్వే నిర్వహించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. సంబంధిత ఇంజనీర్లు అన్ని గ్రామాలకు వెళ్లి నిజ నిర్ధారణ బృందం చేసినట్లుగానే పక్కాగా తాగునీరు అందని ఆవాసాల జాబితాను సిద్ధం చేయాలని సూచించారు. జలజీవన్ మిషన్ నిధులు రాబట్టుకొనేలా కొత్త ప్రతిపాదనలు తయారు చేసి కేంద్రానికి పంపించాలన్నారు.

**స్వయం సహాయక సంఘాలకు...**

స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయాలని, వాళ్లకు ఆర్థికంగా చేయూతను అందించే కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రభుత్వ స్కూళ్లు, గురుకులాలు, హాస్టళ్ల విద్యార్థిని విద్యార్థులు, పోలీసులకు అందించే యూనిఫామ్‌లను కుట్టించే పనిని ఈ సంఘాల మహిళలకు అప్పగించాలని సూచించారు.

**రహదారులు లేని గ్రామాలకు తారురోడ్లు...**

రోడ్డు సౌకర్యంలేని గ్రామాల్లో రోడ్లను నిర్మించాలని సీఎం రేవంత్ స్పష్టం చేశారు. 422 గ్రామ పంచాయతీలు, 3,177 ఆవాసాలకు ఇప్పటికీ రోడ్డు కనెక్టివిటీ లేదని అధికారులు సీఎంకు నివేదించగా వాటన్నింటికీ తారురోడ్లు వేయాలని సీఎం ఆదేశించారు. అవసరమైతే ఉపాధి హామీ నిధులను అనుసంధానించి వాటిని పూర్తి చేయా లని చెప్పారు. ఈ బడ్జెట్‌లోనే అందుకు అవసరమైన నిధులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

**గత ప్రభుత్వ నిర్వాకంతో కేంద్ర నిధులు రాలేదు..**

తెలంగాణలో ఇంటింటికీ నల్లా నీళ్లు ఇచ్చినట్లు గత ప్రభుత్వం చెప్పుకోవడంతో రాష్ట్రానికి నష్టమే తప్ప లాభం జరగలేదని ముఖ్యమంత్రి రేవంత్ పేర్కొన్నారు. గత ప్రభుత్వ ప్రకటనలతో కేంద్రం నుంచి జలజీవన్ మిషన్ నిధులు రాకుండా పోయాయన్నారు. ఇకపై వాస్తవాలను దాచిపెట్టి గొప్పలకు పోవాల్సిన అవసరం లేదని అధికారులకు సూచించారు.

# ఏసీబీ కస్టడీకి శివబాలకృష్ణ


## అక్రమ అనుమతులు, బినామీ ఆస్తులపై ఆరా

హెచ్‌ఎమ్‌డీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణను ఏపీసీ కస్టడీలోకి తీసుకుంది. చంచల్‌గూడ జైలులో రిమాండ్‌గా ఉన్న ఆయన్ను.. 8 రోజుల వరకు కస్టడీలోకి తీసుకొని విచారించనుంది. కాగా ఆదాయానికి మంచిన ఆస్తుల కేసులో శివబాలకృష్ణ అరెస్ట్ అయిన విషయం తెలిసిందే. ఎనిమిది రోజుల కస్టడీకి నాంపల్లి ఏసీబీ కోర్టు అనుమతించింది. దీంతో బాలకృష్ణను మరింత లోతుగా ప్రశ్నించనున్నారు ఏసీబీ అధికారులు. బాలకృష్ణ హయాంలో జరిగిన అవినీతిని బయటకు తీయనున్నారు. అక్రమ అనుమతులు, బినామీ ఆస్తులపై ఆరా తీయనున్నారు.

మరోవైపు హెచ్‌ఎండీఏ, రేరా, మెట్రోలో జరిగిన అక్రమాలకు సంబంధించిన కేసులో అవినితి నిరోధక శాఖ(ఏసీబీ) విచారణ ఎదుర్కొంటున్న శివబాల కృష్ణపై హైదరాబాద్ మెట్రో పాలిటన్ అథారిటీవేటు వేసింది. శివ బాలకృష్ణను సస్పెండ్ చేస్తూ మంగళవారం హెచ్‌ఎండీఏ కమిషనర్ దాన కిషోర్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఇక పుప్పాలగూడ 447సర్వే నంబర్‌లో అనుమతులపై సూర్య ప్రకాష్ అనే వ్యక్తి ఏసీబీకి ఫిర్యాదు చేయడంతో బాలకృష్ణ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఇప్పటికే రూ.100 కోట్ల విలువైన బాలకృష్ణ అక్రమ ఆస్తులను గుర్తించారు.



# క్విడ్ ప్రోకోతో భూముల కొనుగోలు!




మాజీ సీఎస్, ధరణి రూపకర్తగా పేరున్న సోమేష్ కుమార్ ఆస్తుల చిట్టాలో కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయి. పాతిక ఎకరాల భూమిని తక్కువ ధరలకు చెల్లించి ఆయన కొనుగోలు చేయడం.. అదీ ఫార్మా సిటీ ప్రాంతంలోనే కావడంతో కొత్త అనుమానాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలో క్విడ్ ప్రోకో అంశంపై తెరపైకి వచ్చింది.

ఫార్మాసిటీ వస్తుందని ముందే తెలుసుకుని.. ప్లాన్‌ప్రకారమే యాచారంలో భూములు కొన్నట్లు ప్రభుత్వం భావిస్తోంది. 2018లో ఫార్మాసిటీ ప్రాంతం అయిన కొత్తపల్లిలో 25 ఎకరాల్ని నలుగురి దగ్గరి నుంచి ఆయన కొన్నారు. అందుకుగానూ ఎకరానికి రూ. 2 లక్షలు చెల్లించారు. అయితే అది సోమేష్ భార్య పేరిట ఉన్నట్లు ధరణి రికార్డుల్లోనూ ఇది నమోదు అయ్యింది.

**లక్షల్లో రైతుబంధు సొమ్ము**

తక్కువ ధరకు కొనుగోలు చేసిన ఈ భూముల ద్వారా సోమేశ్ కుమార్ లక్షల్లో రైతుబంధు తీసుకున్నట్లు తెలుస్తోంది. కొత్తపల్లి విలేజ్‌లో కొనుగోలు చేసిన భూమిపై ఇప్పటివరకు 14 లక్షల 5 వేల 550 రూపాయల రైతుబంధు తీసుకున్నట్లు సమాచారం. భూమి సాగు చేయకపోయినా రైతుబంధు తీసుకున్నట్లు తెలుస్తోంది. 25 ఎకరాల 19 గుంటలు భూమి మొత్తం రాళ్లు, గుట్టలు మాత్రమే ఉన్నాయి. కానీ, సోమేశ్ కుటుంబం.. సాగు చెయ్యకుండానే రైతుబంధు పొందినట్లు తెలుస్తోంది. అదేకాకుండా ఆయన బంధువులు మొత్తం 150 ఎకరాలకు సంబంధించి భూమిపై రైతుబంధు డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఇక.. ఏడాదికి రెండు దఫాల్లో 2 లక్షల 52,750 రూపాయల రైతుబంధు డబ్బును సోమేశ్ కుమార్ తీసుకున్నట్లు తెలుస్తోంది.

అంతేకాదు భూముల కొనుగోలులో క్విడ్ ప్రోకో జరిగినట్లు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదిలా ఉంటే రెరా సెక్రటరీగా పని చేసిన శివబాలకృష్ణ అక్రమాస్తుల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అదే సమయంలో సోమేష్‌కుమార్ కూడా రెరాలో పని చేయడంతో ఏమైనా లింకులు ఉన్నాయా? అనే కోణంలోనూ దర్యాప్తు నడుస్తోంది.

# మళ్లీ హొటల్ తెరుస్తానుకోలేదు కుమారి ఆంటీ




ఫుడ్ స్టాల్‌తో నగరంలోని మాదాపూర్ ప్రాంతంలో ఫేమస్ అయ్యి.. ఆపై సోషల్ మీడియా ద్వారా ఆ ఫేమ్‌ను మరింత పెంచుకుంది కుమారి ఆంటీ. అయితే ఆ ఫేమ్ వల్లే జనాలు ఆమె ఫుడ్ స్టాల్ దగ్గర గుమిగూడడం.. అది ట్రాఫిక్ జామ్‌కు దారి తీయడంతో ఆమె స్టాల్‌ను పోలీసులు బలవంతంగా తొలగించాల్సి వచ్చింది. ఈ పరిణామంపై తీవ్ర చర్చ నడవగా.. చివరకు తెలంగాణ సర్కార్ ఆమెకు ఊరట ఇచ్చింది. ఈ పరిణామంపై ఆమె సాక్షితో స్పందించారు.

"గత 13 ఏళ్ల నుంచి స్ట్రీట్ ఫుడ్ నిర్వహిస్తున్నా. ముందు మాకు తొలగించాలని ఎటువంటి నోటీసులు ఇవ్వలేదు. నిన్న 50 వేల రూపాయల ఫుడ్ వేస్ట్ అయింది. నా ఫుడ్ కోర్టు బండిని సీజ్ చేశారు. మా కొడుకును పోలీసులు కొట్టారు. మళ్లీ హొటల్ తెరుస్తామని మేం అసలు అనుకోలేదు. నాలాంటి చిన్న స్ట్రీట్ ఫుడ్ హొటల్ మహిళను గుర్తించి ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి స్పందించడం గొప్ప విషయం. అందుకు సీఎం రేవంత్‌రెడ్డిగారికి హృదయపూర్వక కృతజ్ఞతలు అని తెలిపారామె.

కుమారి ఆంటీ అసలు పేరు దాసరి సాయి కుమారి. మాదాపూర్ లోని ఐటీసీ కోహినూర్ హొటల్ ఎదురుగా ఆమె కొన్నేళ్లుగా ఫుడ్‌స్టాల్ నడిపిస్తోంది. అయితే ఈ మధ్య సోషల్ మీడియాలో ఆమె గురించి ఎక్కువ చర్చ నడిచింది. దీంతో పొరుగు రాష్ట్రాల నుంచి కూడా ఆమె ఫుడ్ స్టాల్‌కు జనాల రాక మొదలైంది. ఈ క్రమంలో జనం భారీగా గుమిగూడి.. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతూ వస్తోంది. దీంతో మంగళవారం ఆమె షాప్‌ను సీజ్ చేసి.. మరో చోటుకి తరలించాలని పోలీసులు ఆదేశించారు. అయితే మిగతా వాళ్లను వదిలేసి తననే తొలగించాలని ఆదేశించడంపై ఆమె తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

మరోవైపు ఈ పరిణామంపై అదే సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల వైఖరిని ఆంధ్రప్రదేశ్ అధికార పార్టీ వైటఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగం తప్పు పట్టింది. సీఎం జగన్ తనకు మంచి చేశారని.. ఇళ్లు ఇచ్చారని ఆమె చెప్పడం వల్లే ఆమెను ఇబ్బంది పెడుతున్నారంటూ ఆరోపించింది. దీంతో వ్యవహారం మరింత తీవ్రరూపం దాల్చక ముందే తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. కుమారి ఆంటీ షాపును మార్చాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నట్లు సీఎంవో ఒక ప్రకటన విడుదల చేసింది. ఆమె ఫుడ్‌కోర్టును యథావిధిగా కొనసాగించేందుకు అనుమతించాలని రాష్ట్ర డీజీపీతో పాటు ఎంఏయూడీ అధికారులను సీఎం రేవంత్ ఆదేశించినట్లు సీఎంవో తెలిపింది. మరోవైపు ఈ సాయంత్రం సీఎం రేవంత్‌రెడ్డి ఆమె స్టాల్‌కు వెళ్లనున్నారనే ప్రచారం ఒకటి నడుస్తోంది.

# కండక్టర్‌పై మహిళ దాడి సజ్జనార్ సీరియస్ కామెంట్స్



హయత్ నగర్ బస్సు డిపో పరిధిలో ఓ మహిళ టీఎస్ఆర్టీసీకి చెందిన బస్సు కండక్టర్‌తో అనుచితంగా ప్రవర్తించింది. బూతులు తిడుతూ.. చేయిచేసుకోవడంతో పాటు కాలుతో సైతం తన్నింది. ఈ ఘటనపై ఆర్టీసీ యాజమాన్యం సీరియస్‌గా స్పందించారు. ప్రయాణికులకు వార్నింగ్ ఇచ్చింది. ఈ ఘటనపై సజ్జనార్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. ఈ మేరకు ట్విట్టర్‌లో..'హయత్‌నగర్ డిపో–1కు చెందిన ఇద్దరు కండక్టర్లపై ఓ మహిళా ప్రయాణికురాలు నానా దుర్భషలాడుతూ దాడికి పాల్పడిన ఘటనను టీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనపై రాచకొండ కమిషనరేట్ ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు చేశారు. ఆ కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**బస్సు కండక్టర్ మీద దాడి చేసి కాలుతో తన్నిన మహిళ**

హయత్ నగర్ బస్ డిపో 1కు చెందిన కండక్టర్ మీద ఓ మహిళ మద్యం మత్తులో నానా బూతులు తిడుతూ, దుర్భాష లాడుతూ, కొడుతూ, కాలుతో తన్ని దాడికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

మొదటి ట్రిప్పు అని తన దగ్గర చిల్లర లేదని కండక్టర్ విన్నవించినా ఆ మహిళా ఏమాత్రం వినకుండా దాడికి పాల్పడ్డారు. నిబద్ధతతో సమర్థవంతంగా విధులు నిర్వహిస్తోన్న సిబ్బందిపై ఇలాంటి ఘటనలకు పాల్పడితే ఏమాత్రం ఉపేక్షించబోమని టీఎస్ఆర్టీసీ యాజమాన్యం స్పష్టం చేస్తోంది. టీఎస్ఆర్టీసీ సిబ్బంది విధులకు ఆటకం కలిగించే, దాడులకు దిగే వ్యక్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది. టీఎస్ఆర్టీసీ సిబ్బంది చాలా ఓపిక, సహనంతో విధులు నిర్వహిస్తున్నారు. వారికి సహకరించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ప్రజలకు సంస్థ విజ్ఞప్తి చేస్తోంది' అంటూ కామెంట్స్ చేశారు.

హయత్‌నగర్ డిపో–1కు చెందిన ఇద్దరు కండక్టర్లపై ఓ మహిళా ప్రయాణికురాలు నానా దుర్భషలాడుతూ దాడికి పాల్పడిన ఘటనను టీఎస్ఆర్టీసీ యాజమాన్యం తీవ్రంగా ఖండిస్తోంది. ఈ ఘటనపై రాచకొండ కమిషనరేట్ ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో ఆర్టీసీ అధికారులు ఫిర్యాదు చేశారు. ఆ కేసును పోలీసులు దర్యాప్తు. అయితే, హయత్‌నగర్ డిపో–1 పరిధిలో మద్యం సేవించిన ఓ మహిళ మత్తులో దుర్భాషలాడింది. బస్సులో తోటి ప్రయాణికులు ఎంత చెప్పినా వినకుండా తీవ్ర అసభ్య పదజాలంతో దూషిస్తూ కండక్టర్‌పై దాడికి దిగింది. కాగా, మహిళా కండక్టర్‌ను తన్నిన వీడియో సోషల్ మీడియాలో ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఈ వీడియోలో రూ. 500లకు చిల్లర లేకపోవడంతో దిగిపోవాలని కండక్టర్ సూచించినట్లు తెలిసింది. దీంతో, సదరు ప్రయాణికురాలు హల్‌చల్ చేసింది.

# నెక్ట్స్ ఎవరు...?



'ఈ రోజు ఎవరట'.. నగరంలో ఇటీవల తరుచూ వినిపిస్తున్న పదం ఇది. భూ కబ్జాలపై ఫిర్యాదులు పెరుగుతుండగా, ఏ రోజుకారోజు కొత్తగా ఓ కార్పొరేటర్ పేరు వినిపిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల ఈ పదం చాలా పాపులరైంది. నగర చరిత్రలో గతంలో ఎన్నడూ లేని విధంగా భూ కబ్జాలపై కొనసాగుతున్న ఫిర్యాదులు.. విచారణ.. అరెస్టులు నగరపాలకసంస్థలో తీవ్ర ప్రకంపనాలు సృష్టిస్తున్నాయి.

**వందల సంఖ్యలో ఫిర్యాదులు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడం, గత బీఆర్ఎస్ హయాంలో జరిగిన భూ ఆక్రమణలపై ఫిర్యాదులు ఆహ్వానించడం తెలిసిందే. ఈ క్రమంలోనే పోలీసు కమిషనర్ భూ ఆక్రమణలపై విచారణకు ఏసీపీల ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను నియమించారు. భూ కబ్జాలపై ఫిర్యాదులు స్వీకరిస్తుండడంతో, వందలాది మంది బాధితులు ధైర్యంగా పోలీసుస్టేషన్ల తలుపు తడుతున్నారు. నగరవ్యాప్తంగా ఈ ఫిర్యాదులు వస్తుండగా ప్రధానంగా శివారు డివిజన్ల నుంచి ఎక్కువగా ఉన్నాయి. ఫిర్యాదుల్లో 90శాతం స్థానిక ప్రజాప్రతినిధులైన కార్పొరేటర్లపైనే కావడం ప్రస్తుతం సంచలనంగా మారింది.

**మరికొంతమందిపైనా విచారణ**

ప్రజల చేత ఎన్నుకోబడ్డ కార్పొరేటర్ల చుట్టూనే భూ కబ్జాల ఫిర్యాదులు తిరుగుతుండడం గమనార్హం. రోజురోజుకు భూ ఫిర్యాదులు పెరుగుతుండగా, ఆ ఫిర్యాదుల్లో ఎక్కడో ఒక చోట ఎవరో ఒక కార్పొరేటర్ పేరు బయటకు వస్తోంది. దీంతో సదరు కార్పొరేటర్లను ఎప్పటికప్పుడు పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో కొంతమంది అధికారాన్ని అడ్డం పెట్టుకొని సాగించిన భూదందాలు వెలుగు చూస్తుండగా, ఫిర్యాదులు వస్తున్న తీరు చూసి పోలీసులే ఆశ్చర్యపోతున్నారు. మంగళవారం నాటికి దాదాపు 15మంది వరకు కార్పొరేటర్లపైన ఫిర్యాదులు వచ్చాయంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే ఇందులో కొంతమంది భూ ఆక్రమణలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉండగా, మరికొంతమంది మాత్రం 'పంచాయితీ' చేసే క్రమంలో ఇరుక్కున్నట్లు ప్రచారం జరుగుతోంది. తమ డివిజన్‌లలో ఇరు వర్గాల నడుమ నెలకొన్న భూ వివాదాలను పరిష్కరించేందుకు గతంలో చేసిన పంచాయితీలు ఇప్పుడు భూ ఫిర్యాదుల రూపంలో వస్తున్నట్లు ఒకరిద్దరు కార్పొరేటర్లు విచారణలో వెల్లడించినట్లు సమాచారం.

నగరంలో భూ ఆక్రమణలపై కార్పొరేటర్లపై ఫిర్యాదులు వెల్లువెత్తుతుండగా, 18వ డివిజన్ కార్పొరేటర్ సుదగోని మాధవి కృష్ణాగౌడ్ మాత్రం రివర్స్‌గేర్ వేశారు. తమ డివిజన్ రేకుర్తి పరిధిలోని ఎస్ఆర్ఎస్పీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలంటూ ఎస్ఆర్ఎస్పీ, రెవెన్యూ, నగరపాలకసంస్థ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. సర్వే చేయించి కెనాల్ భూములను కాపాడాలంటూ ట్విస్ట్ ఇచ్చారు. ఏదేమైనా నగరచరిత్రలో తొలిసారిగా భూ ఆక్రమణలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుండడం, భూ దందాల్లో రోజుకో కార్పొరేటర్ పేరు వినిపిస్తుండడం నగరంలో తీవ్రచర్చకు దారితీస్తోంది.

భూ కబ్జాలపై ఫిర్యాదు చేయండి.. విచారణ జరిపి మీ భూములు మీకిప్పిస్తాం.. అంటూ రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల పదేపదే ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అందుకు అనుగుణంగా సీపీ ప్రత్యేక బృందాలను ఆచరణలోకి దింపారు. దీంతో భూ బాధితుల ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గతానికి భిన్నంగా ఫిర్యాదులు, విచారణ, చర్యలు కూడా వేగంగా జరుగుతుండడం ప్రస్తుతం ఆసక్తికర పరిణామం. భగత్‌నగర్, సీతారాంపూర్‌లలో భూ ఆక్రమణలు, దౌర్జన్యాల ఫిర్యాదులపై 12వ డివిజన్ కార్పొరేటర్ తోట రాములు, 21వ డివిజన్ కార్పొరేటర్ జంగిలి సాగర్‌ను ఇప్పటికే అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపండం తెలిసిందే. ఇందులో తోట రాములు బెయిల్‌పై విడుదల అయ్యారు. వీరే కాకుండా ఒకరిద్దరు కార్పొరేటర్లు కూడా అరెస్ట్ అవుతారనే ప్రచారం జోరుగా సాగుతోంది.

# విశేషాల సమాహారం రాష్ట్రపతి నిలయం



బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో పలు విశేషాలున్నాయి. చారిత్రక, పర్యాటక ప్రాముఖ్యతలూ ఉన్నాయి. ఇవన్నీ సందర్శకులకు తెలియజేసేందుకు ప్రత్యేకంగా ఓ కరపత్రాన్ని రూపొందించారు. మంగళవారం రాష్ట్రపతి నిలయంలో జరిగిన కార్యక్రమంలో పరిపాలనాధికారిణి రజని ఈ కరపత్రాన్ని ఆవిష్కరించారు. 97 ఎకరాల్లో ఉన్న రాష్ట్రపతి నిలయంలో ప్రజల కోసం 20 రకాల ప్రత్యేక విశేషాలను తీర్చిదిద్దామని, ఇవి ఆద్యంతం సందర్శకులను ఆకట్టుకుంటాయని రజని పేర్కొన్నారు. రాష్ట్రపతి నిలయం ప్రజల సందర్శనార్థం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు తెరచి ఉంటుందని, విద్యార్థులకు ఉచిత ప్రవేశమని, 20 మంది గైడ్స్ అందుబాటులో ఉంటారని ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో అడ్మిన్ అధికారి దులార్ మింగ్, అసిస్టెంట్ అడ్మిన్ ఆధికారి రాజేష్ యాదవ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఈ-కేవైసీతో ఏరివేత



ప్రజా పంపిణీ వ్యవస్థ సంస్కరణలో భాగంగా ఆహార భద్రత (రేషన్) కార్డులో ఇన్ అక్టివ్ యూనిట్ల (లబ్ధిదారులు)పై పౌరసరఫరాల శాఖ దృష్టి సారించింది. చనిపోయిన, అందుబాటులో లేని లబ్ధిదారులను గుర్తించేందుకు గత ఐదు మాసాలుగా రేషన్ ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగిస్తోంది. అయితే ఇప్పటి వరకు మహానగర పరిధిలో 69 శాతం ఈ-కేవైసీ మించలేదు. మిగిలిన 31 శాతం ఈ-కేవైసీకి దూరంగా ఉన్నారు. అయితే వీటిని ఇన్ అక్టివ్ యూనిట్లుగా అధికారులు అనుమానిస్తున్నారు. దేశ వ్యాప్తంగా కూడా కోట్లాది మంది ఈ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉండటంతో కేంద్ర ప్రభుత్వం ఈ గడువును పొడిగించింది. దీనికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం కూడా ఫిబ్రవరి నెలాఖరులోగా గడువును పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. వేలి ముద్రలు ఇచ్చి ఈ-కేవైసీ పూర్తి చేయని వారు త్వరగా పూర్తి చేయాలని సూచించింది. వాస్తవంగా గడువు పొడిగింపు గురవుతూ వస్తోంది. గత మూడు నెలల క్రితం వరకు లబ్ధిదారులు ఈకేవైసీ పూర్తి చేసేందుకు చాలా మంది రేషన్ దుకాణాల ముందు బారులు తీరారు. దాదాపు అందుబాటులో ఉన్న వారి ఈ-కేవైసీ పూర్తి అయినట్లు అధికారులు భావిస్తున్నారు.

**ఇనాక్టివ్ యూనిట్ల గుర్తింపు**

రేషన్ ఈ-కేవైసీ పునరుద్ధరణ ద్వారా అందుబాటులో లేని, మృతి చెందిన యూనిట్ల ఏరివేత ప్రక్రియ చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవంగా ఒక్కో షాపు పరిధిలో వందలాది యూనిట్లు అందుబాటులో లేనట్లు తెలుస్తోంది. రేషన్ కార్డులో లబ్ధిదారులుగా ఉన్న వారు చనిపోయినా వారి కుటుంబ సభ్యులు పేరును తొలగించకుండా రేషన్ డ్రా చేస్తూ వస్తున్నారు. అదేవిధంగా పెళ్లయినవారు, ఒక ప్రాంతం నుంచి వేరే ప్రాంతానికి వెళ్లిన వారు ఉన్నారు. దీంతో అసలైన లబ్ధిదారులు ఎంత మంది ఉన్నారో తెలుసుకునేందుకు ప్రభుత్వం ఈ-కేవైసీ ప్రక్రియ చేపట్టింది. ఇది పూర్తి చేసిన వారికే రేషన్ సరుకులు పంపిణీ చేయనుంది. వేలిముద్రలు ఇవ్వని సభ్యులను రేషన్ కార్డు నుంచి తొలగించే అవకాశాలున్నాయి. వాస్తవంగా ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ-పాస్ ప్రక్రియ తర్వా త ఇప్పటి వరకు కేవైసీ పునరుద్ధరణ జరుగలేదు. ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిన తర్వాతే కొత్త రేషన్ కార్డులపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

**మూడు లక్షల పైనే**

గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే అందుబాటులో లేని యూనిట్లు సుమారు మూడు లక్షలపైగానే ఉండవచ్చని పౌరసరఫరాల అ?ధికారులు అంచనా వేస్తున్నారు. అందులో మృతి చెందిన వారి యూనిట్లు (లబ్ధిదారులు) లక్షపైనే ఉన్నట్లు గుర్తించారు. మరోవైపు ఇప్పటివరకు ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న కుటుంబ సభ్యుల్లో అందుబాటులో లేని యూనిట్లు రెండు లక్ష వరకు ఉనట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలుస్తోంది.

# ఎన్నికల ముంగిట.. ఎన్నో ఆశలు..

## కీలక రైల్వే ప్రాజెక్టులకు ఎదురుచూస్తున్న తెలంగాణ



లోక్‌సభ ఎన్నికల ముందు ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావడంతో రైల్వే ప్రాజెక్టులకు భారీగానే కేటాయింపులు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. గత మూడు బడ్జెట్‌లలో లైన్లు, రైళ్ల పరంగా నిరాశే కలిగినా, కేటాయింపులు కొంత మెరుగ్గానే ఉన్నాయి. కానీ, తెలంగాణలో రైల్వేపరంగా ఉన్న డిమాండ్లతో పోలిస్తే, ఇవి సరిపోవు. దీంతో ప్రతీ బడ్జెట్ ఇంకా మెరుగ్గా ఉంటుందన్న ఆశతో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

బడ్జెట్ ముందు ఎంపీలతో భేటీ అయ్యి వారి నుంచి అధికారులు ప్రతిపాదనలు స్వీకరిస్తారు. కానీ ఈసారి అలాంటి భేటీ దక్షిణమధ్య రైల్వే నిర్వహించలేదు. తను కూడా ప్రత్యేకంగా ప్రతిపాదనలు పంపలేదని తెలిసింది.

**ఆయా రైల్వే లైన్లు ఇలా....**

ఆర్మూరు-ఆదిలాబాద్ : ఈ లైన్ కీలకం. దీనికోసం బీజేపీ ఎంపీలు ధర్మపురి అరవింద్, సోయంబాపూరావు, బండి సంజయ్ లాంటి వారు డిమాండ్ చేస్తున్నారు.

- **15 ఏళ్ల క్రితం పటాన్‌చెరు%--%ఆదిలాబాద్ లైన్ మంజూరైంది. ఆర్మూరు%--% నిర్మల్ మీదుగా సాగాల్సిన దీని నిడివి. 317 కి.మీ. ఇందుకు రూ.3771 కోట్లు ఖర్చవుతుదని అంచనా వేశారు. కానీ, ఆ తర్వాత దానిని కేంద్రం పక్కనపెట్టింది.**
- **పెద్దపల్లి-నిజామాబాద్ లైన్ పూర్తయిన నేపథ్యంలో కొత్త ప్రతిపాదన పట్టాలెక్కింది. కరీంనగర్-నిజామాబాద్ లైన్‌లో ఉన్న ఆర్మూరు స్టేషన్ నుంచి కొత్త లైన్ మొదలై ముదేడ్-నాగ్‌పూర్ లైన్‌లో ఉన్న ఆదిలాబాద్ స్టేషన్‌తో అనుసంధానమవుతుంది. దీని నిడివి 300 కి.మీ., రూ. 2800 కోట్ల అంచనాతో 2017లో ఈ లైన్ మంజూరైంది. సర్వే పూర్తయ్యాక పనులు పట్టాలెక్కలేదు. దీనికి నిధులు కేటాయించాలన్న ఒత్తిడి పెరిగింది.**

వికారాబాద్-కృష్ణా: తెలంగాణ సీఎం మొదలు కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు గట్టిగా డిమాండ్ చేస్తున్న ప్రాజెక్టు వికారాబాద్-కృష్ణా లైను. గత బడ్జెట్‌లో ఫైనల్ లొకేషన్ సర్వే కూడా మంజూరైనా పనులు మొదలు కాలేదు.


- **వికారాబాద్-పరిగి-కొడంగల్-దౌలతాబాద్-మక్తల్-నారాయణపేట్-కృష్ణా మీదుగా 122 కి.మీ.మేర కొనసాగే ఈ ప్రాజెక్టుకు రూ.2196 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. రైల్వే కనెక్టివిటీ లేని కొత్త ప్రాంతాలకు ఆ రవాణా వసతి కల్పిస్తుంది. ఇటీవలే దక్షిణ మధ్య రైల్వే జీఎంతో సీఎం భేటీ అయి దీనిపై చర్చించారు. ఈ రెండు తెలంగాణకు కీలక ప్రాజెక్టులు కావటంతో వీటి కేటాయింపులపై ఆశలు పెరుగుతున్నాయి.**

**రాష్ట్రానికొచ్చేసరికి....**

మనోహరాబాద్-కొత్తపల్లి లైన్‌కు, కాజీపేట వ్యాగన్ ఫ్యాక్టరీకి భారీగానే కేటాయింపులుంటాయని, కాజీపేట-బల్లార్షా, కాజీపేట-విజయవాడ మూడో లైన్‌కు కూడా ప్రాధాన్యం దక్కుతుందని భావిస్తున్నారు. భద్రాచలం-కొవ్వూరు, రామగుండం-మణుగూరు ప్రాజెక్టు విషయంలోనూ ఒత్తిడి పెరుగుతోంది. ఎంఎంటీఎస్ రెండోదశ, యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ పొడిగింపు విషయంలో రాష్ట్రప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది.

గత బడ్జెట్‌లో దక్షిణ మధ్య రైల్వేకు కేంద్రం రూ. 13786.19 కోట్లు కేటాయించింది. ఇందులో తెలంగాణ రాష్ట్ర వాటా రూ. 4418 కోట్లు. 2022%--%23లో కేటాయించిన మొత్తం రూ. 8349.75 కోట్లు. ఇందులో తెలంగాణ వాటా రూ. 3048 కోట్లు.

# అయోధ్య చేరేదెలా?



ప్రతి సంవత్సరం కేంద్రం ప్రవేశపెట్టే బడ్జెట్ ఒక ప్రహసనంగా మారింది. ఏటేటా బడ్జెట్‌లు వస్తూనే ఉన్నాయి. కానీ హైదరాబాద్ ప్లాట్‌ఫాంపైన ఆగడం లేదు. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్ పడడం లేదు. లక్షలాది మంది భక్తులు, యాత్రికులు సందర్శించుకొనే పుణ్యక్షేత్రాలకు రైళ్లు అందుబాటులో లేకపోవడం వల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆబాల గోపాలాన్ని అలరించే అయోధ్య బాలరాముడు కొలువైన అయోధ్యకు చేరుకొనేందుకు హైదరాబాద్ నుంచి ఒక్క రైలు కూడా అందుబాటులో లేకపోవడం గమనార్హం. అలాగే షిరిడీ, వారణాసి తదితర ఏ పుణ్యక్షేత్రానికి వెళ్లాలనుకున్నా అరకొర రైళ్లు వెక్కిరిస్తున్నాయి. సుమారు 10 సంవత్సరాలుగా కొత్త రైళ్లు అందుబాటులోకి రాలేదు.

**అయోధ్యకు ప్రత్యేక రైళ్లా...**

అయోధ్యకు వెళ్లేందుకు రెగ్యులర్ రైళ్లు లేవు. ప్రయాణికులు దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో వారణాసి లేదా, దానాపూర్ వరకు చేరుకొని అక్కడి నుంచి మరో ట్రైన్‌లో కానీ, రోడ్డు మార్గంలో కానీ అయోధ్యకు వెళ్లవలసి ఉంటుంది. అలాగే జంటనగరాల మీదుగా వెళ్లే రైళ్లలో గోరఖ్‌పూర్, లక్నో నగరాలకు చేరుకొని అక్కడి నుంచి అయోధ్యకు వెళ్లాలి. ఇంటిల్లిపాది కలిసి వెళ్లాలంటే ఇది ఎంతో ప్రయాసతో కూడిన ప్రయాణం. పైగా ఆర్థికంగా కూడా భారమే. ప్రతి సంవత్సరం హైదరాబాద్ నుంచి లక్షలాది మంది భక్తులు అయోధ్యను సందర్శించే అవకాశం ఉంది. ఈ మేరకు ప్రయాణికులు ప్రతి రోజు రాకపోకలు సాగించే విధంగా సికింద్రాబాద్%--%అయోధ్య మధ్య కొత్తగా రైళ్లను ప్రవేశపెట్టాలని నగరవాసులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వరకు ఒకే ఒక్క రెగ్యులర్ రైలు నడుస్తోంది. ఈ ట్రైన్‌లో యూపీ, బీహార్, తదితర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు రాకపోకలు సాగించే వలస కార్మికుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వారణాసి వరకు భక్తులు కూడా వెళ్తారు. కానీ ప్రయాణికుల డిమాండ్ కారణంగా రిజర్వేషన్ లభించడం కష్టం. అయోధ్యకు వెళ్లేందుకు అందుబాటులో ఉన్న ట్రైన్ కూడా ఇదొక్కటే. బాలరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేసినప్పటి నుంచి ఈ ట్రైన్‌కు ప్రయాణికుల రద్దీ బాగా పెరిగింది. భవిష్యత్తులో ప్రయాణికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

మరోవైపు ప్రస్తుతం రైల్వేశాఖ నియోజకవర్గాల వారీగా ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసింది. ఈ రైళ్లలో వెళ్లాలంటే ఆధ్యాత్మిక సంస్థల్లో నమోదు చేసుకొన్న వాళ్లకు మాత్రమే అవకాశం లభిస్తుంది. పైగా ఫిబ్రవరి నెలాఖరు వరకే ఈ రైళ్లు పరిమితం. ఆ తరువాత అయోధ్య టూర్‌కు ఐఆర్‌సీటీసీ ప్యాకేజీలే శరణ్యం. ఈ పర్యాటక ప్యాకేజీలు వారం నుంచి 10 రోజుల వరకు ఉంటాయి. ఇది ఆర్థికంగా భారమే కాకుండా కేవలం అయోధ్య వరకే వెళ్లి రావాలనుకొనేవాళ్లకు సాధ్యం కాదు. ఈ మేరకు హైదరాబాద్ నుంచి న్యూఢిల్లీకి నడిచే తెలంగాణ ఎక్స్‌ప్రెస్ తరహాలో అయోధ్య ఎక్స్‌ప్రెస్‌ను ప్రవేశపెట్టాలని నగరవాసులు కోరుతున్నారు.

**వారణాసికి ఉన్నది ఒక్కటే...**

కోట్లాదిమంది భక్తులు సందర్శించే మరో అద్భుతమైన ఆధ్యాత్మిక క్షేత్రం వారణాసి0. ప్రధాని మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న వారణాసికి దేశవ్యాప్తంగా భక్తుల రద్దీ గణనీయంగా పెరిగింది. వారణాసికి వెళ్లాలన్నా ప్రస్తుతం సికింద్రాబాద్ నుంచి దానాపూర్‌కు వెళ్లే రైలే దిక్కు. ఈ రైల్లో ప్రతి రోజు 180 శాతం వరకు ఆక్యుపెన్సీ ఉంటుంది.

**షిరిడీకి ఉన్నది ఒక్కటే...**

లక్షలాది మంది భక్తులు సందర్శించే షిరిడీకి సైతం రైళ్ల కొరత వెంటాడుతోంది. అజంతా ఎక్స్‌ప్రెస్ ఒక్కటే ప్రస్తుతం అందుబాటులో ఉంది. కాకినాడ నుంచి సికింద్రాబాద్ మీదుగా సాయినగర్ వరకు మరో రైలు రాకపోకలు సాగిస్తుంది. కానీ ఈ ట్రైన్ కాకినాడలోనే 100 శాతం ఆక్యుపెన్సీతో బయలుదేరుతుంది. హైదరాబాద్‌లో హాల్టింగ్ సదుపాయం ఉన్నా రిజర్వేషన్‌లు లభించవు. దీంతో నగరవాసులు ఒక్క అజంతాపైన ఆధారపడవలసి వస్తోంది.

# సుంకిశాలకు అధికారులు

మహానగరానికి తాగునీరు అందించే కృష్ణా తాగు నీటి సరఫరా పథకంలో భాగంగా నిర్మిస్తున్న సుంకిశాల ప్రాజెక్టు పనులను మంగళవారం జలమండలి ఎండీ సుదర్శన్ రెడ్డి పరిశీలించారు. 'సాక్షి' దిన పత్రికలో 'ఇంకెన్నాళ్లు' పేరిట సుంకిశాల పనుల్లో జాప్యంపై కథనం ప్రచురితమైంది. దీనికి జలమండలి స్పందించింది. ఎండీ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, ఇంజినీరింగ్ బృందం హుటాహుటిన సుంకిశాలకు చేరుకొని పనులను పరిశీలించింది. సుంకిశాల హెడ్‌వర్క్స్,అండర్ గ్రౌండ్ షాఫ్ట్, ఇన్‌టెక్ టన్నెలింగ్, పంప్‌హౌస్, పైపులైన్ల నిర్మాణం పనులు జరిగే ప్రాంతాలను సందర్శించారు.

పనులు వేగవంతంగా జరిగే విధంగా చర్యలు చేపట్టాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మహానగరానికి తాగు నీటిని అందిస్తున్న నాగార్జునసాగర్ జలాశయంలో నీటి మట్టం డెడ్ స్టోరేజీకి చేరినప్పటికీ నీటి తరలింపునకు ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు రెండేళ్ల క్రితం భారీ అంచనా వ్యయంతో సుంకిశాల ఇన్‌టెక్ వెల్ ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. గతేడాది జూన్ నాటికి సుంకిశాల పథకం పనులు పూర్తి చేసే విధంగా నిర్మాణ సంస్థకు గడువు విధించారు. ఆ తర్వాత ప్రాజెక్టు నిర్మాణ గడువును 2024 వేసవి నాటికి పెంచారు. ఇప్పటి వరకు పనుల పురోగతి అంతంతగా కొనసాగుతుండటంతో తాజాగా ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి గడువు పెంచినా..పనులు పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

**ఈసారీ ప్రత్యామ్నాయమే..**

నాగార్జున సాగర్ జలాశయం నీటి మట్టం అడుగంటడంతో ఈ వేసవిలో కూడా అత్యవసర పంపింగ్ కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకునే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం నాగార్జునసాగర్‌లోని పుట్టంగండి పంప్‌హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ ద్వారా సేకరించి మహానగరానికి నిత్యం 270 ఎంజీడీలు తరలిస్తున్నారు. వేసవిలో నాగార్జునసాగర్‌లో నీటి మట్టాలు 510 అడుగుల దిగువనకు చేరినప్పుడు సాగర్ బ్యాక్ వాటర్ వద్ద డ్రెడ్జింగ్ ప్రక్రియను చేపట్టి భారీ మోటార్లతో పంపింగ్ చేయాల్సి వస్తోంది. ఇందు కోసం రూ.కోట్లు వెచ్చించాల్సి వస్తోంది. సుంకిశాల పూర్తయితే ఈ రిస్క్ తప్పే అవకాశం ఉంది.



# Narsingi Drugs Case
# బెంగళూరు టు హైదరాబాద్



- డ్రగ్స్ డేటా తీస్తున్న నార్సింగి పోలీసులు
- గతంలోనే లావణ్య, ఉనీత్‌రెడ్డిలపై రెండు డ్రగ్స్ కేసులు
- లావణ్య కస్టడీ పిటిషన్ వేసిన పోలీసులు, పరారీలో ఉనీత్‌రెడ్డి

లావణ్య ఫోన్ కాంటాక్ట్ లిస్ట్, కాల్ డేటా, సోషల్ మీడియా చాట్‌ల ఆధారంగా డ్రగ్స్ రాకెట్‌పై నార్సింగి పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. లావణ్యతోపాటు ఉనీత్‌రెడ్డిలపై 2022లో గుంటూరు జిల్లా పట్టాభిపురం, 2023లో మోకిల పోలీస్‌స్టేషన్లలో డ్రగ్స్ కేసులు నమోదైన విషయాన్ని పోలీసులు గుర్తించారు. లావణ్యకు పలువురు టాలీవుడ్ నటులు, వీఐపీలతో పరిచయాలు ఉన్నట్టు గుర్తించారు.

లావణ్య, ఉనీత్‌రెడ్డిలు బెంగళూరులో రూ. 1,500లకు గ్రాము చొప్పున కొనుగోలు చేసి హైదరాబాద్‌లో రూ. 6,000 వరకు విక్రయిస్తున్నట్టు సమాచారం. విజయవాడ నుంచి ఉన్నత చదువులకు హైదరాబాద్ వచ్చి హోటల్ మేనేజ్‌మెంట్ చేసిన లావణ్య, ఆ రంగంలో స్థిరపడకుండా..మ్యూజిక్ నేర్చుకుంది. అదే క్రమంలో షార్ట్ ఫిలింలు, పలు చిన్న సినిమాల్లో క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అవకాశాలు దక్కించుకుంది.

మరిన్ని సినిమా చాన్స్‌ల కోసం ప్రయత్నిస్తోంది. ఉనీత్‌రెడ్డి కూడా షార్ట్ ఫిల్మ్‌లలో నటించాడు. ఉనీత్‌రెడ్డి బెంగళూరు నుంచి డ్రగ్స్ తెప్పించి లావణ్య,తోపాటు తన గర్ల్ ఫ్రెండ్. తదితరులు ఇచ్చేవాడు. వారు వాడటమే కాకుండా, ఇతరులకు విక్రయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. లావణ్యకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించిన విషయం తెలిసిందే. ఆమెను తమ కస్టడీకి తీసుకొని లోతుగా విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు నుంచి అనుమతి రాగానే పూర్తిస్థాయి విచారణ చేస్తే మరిన్ని వివరాలు బయటకు వచ్చే అవకాశముంది. ఉనీత్‌రెడ్డి పరారీలో ఉన్నాడని, అతడి ని పట్టుకుంటామని పోలీసులు చెబుతున్నారు.

# హైదరాబాద్‌ను డ్రగ్స్ ఫ్రీ సిటీగా మారుస్తాం



డ్రగ్స్ ఫ్రీ సిటీగా హైదరాబాద్‌నుమార్చడమే ఇందిరమ్మ రాజ్యం లక్ష్యం అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ పరిపాలన అందిస్తామని, అభివృద్ధి..సంక్షేమమే తప్ప డ్రగ్స్ ఉండదన్న భరోసా హైదరాబాద్ ప్రజలకు కల్పించాలన్నారు. డ్రగ్స్ విక్రయాలకు చోటులేదని, నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మంగళవారం సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలో వేర్వేరుగా జరిగిన జూబ్లీహిల్స్, సనత్‌నగర్ కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ బూత్ కమిటీల సమావేశానికి డిప్యూటీ సీఎం భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాంతాలు, మతాల పేరిట విభజన చేసి ప్రజలను రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల ఉపేక్షించమన్నారు. పోలీస్, రెవెన్యూ, హెల్త్, పౌరసరఫరాలు, జీహెచ్ఎంసీ అన్ని వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా పనిచేయిస్తామని చెప్పారు. ప్రజలు ఈ వ్యవస్థలు, సంస్థలు తమ కోసమే ఏర్పాటు చేశారన్న భావన కల్పించేలా పాలన ఉంటుందన్నారు.

**బీఆర్ఎస్ బండారం బయటపెడతాం..**

ఇంటికో ఉద్యోగం, ఊరికో బడి, కేజీ టు పీజీ, మూడు ఎకరాల భూ పంపిణీ, దళిత సీఎం, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కట్టిస్తామని వాగ్దానాలు చేసి పదేళ్లు అధికారంలో ఉండి, అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిన గత బీఆర్ఎస్ పాలకులు నలభై రోజులు నిండని కాంగ్రెస్ ప్రభుత్వంపై గ్యారంటీలు అమలు చేయడం లేదంటూ నోటికి వచ్చినట్టు మాట్లాడటానికి సిగ్గుందా? బుద్ధి ఉందా? అంటూ భట్టి మండిపడ్డారు. రాష్ట్ర సంపద, వనరులను దోపిడీ చేసిన గత బీఆర్ఎస్ పాలకులు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసి, పుట్టబోయే బిడ్డపై కూడా అప్పుల భారం మోపారని దుయ్యబట్టారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో సృష్టించిన ఆస్తులను బీఆర్ఎస్ పాలకులు అమ్ముకొని బతికారని, హైదరాబాద్ అభివృద్ధికి వారు చేసింది ఏమీ లేదని విమర్శించారు. ప్రభుత్వం, ప్రజలకు మధ్యన కాంగ్రెస్ శ్రేణులు వారధులుగా పనిచేసి ఆరు గ్యారంటీలు ప్రజ లకు అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జాతీయనేత జెట్టి కుసుమకుమార్, అజారుద్దీన్, అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

# మళ్లీ పునర్వ్యవస్థీకరణ!



- నీటిపారుదల శాఖ నైపుణ్యం, పనితీరుపై సందేహాల నేపథ్యంలో సర్కారు నిర్ణయం
- సీడీఓ, హైడ్రాలజీ విభాగాలకు మళ్లీ స్వతంత్రత
- డ్రాయింగ్స్, డిజైన్లు, నీటిలభ్యత అధ్యయనాల్లో లోపాల నివారణ
- ఐడీసీ లిఫ్టులకు పునరుజ్జీవం పోసేందుకు చర్యలు
- పునర్వ్యవస్థీకరణపై సమగ్ర నివేదిక కోరిన రాష్ట్ర ప్రభుత్వం
- త్వరలో సమీక్ష జరిపి నిర్ణయం తీసుకునే అవకాశం

నీటిపారుదల శాఖను మళ్లీ పునర్వ్యవస్థీకరణ చేసే దిశగా కాంగ్రెస్ సర్కార్ యోచి స్తోంది. 2020 డిసెంబర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నీటిపారుదలశాఖను పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి నిర్లక్ష్యం, నిరాదరణకు గురైన విభాగాలు, ప్రాజెక్టులను గుర్తించి బలోపేతం చేయాలని ప్రస్తుత సర్కారు నిర్ణయించింది. తెలంగాణ వచ్చాక చేపట్టిన ప్రాజె క్టులు, తీసుకున్న నిర్ణయాలపై రాష్ట్ర నీటిపారుదలశాఖ సమగ్ర నివేదికను సిద్ధం చేస్తోంది.

కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నాణ్యత ప్రశ్నార్థకంగా మారడంతో రాష్ట్ర నీటిపారుదల శాఖ ఇంజనీరింగ్ నైపుణ్యం, పనితీరుపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. శాఖ పునర్వ్యవస్థీకరణ తర్వాత జరిగిన లాభనష్టాలపై నివేదిక అందిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. అవసరమైతే మళ్లీ శాఖను పునర్వ్యవస్థీకరించి గాడిలో పెట్టాలని భావిస్తోంది.

**ప్రభ కోల్పోయిన 'సీడీఓ'**

కేంద్ర జలసంఘం(సీడబ్ల్యూసీ) అక్రిడిటేషన్ ఉన్న ప్రతిష్టాత్మక సంస్థల్లో మన రాష్ట్ర నీటిపారుదల శాఖలోని 'సెంట్రల్ డిజైన్స్ ఆర్గనైజేషన్'(సీడీఓ) ఒకటి. దేశంలోని కొన్ని రాష్ట్రాల సీడీఓలకు మాత్రమే ఈ గుర్తింపు ఉంది. సాగునీటి ప్రాజెక్టుల డ్రాయింగ్స్, డిజైన్లకు సీడీఓ ఆమోదిస్తూ ధ్రువీకరణ పత్రం జారీ చేస్తేనే, ఆయా ప్రాజెక్టుల అంచనాలను కేంద్ర జల సంఘం ఆమోదిస్తుంది. ఉమ్మడి రాష్ట్రంలో చీఫ్ ఇంజనీర్(సీఈ) నేతృత్వంలో 'సీడీఓ'స్వయంప్రతిపత్తి గల సంస్థగా పనిచేసేది. అప్పట్లో నిష్ణాతులైన ఇంజనీరింగ్ నిపుణులను మాత్రమే నియమించేవారు. ప్రాజెక్టుల డ్రాయింగ్స్,

డిజైన్ల రూపకల్పన, ఆమోదానికి సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో సీడీఓ స్వతంత్రంగా వ్యవహరించేది.

దానిపై నీటిపారుదలశాఖ ఈఎన్సీల అజమాయిషీగానీ, ఒత్తిడి గానీ ఉండేది కాదు. 2020 చేపట్టిన నీటిపారుదల శాఖ పునర్వ్యవస్థీకరణలో సీడీఓ స్వతంత్రతను కోల్పోయింది. ఈ విభాగాన్ని ఈఎన్సీ(జనరల్) పర్యవేక్షణ కిందకు తెచ్చి అందులో పనిచేసే ఇంజనీర్ల సంఖ్యనూ సగానికి పైగా కుదించేశారు. తర్వాత సరైన అధ్యయనాలు లేకపోయినా అత్యవసరంగా ఆమోదించాలని ఒత్తిడి పెంచి తమ వద్ద ప్రాజెక్టుల డిజైన్లు, డ్రాయింగ్స్‌కు ఆమోదం పొందారని ఆరోపిస్తూ సీడీఓ చీఫ్ ఇంజనీర్ ఇటీవల ఈఎన్సీ(జనరల్)కి లేఖ రాయడం విశేషం.

ఈఎన్సీ(జనరల్)కు సర్వాధికారాలు కట్టబెట్టే రీతిలో పునర్వ్యవస్థీకరణ జరగడంతో స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే విభాగాలు ప్రాధా న్యం కోల్పోయాయి. హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర జలవనరులు, ఆయకట్టు అభివృద్ధి సంస్థ(కాడా)లు సైతం గతంలో స్వతంత్రంగా పనిచేసేవి. మళ్లీ ఈ విభాగాలకు స్వతంత్రత ఇస్తే ప్రాజెక్టుల డిజైన్లు, నీటిలభ్యత అధ్యయనాలను స్వేచ్ఛగా నిర్వహించే అవకాశముంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఐడీసీ లిఫ్టులకు తాళాలు**

కాల్వల ఆధునీకరణ, ఆయకట్టు అభివృద్ధి, సత్వర సాగునీటి ప్రయోజన పథకం(ఏఐబీపీ), ప్రపంచ బ్యాంకు పథకాలు, నీటి సంఘాల నిర్వహణ చూసే కాడాకు గతంలో ఐఏఎస్‌లు బాస్‌లుగా ఉండేవారు. ఇప్పుడు సూపరింటెండెంట్ ఇంజనీర్ స్థాయికి పరిమితం చేశారు. సాగునీటి అభివృద్ధి సంస్థ పరిధిలో 4.56లక్షల ఎకరాలకు నీరందించే 637 చిన్న ఎత్తిపోతల పథకాలున్నాయి. అందులో 216 పూర్తిగా, 137 పాక్షికంగా పనిచేస్తున్నాయి. 193 పూర్తిగా దెబ్బతిన్నాయి. 91 లిఫ్టులు అవసరం లేదని తాళాలు వేశారు. ప్రస్తుతం 2.18 లక్షల ఎకరాలకే సాగునీరు అందుతోంది. పునర్వ్యవస్థీకరణలో ఐడీసీ ప్రాజెక్టులు 19 మంది చీఫ్ ఇంజనీర్ల పరిధిలోకి వెళ్లగా, చిన్న లిఫ్టులను నిర్లక్ష్యం చేశారు.

**ప్రాజెక్టుల నిర్వహణ గందరగోళం**

పునర్వ్యవస్థీకరణ తర్వాత ప్రాజెక్టుల నిర్వహణ విషయంలో గందరగోళం నెలకొందని ఆ శాఖ ఇంజనీర్లు పేర్కొంటున్నారు.

- గతంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టును ఒక చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షించేవారు. ఎడమకాల్వ ద్వా రా విడుదల చేసే నీరు ఏపీలోని పశ్చిమగోదావరి జిల్లాకు చేరేవరకు ఆయనే పర్యవేక్షించేవారు. ప్రస్తుతం సాగర్ ఎడమ కాల్వ నిర్వహణను సూర్యాపేట చివరి వరకు నల్లగొండ సీఈ, ఆ తర్వాత నుంచి రాష్ట్ర సరిహద్దుల వరకు ఖమ్మం సీఈ పర్యవేక్షిస్తున్నారు.
- అడ్మిన్ కమ్ చీఫ్ ఇంజనీర్ పర్యవేక్షణలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఉండేది. ఇప్పుడు నిజామాబాద్, జగిత్యాల, వరంగల్, ములుగు, సూర్యాపేట, రామగుండం(పెద్దపల్లి) చీఫ్ ఇంజనీర్ల నిర్వహణలోకి ఈ ప్రాజెక్టు వెళ్లింది.
- కాళేశ్వరం ఈఎన్సీ(గజ్వేల్) పరిధి సిద్దిపేట వరకు మాత్రమే. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఈఎన్సీ(రామగుండం) పరిధిలోకి వస్తాయి.
- పాలమూరు%--%రంగారెడ్డి ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ నాగర్‌కర్నూలు సీఈ పరిధిలో ఉండగా, వన పర్తి, మహబూబాబాద్, హైదరాబాద్ సీఈలు కాల్వలు, రిజర్వాయర్లు నిర్మిస్తున్నారు.
- ఒకే ప్రాజెక్టుకు సంబంధించిన సమీక్ష చేయాలన్నా, ఏదైనా నిర్ణయం అమలు చేయాలన్నా అందరూ ఈఎన్సీలు, చీఫ్ ఇంజనీర్లతో మాట్లాడాల్సిందే. గతంలో మేజర్, మీడియం, మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టులను ప్రత్యేక విభాగాల వారీగా పర్యవేక్షించేవారు. ఇప్పుడు అన్ని ప్రాజెక్టులను ఒకే గొడుగు కిందకు తీసుకురావడంతో క్షేత్రస్థాయిలో ఆయా ప్రాజెక్టుల నిర్వహణలో గందరగోళం ఏర్పడింది.
- మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి నిర్వహణలోపం కూడా ఒక కారణంగా తేల్చగా, నిర్వహణను ఓఅండ్ఎం విభాగానికి అప్పగించారా? లేదా? అన్న దానిపై స్పష్టత కొరవడింది. డిఫెక్ట్ లయబిలిటీ కాలం పూర్తయ్యిందని, నిర్మాణ సంస్థ పట్టించుకోలేదని, నిర్మాణ సంస్థదే బాధ్యత అని నీటిపారుదలశాఖ నిర్లక్ష్యం చేసిందని ఆరోపణలున్నాయి.

# వ్యవసాయానికి రూ.1.33 లక్షల కోట్ల రుణం

- పరిశ్రమలు సహా అన్ని రంగాలకు కలిపి రూ.2.80 లక్షల కోట్లు
- వచ్చే ఆర్థిక సంవత్సర రుణ ప్రణాళికలో ఖరారు చేసిన నాబార్డు
- గత రుణ ప్రణాళికతో పోలిస్తే రూ.94 వేల కోట్లు అదనం
- బ్యాంకుల చేయూత మరింత పెరగాలి: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రాష్ట్రంలో వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు రూ. 1.33 లక్షల కోట్ల రుణాలు ఇచ్చేలా జాతీయ వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రుణ ప్రణాళికను ఖరారు చేసింది. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు, ఇతర రంగాలు సహా మొత్తంగా రూ. 2.80 లక్షల కోట్ల రుణాలకు పచ్చజెండా ఊపింది. ఇది గతేడాది రుణ ప్రణాళికతో పోలిస్తే రూ. 94 వేల కోట్లు అదనం కావటం విశేషం. మంగళవారం మధ్యాహ్నం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ రుణ ప్రణాళికతో కూడిన ఫోకస్ పేపర్‌ను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విడుదల చేశారు.

**వ్యవసాయ అనుబంధ రంగాలకే పెద్దపీట**

వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు వచ్చే ఆర్థిక సంవత్సరంలో బ్యాంకుల నుంచి భారీ చేయూతనే లభించే అవకాశం ఉంది. రూ. 133587.86 కోట్ల రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లకు నాబార్డు సూచించింది. మొత్తం రుణ ప్రణాళికలో వ్యవసాయం, అనుబంధ రంగాలకు పెద్దపీట వేయటం విశేషం. నడుస్తున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణ ప్రణాళికలో నాబార్డు ఖరారు చేసిన మొత్తం రూ. 1,12,762 కోట్లు మాత్రమే కావటం గమనార్హం.

వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖరారైన వ్యవసాయ రుణాల్లో.. పంటల సాగు, మార్కెటింగ్ కోసం రూ. 81,478.02 కోట్లు, టర్మ్‌లోన్‌ల కింద రూ. 27,664.91 కోట్లు, వ్యవసాయ రంగంలో మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు రూ. 5197.26 కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాలకు రూ. 19,247.67 కోట్ల రుణాలను ఇవ్వాలని బ్యాంకర్లకు సూచించింది. వ్యవసాయ రంగం తర్వాత సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు రుణాలను ఖరారు చేసింది. ఈ రంగానికి రూ. 1,29,635.83 కోట్ల వరకు రుణాల రూపంలో ఇవ్వవచ్చని బ్యాంకర్లకు సూచించింది.

**బ్యాంకర్లు మరింత సాయానికి ముందుకు రావాలి: తుమ్మల**

దేశ వ్యవసాయ రంగంలో తెలంగాణకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా బ్యాంకర్లు మరింత ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు రావాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం వ్యవసాయంపై ఫోకస్ చేస్తుండటాన్ని నాబార్డు, బ్యాంకర్లు గుర్తించాలని కోరారు. పాడిపరిశ్రమను ప్రోత్సహించేందుకు వ్యక్తిగత రుణాలు ఇవ్వాలని సూచించారు.

ఆ రంగంలో గేదెలపైనే ఎక్కువగా దృష్టిసారిస్తున్నారని, కానీ ఆవు పాల వృద్ధిని కోరుకుందామని, దీని వల్ల ఆరోగ్యంతోపాటు, మన సంస్కృతీ సంప్రదాయాలను ప్రోత్సహించినట్టవుతుందని మంత్రి తుమ్మల సూచించారు. పామాయిల్ సాగుకు కూడా మరింత ప్రోత్సాహం అవసరమన్నారు. వరి సాగు విస్తృతంగా సాగుతోందని, కానీ సంప్రదాయ తృణ ధాన్యాల వృద్ధిపై రైతులు దృష్టిసారించాలని మంత్రి కోరారు.

**నాగార్జున గ్రామీణ బ్యాంకు రుణంతోనే నా తొలి నామినేషన్**

తనకు వ్యవసాయం రంగం, అందుకు రుణాలిచ్చే గ్రామీణ బ్యాంకులతో మంచి అనుబంధం ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. తాను సాగు కోసం నాగార్జున గ్రామీణ బ్యాంకు నుంచి రుణం తీసుకునేవాడినని, 1983 తొలి నామినేషన్ కోసం కూడా ఆ బ్యాంకు నుంచే రుణం తీసుకున్నట్టు వెల్లడించారు.

**రైతు బంధు నిధులను పెంచుతాం: రఘునందన్‌రావు**

రాష్ట్రంలో ప్రతి రెండున్నర వేల మంది రైతులకు ఒకటి చొప్పున ఉన్న రైతు వేదికలను ఆధునికీకరించటం ద్వారా వాటి వినియోగాన్ని పెంచి రైతులకు మరింత ఉపయోగకరంగా మారుస్తామని వ్యవసాయ శాఖ ముఖ్యకార్యదర్శి రఘునందన్‌రావు వెల్లడించారు. వాటిల్లో టూ వే ఆడియో విజువల్ వ్యవస్థ ఏర్పాటు చేస్తామన్నారు. త్వరలో క్రాప్ ఇన్‌స్రూటన్స్ పథకాన్ని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. రైతు భరోసా ద్వారా ప్రస్తుతం అందుతున్న రైతు బంధు నిధులను పెంచుతున్నట్లు చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో వీలైనన్ని రంగాలను అభివృద్ధి చేసేందుకు నాబార్డు తీవ్రంగా కృషి చేస్తోందని, వాటి అవసరాలకు తగ్గట్టుగా రుణాలు అందేలా చర్యలు తీసుకుంటోందని ఆ సంస్థ సీజీఎం సుశీల చింతల పేర్కొన్నారు. ఆర్బీ డీజీఎం రాజేంద్రప్రసాద్, ఎస్‌బీఐ జీఎం, ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ దేబాశీష్ మిత్ర తదితరులు పాల్గొన్నారు.

## 2024-25 సంవత్సరానికి వివిధ రంగాలకు నాబార్డు ఖరారు చేసిన రుణ ప్రణాళిక

- వ్యవసాయం, అనుబంధ రంగాల రూ.133587.86 కోట్లు
- సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు రూ. 129635.83 కోట్లు
- ఎగుమతుల కోసం రుణాలు రూ. 451.67 కోట్లు
- విద్య రూ.2706.50 కోట్లు
- గృహనిర్మాణం రూ.10768.58 కోట్లు
- పునరుత్పాదక విద్యుత్తు రూ.566.61కోట్లు
- ఇతర రంగాలు రూ.2283.51



# వైద్య విద్యలో 'వెనుకబాటు'

- దేశవ్యాప్తంగా తగ్గిపోతున్న అణగారిన వర్గాల విద్యార్థుల సంఖ్య
- ఎంబిబిఎస్‌లో ఓబీసీలు 24.4%
- ఎస్సీ, ఎస్టీలు 12%
- ముస్లింలు 3.6%... ఓసీలు 57% ఉన్నట్లు కేంద్రం వెల్లడి
- ఎండీలో బీసీలు 22%.. ఎస్సీ, ఎస్టీలు 11.3%, ఓసీలు 59%..
- ఎంఎస్‌లో బీసీలు 21%... ఎస్సీ, ఎస్టీలు 10%.. ఓసీలు 63%
- డీఎం, ఎంసీహెచ్ సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 85 శాతం వరకు ఓసీలే

దేశవ్యాప్తంగా వైద్య విద్యలో అణగారిన వర్గాల సంఖ్య తక్కువగా ఉంటోంది. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం, ఇతర మైనారిటీలు తక్కువగా ఉంటున్నారు. ఎంబీబీఎస్‌లో కొంతమేరకు ఫర్వాలేదు కానీ, ఆపై స్థాయి మెడికల్ కోర్సుల్లో ఆయా వర్గాల శాతం తక్కువగా ఉండటంపై సామాజిక కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. ఇందులో ఓసీలు ఎక్కువగా ఉన్నట్లు కేంద్ర ప్రభుత్వ ఉన్నత విద్యా విభాగం చేపట్టిన సర్వేలో వెల్లడైంది. 2021%--%22లో వైద్య కోర్సుల్లో పాసైన వారిని ఆధారం గా చేసుకొని ఈ సర్వే నిర్వహించారు.

ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో 75 శాతం కాలేజీలను సర్వే చేశారు. ఎంబీబీఎస్, ఎండీ కోర్సుల్లో మహిళలు ఎక్కువగా ఉంటున్నా, ఎంఎస్, సూపర్ స్పెషాలిటీ కోర్సులకు వచ్చేసరికి వారి శాతం చాలా తక్కువగా ఉంటోంది. ఆ కోర్సులు సాధించడం, వాటిని పూర్తి చేయడానికి వయసు మీద పడటం ఒక కారణంగా చెబుతుండగా, పెళ్లి, పిల్లలు తదితర కారణాల వల్ల కూడా వాటిని చదవడానికి ముందుకు రావడం లేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**ఎంబీబీఎస్‌లో ఓబీసీలు 24.4%**

సర్వేలో భాగంగా ఎంబీబీఎస్ పాసైన 54,547 మందిని ఎంపిక చేశారు. వారిలో పురుషులు 26,474 మంది (49 శాతం), మహిళలు 28,073 (51 శాతం) మంది ఉన్నారు. ఎంబీబీఎస్‌లో ఎస్సీలు 4,539 మంది (పురుషులు 2,310 మంది, మహిళలు 2,229 మంది) ఉండగా, వీరి శాతం 8.3గా ఉంది. ఇక ఎస్టీలు 2,100 మంది (పురుషులు 1008, మహిళలు 1092 మంది) ఉన్నారు.

వీరి శాతం 3.8 శాతంగా ఉంది. ఓబీసీల్లో మొత్తం 13,350 మంది (పురుషులు 6,682, మహిళలు 6,668 మంది) ఉండగా, వీరు 24.4 శాతంగా ఉన్నారు. దివ్యాంగులు 112 (0.2 శాతం) మంది ఉన్నారు. ముస్లింలు 2,005 మంది ఉన్నారు. వారిలో పురుషులు 929 మంది, మహిళలు 1079 మంది ఉన్నారు. వీరి శాతం 3.6 శాతంగా ఉంది. ఇతర మైనారిటీలు 1,178 (2.1శాతం) ఉన్నారు. ఈడబ్ల్యూఎస్‌లో 210 (0.4 శాతం) మంది ఉన్నారు. ఇక ఓసీలు 57 శాతం మంది ఉన్నారు.

**ఎండీల్లో ఎస్సీ, ఎస్టీలు 11.3%**

ఎండీ కోర్సుల్లో జనరల్ మెడిసిన్, అనెస్థీయా, చెస్ట్, రేడియాలజీ, పాథాలజీ, పీడియాట్రిక్ వంటివి వస్తాయి. ఎండీ కోర్సుల్లో 15,732 మందిని సర్వే చేశారు. అందులో పురుషులు 7,343 (46 శాతం), మహిళలు 8,389 (54 శాతం) మంది ఉన్నారు. ఇక ఎస్సీలు 1220 (7.7 శాతం) మంది, ఎస్టీలు 561 (3.6 శాతం) మంది, ఓబీసీలు 3,404 (22 శాతం) మంది, దివ్యాంగులు 12 (0.08%) మంది, ముస్లింలు 543 (3.5%) మంది, ఇతర మైనారిటీలు 357 (2.2%) మంది, ఈడబ్ల్యూఎస్ 187 (1.2%) మంది ఉన్నారు. ఓసీలు 59 శాతంగా ఉన్నారు.

**ఎంఎస్ కోర్సుల్లో ముస్లింలు 3.3%**

ఎంఎస్ కోర్సుల్లో జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, గైనకాలజీ, చెవి, ముక్కు, కంటి తదితర సర్జరీ కోర్సులు




వస్తాయి. ఎంఎస్‌లో 4,713 మందిని సర్వే చేశారు. అందులో పురుషులు 2,521 (53%) మంది, మహిళలు 2,192 (47%) మంది ఉన్నారు. ఇక ఎస్సీలు 337 (7.1%) మంది, ఎస్టీలు 128 (2.7%), ఓబీసీలో 1021 (21.6%) మంది, ముస్లింలు 155 (3.3%) మంది, ఇతర మైనారిటీలు 102 (2.1%) మంది, ఈడబ్ల్యూఎస్‌లో 8 (0.2%) మంది ఉండగా, ఓసీలు 63 శాతంగా ఉన్నారు.

**డీఎం కోర్సుల్లో ఓసీలు 89 శాతం**

మెడికల్ సూపర్ స్పెషాలిటీ (డీఎం కోర్సులు)ల్లో గ్యాస్ట్రోఎంట్రాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ తదితర కోర్సులు వస్తాయి. వీటిల్లో 469 మందిని సర్వే చేశారు. అందులో పురుషులు 362 (77%), మహిళలు 107 (23%) మంది ఉన్నారు. ఎస్సీలు ఏడుగురు (1.49%), ఎస్టీలు ముగ్గురు (0.6%), ఓబీసీలు 29 (6%), ముస్లింలు 0.6%, ఇతర మైనారిటీలు 9 (1.91%) మంది ఉండగా, ఓసీలు 89 శాతం మంది ఉన్నారు.

**ఎంసీహెచ్ కోర్సుల్లో మహిళలు 15 శాతమే**

ఎంసీహెచ్ (సర్జికల్ సూపర్ స్పెషాలిటీలు) జీర్ణకోశ, యూరాలజీ, సర్జికల్ ఆంకాలజీ, న్యూరో సర్జరీ, కార్డియోథొరాసిక్ సర్జరీ, వ్యాస్కులర్ సర్జరీ తదితర కోర్సులు ఉంటాయి. వీటిల్లో 337 మందిని సర్వే చేశారు. పురుషులు 287 (85%), కేవలం మహిళలు 50(15) మంది మాత్రమే ఉన్నారు. ఎస్సీలు ఏడుగురు (2%), ఎస్టీలు ముగ్గురు (1%), ఓబీసీలు 15 (4.4%), ముస్లింలు ఒకరు, ఇతర మైనారిటీలు ముగ్గురు ఉన్నారు. ఈడబ్ల్యూఎస్‌లో ఒకరు ఉండగా, ఓసీలు 90 శాతంగా ఉన్నారు. సూపర్ స్పెషాలిటీల్లో తగ్గుతున్న మహిళలు: డాక్టర్ కిరణ్ మాదల, సైంటిఫిక్ కమిటీ కన్వీనర్, ఐఎంఏ, తెలంగాణ ఎంబీబీఎస్, ఎండీ కోర్సుల్లో మహిళలు ఎక్కువగా చేరుతుంటే, ఆ తర్వాత సూపర్ స్పెషాలిటీ కోర్సుల్లో పురుషుల శాతమే ఎక్కువగా ఉంటోందని నివేదిక చెబుతోంది. ఎంఎస్, డీఎం, ఎంసీహెచ్ వంటి సూపర్ స్పెషాలిటీ కోర్సులకు వెళ్లేసరికి మహిళల శాతం చాలా తక్కువగా ఉంటోంది. దీనికిగల కారణాలను అన్వేషించాల్సిన అవసరముంది. ఆ మేరకు మహిళలకు వెసులుబాటు కల్పించాలి. దీనిపై జాతీయ మెడికల్ కమిషన్ దృష్టిసారించాలి.

# కుమారిపై ప్రతిపక్షాల టార్గెట్ అందుకేనా?



శ్రీహరి నామ శబ్దాన్నే సహించలేని హిరణ్యకశిపుడు ప్రహ్లాదుణ్ని నానా హింసలూ పెడతాడు.. నీ శ్రీహరి ఎక్కడున్నాడు చెప్పు. అక్కడా...? ఇక్కడా ? ఎక్కడ ? అంటూ ఇబ్బంది పెడతాడు.. అప్పుడు బాలకుడు ప్రహ్లాదుడు పద్యం అందుకుంటూ ఇందు గలఉ దందు లేఉ డని సందేహము వలదు తండ్రీ.. ఎందెందు వెతికినా.. శ్రీహరి కనిపిస్తాడు అంటాడు.. అప్పుడు తండ్రి.. ధిక్కారమున్ సైతునా అంటూ ఏదీ ఈ స్తంభంలో చూపించు అని ఆ స్తంభాన్ని బద్దలుకొట్టగా అందులోంచి ప్రళయగర్జన చేస్తూ నరసింహస్వామి వస్తాడు.. అది వేరే.. ఇప్పుడు సీఎం వైఎస్ జగన్ పరిస్థితి కూడా అలాగే కనిపిస్తోంది.. ఆంధ్రప్రదేశ్ వాస్తవ్యులై ఉంది... దేశంలో ఏ చిటారుకొమ్మకు ఎగిరిపోయినా ఏ రాష్ట్రానికి మరలిపోయినా జగనన్న ఇచ్చిన సంక్షేమ కార్యక్రమాలు.. తమ పట్ల ఆయన తీసుకున్న బాధ్యత... శ్రద్ధాసక్తులు సైతం ఆ వలస జీవులు తమతో మోసుకెళుతున్నారు. దానికి ఉదాహరణే.. హైదరాబాద్‌లో బతకడానికి వలసవెళ్లిన గుడివాడకు చెందిన కుమారి అనే మహిళా అక్కడ ఫుట్ పాత్ మీద చిన్న భోజన హోటల్ పెట్టుకుని నడుపుతోంది. ఇక్కడ తాము ఆర్జిస్తున్న ఆదాయం తమ కుటుంబానికి సరిపోకపోవడంతో భర్త పిల్లలతో కలిసి హైదరాబాద్ వలస వెళ్లారు. అక్కడ ఆమె భర్త ఆటో నడుపుతుండగా ఆమె హోటల్ పెట్టి తక్కువ ఖర్చుతో పదిమందికీ భోజనం పెడుతోంది.

ఆమె వండి వడ్డిస్తున్న తీరు.. మాటకారితనం.. అన్నీ కలిపి ఆమెను కొద్దిరోజుల్లోనే పాపులర్ చేసేశాయి.. దానికి తోడు యూట్యూబ్ చానెళ్లు ఆమెను ఇంటర్వ్యూ చేయగా తనకు ఆంధ్రాలో జగనన్న ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చిందని, ఇల్లు ఇచ్చిందని సంతోషంగా చెప్పింది.. సరిగ్గా ఈ పాయింటును పట్టుకున్న ఆంధ్ర ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబు తెలంగాణలోని తమ అనుకూల ప్రభుత్వంలోని పెద్దలను పురమాయించి రోడ్డు పక్కనున్న ఆమె హోటల్‌ను తొలగించారని వార్తలు వెల్లువెత్తాయి. కేవలం జగనన్న పేరు తల్చుకున్నంతనే ఆమె మీద టార్గెట్ చేసి హోటల్ తీయించేసారు అంటూ సోషల్ మీడియాలో పోస్టులు వెల్లువెత్తాయి. జగన్ అన్న పేరు తలచుకున్నవారిని చూసి కూడా ప్రతిపక్ష నేతలు భయపడుతున్నారని కొందరు అంటున్నారు. దేశ విదేశాలకు వెళ్ళిపోయినా వారు కూడా ఏదో విధంగా జగన్ ప్రభుత్వం ద్వారా లబ్దిపొందినవారేనని ఈ ఒక్క సంఘటన వెల్లడిస్తోంది. ఏ రాష్ట్రానికి వలసపోయినా వారికి స్వగ్రామంలో ఏదోవిధంగా ప్రయోజనం జగన్ ప్రభుత్వం కల్పించిందని... అందుకే వారంతా జీవిత పర్యంతం సీఎం జగన్‌ని తలచుకుని గుండెల్లో గుడికట్టుకుంటున్నారని చెప్పడానికి కుమారి ఉదంతమే ఒక ఉదాహరణ అంటున్నారు

# వలసాధిపత్యం లక్ష్యంగా విద్యావిధానం

హిందూత్వ శక్తుల విషయానికి వస్తే వారేనాడూ స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములుగా లేరు. దేశ నిర్మాణం అనే విషయం వారికేనాడూ అర్థం కాలేదు, కాదు కూడా. సామ్రాజ్యవాదం ప్రభావం ఏమిటో, ఆ ప్రభావం నుండి మన ప్రజలను ఎందుకు బైటకు తీసుకురావాలో కూడా వాళ్ళకి బోధపడే విషయం కాదు. కేవలం మన ప్రాచీన కాలపు ఘన కీర్తి గురించి కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసే చదువులు ఉంటే చాలు. అందుకే కోర్సులలో సామ్రాజ్యవాద భావజాలం నిండి వున్నా, దానితోబాటు కొంత వైదిక పరిజ్ఞానాన్ని జోడిస్తే చాలు వాళ్ళకి. ప్రస్తుతం మన దేశంలో అమలులోకి వస్తున్న విద్యావిధానం సరిగ్గా ఇటువంటిదే.

కేవలం సాయుధ బలంతోనో లేక ఆర్థిక శక్తితోనో మాత్రమే సామ్రాజ్యవాదం మూడవ ప్రపంచ దేశాల మీద తన పెత్తనాన్ని సాగిస్తుందనుకోవద్దు. భావజాల రంగంలో సైతం తన ఆధిపత్యాన్ని నెలకొల్పి, తద్వారా తాను ఏ విధంగా కోరుకుంటోందో, అదేమాదిరిగా బాధిత దేశాల ప్రజలు ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకునేలా ప్రభావితం చేస్తుంది. అందుచేత మూడవ ప్రపంచ దేశాలలో స్వాతంత్ర్యం నెలకొనాలంటే ముందుగా ఆ దేశాల ప్రజల మనస్సుల మీద ఉన్న వలసాధిపత్యాన్ని వదిలించుకోవాలి. సామ్రాజ్యవాద వక్రీకరణల తెరలను చీల్చుకుని ఆ ప్రజలు వాస్తవం ఏమిటో గ్రహించగలగాలి. వలసవాద వ్యతిరేక పోరాటం ఈ వాస్తవాన్ని గుర్తించింది. నిజానికి ఈ చైతన్యం ఉదయించినప్పుడే ఆ పోరాటం మొదలైంది. ఐతే, రాజకీయ స్వాతంత్ర్యం వచ్చినంత మాత్రాన సామ్రాజ్యవాద ఆధిపత్యం అంతటితో ముగిసిందని అనుకోరాదు. కొత్తగా స్వతంత్రం పొందిన దేశాల్లో సామ్రాజ్యవాదపు తప్పుడు భావజాల ప్రభావాన్ని అంతం చేసే విధంగా అక్కడ విద్యా వ్యవస్థ నిరంతరం పాటుపడాల్సి వుంటుంది.

ఇది జరగాలంటే మన దేశంలోని విద్యా వ్యవస్థల్లో బోధనాంశాలు, పాఠ్యాంశాలు సామ్రాజ్యవాద దేశాల్లోని విద్యా వ్యవస్థల్లో బోధించే వాటికి భిన్నంగా ఉండాలి. సాంఘిక




శాస్త్రాలలో, భాష, లలిత కళలు తదితర అంశాలలో మన దేశ వర్తమానాన్ని అర్థం చేసుకోవాలంటే వలస పాలనలోని మన గతాన్ని, ఆ పాలన ఫలితాలను సక్రమంగా అర్థం చేసుకోవాల్సిందే.

ఐతే, సామ్రాజ్యవాద దేశాలలోని విశ్వవిద్యాలయాలు వలస పాలనకు సంబంధించిన గతంతో సంబంధం లేకుండా మన వర్తమానాన్ని వివరించడానికి పూనుకుంటాయి. మన దేశం వెనుకబడిపోడానికి కారణాలు మన సోమరిపోతు తనం అనో, మనకు వ్యాపార దక్షత లేకపోవడం అనో, మన మూఢవిశ్వాసాలు అనో, లేకపోతే మన అధిక జనాభా అనో చెప్తాయి. ఇక ప్రకృతి శాస్త్రాల విషయంలో కూడా మూడో ప్రపంచ దేశాల విశ్వవిద్యాలయాలలోని పాఠ్యాంశాలు సామ్రాజ్యవాద దేశాలలోని పాఠ్యాంశాలు ఒకే మాదిరిగా ఉండకూడదు. ఐన్‌స్టీన్ సిద్ధాంతంలోనో, క్వాంటం ఫిజిక్స్ లోనో సామ్రాజ్యవాద భావజాలం ఉందని చెప్పడం నా ఉద్దేశ్యం కాదు. సామ్రాజ్యవాద దేశాలలో శాస్త్రవిజ్ఞానం ప్రాధాన్యతలు, సవాళ్ళు వేరు. మూడవ ప్రపంచ దేశాలలో ప్రాధాన్యతలు, సవాళ్ళు వేరు. ఇరవయ్యో శతాబ్దపు ప్రముఖ మార్క్సిస్టు మేధావి, బ్రిటిష్ శాస్త్రవేత్త అయిన జెడి బెర్నాల్ అభిప్రాయం ఇది. మూడవ ప్రపంచ దేశాల విశ్వవిద్యాలయాలలో కోర్సులు, పాఠ్యాంశాలు అచ్చం సామ్రాజ్యవాద దేశాల యూనివర్సిటీలలోని కోర్సుల మాదిరిగానే ఉండా లనుకోవడమే సామ్రాజ్యవాద భావజాలపు ఆధిపత్యానికి నిదర్శనం. నయా ఉదారవాద విధానాలకు పూర్వ కాలంలో మన దేశ విద్యావిధాన రూపకర్తలకు ఈ విషయం అవగాహనలో ఉంది. ఆ కాలపు

విద్యా వ్యవస్థలో కొన్ని లోపాలు ఉన్నప్పటికీ, ఆ విధ్యావిధానపు దార్శనికతలో లోపం ఉందని చెప్పలేం.

నయా ఉదారవాద విధానాలు మొదలయ్యాక పరిస్థితులలో మార్పులు చోటు చేసుకోవడం మొదలైంది. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడితో భారత బడా బూర్జువావర్గం పెనవేసుకుపోవడం మొదలైంది. మన దేశంలోని ఉన్నత మధ్యతరగతి యువత బహుళజాతి కార్పొరేషన్లలో ఉద్యోగాలకోసం వెంపర్లాడడం పెరిగిపోయింది. విదేశీ మార్కెట్లకు సరుకులను ఎగుమతి చేయడం మీద, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడం మీద అంతకంతకూ మన దేశాభివృద్ధి ఆధారపడడం మొదలైంది. ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు సైతం మళ్ళీ ఈస్ట్ ఇండియా కంపెనీని మన దేశానికి ఆహ్వానించాలని సూచించేదాకా పోయారు.

నయా ఉదారవాదం అంటే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆధిపత్యం. ఈ ఆధిపత్యం ప్రపంచం అంతటా ఒకే విధంగా ఉండే సాంకేతిక యాజమాన్యంతో ముడిపడింది. అందుచేత ప్రపంచవ్యాప్తంగా ఒకేరూపంలో ఉండే విద్యా విధానం కావాలన్న వత్తిడి పెరిగింది. ఆ విధమైన విద్యావిధానం ఉంటేనే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి కావలసిన సాంకేతిక నిర్వహణాధిపత్యం ప్రపంచమంతటా నెలకొల్పడం సాధ్యపడుతుంది. అటువంటి విద్యావిధానం సామ్రాజ్యవాద దేశాలలో తయారైందే అయివుండాలి. ఇప్పుడు విద్యావిధానం విద్యార్థుల మెదళ్ళను సామ్రాజ్యవాద ప్రభావం నుండి బైటకు తేవడం అనే లక్ష్యంతో కాకుండా, మళ్ళీ వారిని సామ్రాజ్యవాద బంటుల మాదిరిగా తయారుచేసే లక్ష్యంతో రూపొందుతోంది.

ఈ సంగతిని దృష్టిలో ఉంచుకునే గత యుపిఎ ప్రభుత్వం భారత దేశంలో తమ బ్రాంచీలను నెలకొల్పాలని విదేశీ యూనివర్సి టీలను ఆహ్వానిం చింది. మన దేశంలోని కొన్ని యూనివర్సిటీలను దత్తత తీసుకుని వాటిని విదేశీ యూనివర్సిటీల మాదిరిగా తీర్చిదిద్దా లని కోరింది. ఆ విధంగా ఇక్కడికి ఆహ్వానించబడిన ఆక్స్‌ఫర్డ్, హార్వార్డ్, కేంబ్రిడ్జ్ వంటి విదేశీ యూనివర్సిటీలు ఇక్కడి సిలబస్‌ను అనుసరించనవసరం లేదని, తమ తమ దేశాల్లో అమలు చేసే సిలబస్‌నే ఇక్కడ కూడా అమలు చేయాలని కోరింది. భారతీయ యూనివర్సిటీలలో, సామ్రాజ్యవాద దేశాలలోని యూనివర్సిటీలలో ఏకరూప బోధనాంశాలు, సిలబస్ లు ఉండేవిధంగా ఒక ప్రక్రియ మొదలైంది. అంటే వలసవాద భావజాలం నుండి బైటపడడానికి అంతవరకూ జరిగిన కృషిని తిరగదోడే క్రమం మొదలైంది. పార్లమెంటులో మన మానవ వనరుల అభివృద్ధిమంత్రి మన దేశంలో హార్వార్డ్ తరహా విద్యను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని, అటువంటి చదువులకోసం భారతీయ విద్యార్థులు విదేశాలకు పోవలసిన అవసరమే లేకుండా చేస్తామని ప్రకటించారు కూడా. యుపిఎ ప్రభుత్వం ప్రారంభించిన ఈ ప్రక్రియను ఎన్‌డిఎ ప్రభుత్వం వచ్చాక చాలా వేగంగా కొనసాగించింది. ఈ ప్రభుత్వం తెచ్చిన జాతీయ విద్యా విధానం సామ్రాజ్యవాద దేశాల విద్యా వ్యవస్థ మాదిరిగానే ఉండే వ్యవస్థను ఇక్కడ నెలకొల్పలడం అనే భావనకు అధికారికంగా ముద్ర వేసింది. అంటే ఉమ్మడి బోధనాంశాలు, కోర్సులు ఇక్కడ నిర్వహించాల్సి వుంటుంది. విదేశీ యూనివర్సిటీల మాదిరిగా ఇక్కడ కూడా యూనివర్సిటీలను నిర్వహించడం కోసం రెండు నిర్ణయాత్మక చర్యలను తీసుకుంది. ఈ దేశంలో సామ్రాజ్యవాద భావజాల ఆధిపత్యానికి ప్రత్యామ్నాయాన్ని పెంపొందిస్తున్న యూనివర్సిటీలను నాశనం చేయడం మొదటి చర్య. ఈ చర్యలు అంతర్జాతీయ ప్రపంచపు దృష్టిలో కూడా పడ్డాయి. జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ, హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, జాదవ్‌పూర్ యూనివర్సిటీ వంటివి ఇందుకు ఉదాహరణలుగా మనం చూడవచ్చు.

ఇక రెండవది: యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ద్వారా వత్తిడి చేసి మన దేశంలోని యూనివర్సిటీలు దేనికదే విదేశీ యూనివర్సిటీలతో చర్చలు జరిపి విదేశీ యూనివర్సిటీలలోని కోర్సులనే ఇక్కడ మక్కీకి మక్కీగా అమలు చేయడం. ఒక్కటే తేడా ఏమంటే విదేశీ కోర్సులతోబాటు వేద గణితం వంటి కొన్ని కోర్సులను కూడా చేర్చాలని యుజిసి వత్తిడి చేస్తోంది. కొన్ని విదేశీ యూనివర్సిటీలు ఇందుకు ఒప్పుకోవడం లేదు. ఐతే త్వరలోనే ఇటువంటి విషయాల్లో కూడా ఒక అంగీకారం కుదురుతుంది. ఫలితంగా మన యూనివర్సిటీలలో నయా ఉదారవాదంతోబాటు హిందూత్వ భావజాలం కూడా కలగలిపిన కోర్సులు తయారౌతాయి. మన దేశం ప్రాచీన కాలంలో ఎంత ఘనకీర్తి కలిగివుందో తెలుసుకుంటూనే సామ్రాజ్యవాద

భావజాల ఆధిపత్యంలోకి మన యువత మెదళ్ళు పోతాయి. అటువంటిదానికి సామ్రాజ్యవాదం పెద్దగా అభ్యంతరం చెప్పదు.

సామ్రాజ్యవాదం అంటే ఒక దోపిడీ వ్యవస్థ కాదని, భారతదేశం వంటి వెనుకబడిన దేశాలకు నవ నాగరికతను నేర్పే దయాహృదయంతో ఇక్కడికి వచ్చిందని, ఆ లక్ష్యం నెరవేరాలంటే సిలబస్‌లో, కోర్సులలో సామ్రాజ్యవాద యూనివర్సిటీలతో ఏకరూపత అవశ్యంఅని ఇక్కడ యువత తలల్లోకి ఎక్కితే చాలు. మన దేశపు ప్రస్తుత వెనుకబాటుతనానికి గతంలో సామ్రాజ్యవాదం సాగించిన దోపిడీ ప్రధాన కారణం అన్న విషయాన్ని మరుగుపరిస్తే చాలు. ఇక్కడి ప్రాచీన కాలపు ఘనకీర్తి గురించి ఎంత తెలుసుకున్నా దానివలన సామ్రాజ్యవాదానికి వచ్చిన ఇబ్బందేమీ ఉండబోదు.

వలసవాద మనస్తత్వాన్ని ఎక్కించుకునే ఈ క్రమంలో మరో ధోరణి కూడా ఉంది. సామాజిక శాస్త్రాలను, భాషా కోర్సులను మొత్తంగానే రద్దు చేయడమో లేక అప్రధానమైన కోర్సులుగా దిగజార్చడమో చేసి వాటి స్థానంలో పూర్తిగా ఉపాధి సాధన లక్ష్యంతో ఉండే మేనేజిమెంటు, కాస్ట్ అకౌంటెన్సీ వంటి కోర్సులను ప్రోత్సహించడం. అందువలన యువత సమాజం గురించి ఏ ప్రశ్నలూ అడగరు. ఈ విషయంలో అటు హిందూత్వ శక్తులకు, ఇటు కార్పొరేట్లకు ఉమ్మడి ప్రయోజనం ఉంది. వాళ్ళకి పూర్తిగా వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యంగా ఉండే విద్యార్థులు, సామాజిక పరిణామాల గురించి ఎటువంటి ప్రశ్నలూ అడగనివారు కావాలి. ఈ ధోరణి కూడా ఇప్పుడు వేగంగా బలపడుతోంది. దేశంలో రాజకీయంగా కార్పొరేట్-హిందూత్వ శక్తులు ఏ విధంగా రాజకీయ ఆధిపత్యాన్ని సాధించాయో, దానికి ప్రతిరూపమే ప్రస్తుత విద్యావిధానం. ఇది మళ్ళీ మన ప్రజల మనస్సులను వలసాధిపత్యానికి లోబడేలా చేస్తుంది. కార్పొరేట్లు సరిగ్గా ఇదే కోరుకుంటున్నారు. ఇక హిందూత్వ శక్తుల విషయానికి వస్తే వారేనాడూ స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములుగా లేరు. దేశ నిర్మాణం అనే విషయం వారికేనాడూ అర్థం కాలేదు, కాదు కూడా. సామ్రాజ్యవాదం ప్రభావం ఏమిటో, ఆ ప్రభావం నుండి మన ప్రజలను ఎందుకు బైటకు తీసుకురావాలో అది కూడా వాళ్ళకి బోధపడే విషయం కాదు. కేవలం మన ప్రాచీన కాలపు ఘన కీర్తి గురించి కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేసే చదువులు ఉంటే చాలు. అందుకే కోర్సులలో సామ్రాజ్యవాద భావజాలం నిండి వున్నా, దానితోబాటు కొంత వైదిక పరిజ్ఞానాన్ని జోడిస్తే చాలు వాళ్ళకి. ప్రస్తుతం మన దేశంలో అమలులోకి వస్తున్న విద్యావిధానం సరిగ్గా ఇటువంటిదే.

ఈ కార్పొరేట్-హిందూత్వ కూటమి అనేది నయా ఉదారవాదంలో తలెత్తిన సంక్షోభం కారణంగా ఏర్పడింది. సంక్షోభం పెరుగుతున్న నేపథ్యంలో తమ ఆధిపత్యం కొనసాగాలంటే అందుకు హిందూత్వ శక్తుల తోడ్పాటు అవసరం అని కార్పొరేట్లు గుర్తించాయి. అదే మాదిరిగా, ప్రస్తుత జాతీయ విద్యావిధానం కూడా దేశాన్ని ముందుకు తీసుకుపోవడానికి కాకుండా, సంక్షోభ కాలంలో తమ భావజాల ఆధిపత్యాన్ని కొనసాగించే లక్ష్యంతో రూపొందింది. అందుచేత ఈ విధానం భావాలను వికసించనివ్వకుండా నాశనం చేస్తుంది. ప్రశ్నలు లేవనెత్తనివ్వదు. సత్యాన్ని తెలుసుకోనివ్వదు. ఈ విధానం చాలా గొప్పగా చూపించే "ఉపాధి కల్పన లక్ష్యం" అనేది కొద్దిమందికి మాత్రమే లాభిస్తుంది. నిజానికి నయా ఉదారవాద సంక్షోభం పెరుగుతున్నకొద్దీ ఉపాధి అవకాశాలు తరిగిపోతాయి. దానికి అనుగుణంగానే ప్రస్తుత జాతీయ విద్యా విధానం అంతకంతకూ ఎక్కువమంది యువతను విద్యకు దూరం చేస్తుంది. మత విద్వేష విషంతో వారి మెదళ్ళను నింపి వాస్తవ జీవిత సమస్యలపై చర్చ జరగకుండా వారి దృష్టిని మళ్ళిస్తుంది. తమ ఫాసిస్టు గూండా దాడులలో పాల్గొనడానికి చౌకగా దొరికే కూలీలుగా వారిని వాడుకుంటుంది.

అందుచేత ఈ విద్యావిధానం చాలా స్వల్పకాలం మాత్రమే ఉనికిలో ఉండగలదు. ఈ దేశపు యువత తాము అనుభవిస్తున్న నిరుద్యోగం గురించి, దుర్భర దారిద్ర్యం గురించి, అటువంటి పరిస్థితి ఏర్పడడానికి కారణం గురించి ప్రశ్నలు అడగడం మొదలవగానే ఈ విద్యావిధానం చివరి ఘడియలు మొదలతాయి. నయా ఉదారవాద విధానానికి ప్రత్యామ్నాయంగా ఒక అభివృద్ధి పంథాను అన్వేషించడం మొదలవగానే, దానిలో భాగంగానే ప్రత్యామ్నాయ విద్యావిధానం ఎలా ఉండాలన్న అన్వేషణ కూడా మొదలతుంది. సామ్రాజ్యవాద భావజాలం నుండి బైటపడడం అనే ఎజెండా జాతీయోద్యమ కాలంలో వచ్చిన మాదిరిగానే మళ్ళీ ముందుకొస్తుంది.

# అక్షర తోరణం!



'పుస్తకం నాకు గాఢనిద్రలో నుండి వెలుతురు తోటలోకి/ దారి చూపే వెన్నెల పూదోట/ మామూలు మనిషిని కావడానికీ బుద్ధుడు కావడానికీ/ ఎన్నెన్నో బోధనల్ని చేసేది పుస్తకమే/ మనిషిగా మనగలగడానికీ/ పదిమందిని మానవతా స్పర్శతో అక్కున చేర్చుకోవడానికీ/ పుస్తకం ఒక జీవన మార్గం/ పుస్తకమే ఒక జీవన గమ్యం' అంటారు గ్రంథాలయ యాత్రికుడు మంచికంటి. రాతి యుగం నుంచి రాకెట్ యుగం వరకూ సమాజ అభివృద్ధి యానానికి పుస్తకాలే నిచ్చెన మెట్లు. ప్రపంచంలో ఎన్ని మార్పులు వచ్చినా మానవాభివృద్ధిలో అత్యంత కీలకం పుస్తకం. అందుకే అంటాడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్– 'మానవుడు సృష్టించిన వాటిలో గొప్పది పుస్తకం' అని. మనిషి జీవితాన్ని తీర్చిదిద్దేది పుస్తకమే. సమాజ మార్పులోనూ ముఖ్యపాత్ర పోషిస్తుంది పుస్తకం. కాగితాల్లో నిక్షిప్తం చేయబడిన దశాబ్దాల చరిత్ర పుస్తకాల్లో అమృతంలా ప్రవహిస్తూంటుంది. ఏ కాలం పుస్తకం చదివితే ఆ కాలంలోని చారిత్రక, భ.గోళిక, సామాజిక, సాంస్కృతిక వికాసంలోకి పఠితులను తోడ్కొని పోతుంది. ఒక సమాజపు అత్యున్నత స్థితిని కొలవగలిగే ప్రమాణాలే పుస్తకాలు. చదవడం అలవాటున్న వ్యక్తిని పరిపూర్ణమైన మనిషిగా మార్చేస్తుంది పుస్తకం.

ప్రతియేటా నూతన సంవత్సరాన్ని వెంటబెట్టుకొని, సంక్రాంతికి ముందే వచ్చే మరో పెద్ద పండుగ విజయవాడ పుస్తక మహ.త్సవం. ఒకటి కాదు, రెండు కాదు, వేలాది పుస్తకాలు ఒకేచోట బొమ్మల కొలువులా హేమంతంలో విరబూసిన చామంతుల్లా విద్యుద్దీపాల కాంతిలో విజ్ఞానజ్యోతులై ప్రకాశిస్తుంటాయి. విజయవాడ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న 34వ పుస్తక మహ.త్సవం డిసెంబర్ 28 నుంచి జనవరి 7వ తేదీ వరకూ కొనసాగుతుంది. పుస్తకాలు మనకు అత్యంత ప్రియమైన సహచరులు, ప్రియనేస్తాలు. మనం ఎదగడానికి, నేర్చుకోడానికి మన ఊహలను, ప్రపంచం గురించిన అవగాహనను పెంచడానికీ పుస్తకాలు దోహదపడతాయి. సాహిత్యంలోని అన్నిరకాల ప్రక్రియలను నింపుకొన్న పాత, కొత్త పుస్తకాల మేలు కలయిక ఈ పుస్తక మహ.త్సవం. ముఖ్యంగా ఈ పుస్తక ప్రదర్శనకు పిల్లలను తీసుకురావడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చొరవ చూపాలి. వారితో ఒక్క పుస్తకమైనా కొనిపించాలి చదివించాలి. ఒక్కో చిత్రంలో నటించాక తనకు వచ్చిన పారితోషికంతో మొదట 100 డాలర్లకు పుస్తకాలు కొనేవాడట చార్లీ చాప్లిన్. పుస్తకాన్ని మించిన స్నేహితుడు, సన్నిహితుడు మరొకరులేరు. 'నేను ఇంతవరకూ చదవని పుస్తకాన్ని తీసుకువచ్చి నన్ను కలిసిన వ్యక్తి నా ప్రాణ స్నేహితుడవుతాడు' అంటాడు అబ్రహాం లింకన్.

నేటి ఆధునిక సమాజంలో ఎన్ని సాంకేతిక మార్పులు వచ్చినా, ఏఐ వంటి చాట్ బాట్‌లు ఎన్ని వున్నా పుస్తక పఠనాన్ని మించినది లేదు. ట్యాబ్స్, ఈబుక్స్, యాప్స్ వంటివి అందుబాటులోకి వచ్చినా పుస్తకం చదివిన అనుభూతి వాటితో కలుగదు. పైగా ఆ ఎలక్ట్రానిక్ పరికరాల నుంచి వెలువడే రేడియేషన్ కళ్లకు హాని కలిగిస్తుందన్న విషయం అందరికీ తెలిసిందే. ప్యూ రీసెర్చ్ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 61శాతం పట్టణవాసులు, 58 శాతం గ్రామీణ ప్రాంత వాసులు పుస్తకాలు చదువుతున్నారు. భారత్‌లో 47 శాతం మంది పట్టణ, 53 శాతం మంది గ్రామీణ ప్రాంత చదువరులున్నారు. కాగా, తెలుగులో 14శాతం మంది పుస్తకాలు చదువుతున్నారు. మొత్తంగా భారతీయులు వారానికి 10.42 గంటలు చదువుతున్నారు. అమెరికన్ పుస్తకాల మార్కెట్‌ని పరిశీలిస్తే గతేడాది అమ్ముడైన ప్రతి ఐదు ప్రతుల్లోనూ నాలుగు అచ్చు పుస్తకాలేనట. స్మార్ట్‌ఫోన్ అరచేతిలో వున్నా పుస్తకం హస్తభూషణం అన్న మాట ఇంకా మసకబారలేదని ఈ లెక్కలే చెబుతున్నాయి. మంచి పుస్తకాలు చదవడం వల్ల ఎలాంటి చెడు ప్రభావాలూ వుండవు. 'పుస్తకమే ఆత్మ వంటిది/ చదివితే కమ్మగుంటది/ ప్రతి మాట ప్రతి పుట/ నోటి కూడవుతది/ మెదడుకి పదును పెడతది'– అంటాడో కవి. పఠనం మనసును వికసింపజేస్తుంది, విస్తరింపజేస్తుంది. సత్ సాహిత్యం, సత్ సాంగత్యం మనో వికాసాన్ని పెంచుతుంది. పుస్తక పఠనాన్ని మహ.ద్యమంగా ముందుకు తీసుకెళ్లాలి. భావితరానికి విజ్ఞాన బాంఢాగారాన్ని అందించాలి.

# రుణ భారతం




భారత స్థూల జాతీయోత్పత్తి (జిడిపి), రుణాలకు సంబంధించిన నిష్పత్తి ప్రమాదకర స్థితిలో ఉందంటూ అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) నివేదించడం ఆందోళన కలిగిస్తోంది. భారత ఆర్థిక పునాది బీటలు వారుతోందని ఐఎంఎఫ్ వ్యాఖ్యానించిందంటే బిజెపి ప్రభుత్వం సాధించిన ప్రగతి ఏమిటో ఇట్టే అర్థమవుతుంది. దేశ స్థూల జాతీయోత్పత్తిలో ప్రస్తుతం రుణాల నిష్పత్తి 82.4 శాతంగా ఉందని ఐఎంఎఫ్ నివేదించింది. జిడిపిలో 80 శాతానికి పైగా రుణ భారం ఉండటమనేది ఆర్థిక పరిభాషలో అత్యంత ప్రమాదకరమైన పరిస్థితిగా పరిగణిస్తారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కానీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చెబుతున్నట్లుగా దేశం ఆర్థికంగా అభివద్ధి చెందుతున్నట్లయితే ఆ మేరకు జిడిపిలో రుణ నిష్పత్తి కూడా తగ్గాలి. కానీ అది వ్యతిరేక దిశలో ఉంది. వాస్తవానికి 2018 నుంచి అప్పులు పెరిగాయి. 2019 చివరి నాటికి, స్థూల దేశీయోత్పత్తి – రుణాల నిష్పత్తి 74 శాతంగా ఉంది. ప్రస్తుతం అది 82.4 శాతానికి ఎగబాకింది. కేంద్ర ప్రభుత్వం అందించిన అధికారిక సమాచారం ఆధారంగానే ఐఎంఎఫ్ నివేదికలు రూపొందిస్తుంది. అంటే దేశాభివృద్ధి అంతా డొల్ల అని, తిరోగమన దిశలో పతనమవుతోందన్న విషయాన్ని మోడీ సర్కార్ గణాంకాలే నిగ్గుతేల్చుతున్నాయి. గత రెండేళ్లలో రుణాలు, జిడిపి నిష్పత్తి శాతం 88 నుంచి 81కి తగ్గిందని కేంద్రం నిస్సిగ్గుగా బుకాయిస్తోంది. పైగా రానున్న రెండేళ్లలో ద్రవ్యోల్బణాన్ని 4.5 శాతానికి తగ్గిస్తామంటూ గాల్లో మేడలు కడుతుండటం సిగ్గుచేటు.

జీవనోపాధులు క్షీణించడం, ఆహార ద్రవ్యోల్బణం ఎగబాకడం, రుణభారాల మోత సహజంగానే అంతర్జాతీయంగా భారత ద్రవ్య పరపతిని కుదించివేస్తాయి. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చేనాటికి దేశ అప్పు రూ.55.87 లక్షల కోట్లుగా ఉండగా అది ఈ ఏడాది మార్చి నాటికి 155.31 లక్షల కోట్లుకు చేరింది. ఈ ఆర్థిక సంవత్సరం చివరి నాటికి 169.46 లక్షల కోట్లకు చేరనున్నట్లు బడ్జెట్ అంచనాల్లో కేంద్రమే పేర్కొంది. గణాంకాల్లో పేర్కొనని అప్పు మరో రూ.1.2 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. ఒకవైపు రుణాల ఊబిలో నిండా మునిగిన మోడీ సర్కార్ మరోవైపు రాష్ట్రాలు ఆర్థిక క్రమ శిక్షణ పాటించాలంటూ నీతులు చెబుతుండటం దాని ద్వంద్వనీతికి నిదర్శనం. ప్రధానంగా బిజెపియేతర పార్టీలు అధికారంలో ఉన్న కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రుణాలకు ఆంక్షలు విధిస్తూ అభివృద్ధికి మోకాలడ్డుతోంది. వేలాది కోట్ల రూపాయల సంపదను కార్పొరేట్ కంపెనీలకు దోచిపెడుతున్న కేంద్రం..రాష్ట్రాల్లో పేదలకు అమల్జేస్తున్న సంక్షేమ పథకాలకు 'ఉచితాలు' ముద్ర వేస్తూ అడ్డుకునేందుకు ఈ రుణ షరతులు విధిస్తోంది. వాస్తవానికి కేంద్రంతో పోలిస్తే రాష్ట్రాల్లో రుణాలు, ఎస్‌జిడిపి నిష్పత్తి శాతం చాలా తక్కువ. కేరళలో ఇది 36 శాతం మాత్రమే. కోవిడ్ కాలంలో కేరళ అప్పుల భారం 39 శాతానికి చేరినా అక్కడి వామపక్ష ప్రభుత్వం స్వల్ప వ్యవధిలోనే అత్యల్ప స్థాయికి తీసుకొచ్చింది. కేరళ ఆర్థిక వద్ధిని, అప్పుల భారాన్ని పోల్చి చూస్తే..ఆర్థిక క్రమశిక్షణకు ఆదర్శంగా నిలుస్తోంది.

వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) కారణంగా కేంద్రం పన్నుల వసూళ్లు భారీగా పెరిగినప్పటికీ మోడీ సర్కార్ ఏలుబడిలో ద్రవ్యలోటు విపరీతంగా పెరిగిపోతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి ద్రవ్యలోటు 6 శాతానికి మించి నమోదు కానుందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ ఇదివరకే హెచ్చరించింది కూడా. కానీ రెండేళ్లలో దీనిని 4.5 శాతానికి కుదిస్తామన్న మోడీ సర్కార్ ఈ దఫా బడ్జెట్ లక్ష్యంగా 5.9 శాతానికి కుదిస్తామని నమ్మబలుకుతోంది. అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని, రెవెన్యూ లోటును తగ్గించుకొని ద్రవ్యలోటును 3 శాతానికి పరిమితమయ్యేలా చూడాలని 2003లో తీసుకొచ్చిన ఆర్థిక బాధ్యత, బడ్జెట్ నిర్వహణ చట్టం (ఎఫ్ఆర్‌బిఎం యాక్టు) నిర్దేశిస్తోంది. ఈ నిబంధనలను పాటించని బిజెపి సర్కార్ కేరళ వంటి రాష్ట్రాలకు మాత్రం షరతులను విధిస్తూ రుణాలకు అనుమతిని నిరాకరించడం ప్రతిపక్షాల పాలిత రాష్ట్రాలపై కక్ష సాధించడం మినహా మరొకటి కాదు. రుణ మంజూరును అడ్డుకోవడం ద్వారా రాష్ట్రాలను తమ కీలుబొమ్మలుగా మలుచుకోవాలన్నది మోడీ సర్కార్ పన్నాగం. సమాఖ్య స్ఫూర్తిని నీరుగార్చే ఇలాంటి దుర్మార్గ చర్యలను అడ్డుకోవాలి.

# వైసిపికి ఇంటా బయటా అసమ్మతి, ఆందోళనల సెగ

తమ ఆందోళనలు, డిమాండ్ల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ఆందోళన చేస్తున్న సంఘాలు తీవ్ర ఆగ్రహంతో వున్నాయి. సమ్మెల పట్ల ప్రభుత్వం తీసుకున్న కఠిన వైఖరితో సమస్య ఇంకా ముదిరిందని అత్యధికులు అభిప్రాయపడుతున్నారు. వేతనాలు పెంచినట్లైతే వాటిని ప్రస్తుత బడ్జెట్లలోనే చెల్లించాల్సిన అవసరం వుంది. అందుకే పరిష్కారాలను కనుగొనడంలో జాప్యం జరుగుతోందనేది వాస్తవం.

దేశ సార్వత్రిక ఎన్నికలు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ముందు ఆంధ్రప్రదేశ్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అనేక సమస్యలు, సవాళ్ళను ఎదుర్కొంటోంది. ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిక్కెట్లు దొరకని నేతల నుండి పెరుగుతున్న అసమ్మతితో పాటు ప్రభుత్వ ఉద్యోగులతో సహా వివిధ వర్గాల వారి నుండి నిరసనలు, ఆందోళనలను ఎదుర్కొంటోంది.

మరింత మెరుగైన వేతనాలు, ప్రయోజనాలు కావాలని వివిధ విభాగాలకు చెందిన వేలాదిమంది కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. అనేక సంఘాలు ఇప్పటికే నిరసనలకు దిగడమో లేదా ఎన్నికల్లోగా ఆందోళనలు చేపట్టడానికి ప్రణాళికలు రూపొందించడమో చేస్తున్నాయి. వారి డిమాండ్లను పరిశీలిస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో వారిలో కొంతమంది మాత్రమే తాత్కాలికంగా తమ ఆందోళనలను ఆపారు.

అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు సైతం ప్రభుత్వంతో కొంత కాలంగా పోరాడుతున్నారు. ఇతర ప్రభుత్వ సిబ్బందితో సమానంగా తమకు కూడా వేతనాలు పెంచాలని, ఇతర ప్రయోజనాలు కలిగించాలని డిమాండ్ చేస్తూ డిసెంబరు 12 నుండి వారు సమ్మె చేస్తున్నారు. ఆందోళనకారులతో పలు దఫాలుగా జరిగిన చర్చలు విఫలమవడంతో, నిత్యావసరాల నిర్వహణా చట్టం-1992 (ఎస్మా)ను ప్రయోగించడం ద్వారా ఆందోళనలను అణగదొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. కానీ అంగన్‌వాడీలు తమ పట్టును ఏమాత్రమూ సడలించలేదు. ఆందోళన విరమించలేదు. తమ డిమాండ్లన్నింటికీ ప్రభుత్వం ఆమోదించేవరకు సమ్మె కొనసాగి తీరుతుందని స్పష్టం చేశారు.

న్యాయమైన తమ డిమాండ్ల పట్ల ప్రభుత్వం దీర్ఘకాలంగా ఉదాసీనంగా వ్యవహరించడంపై ఉపాధ్యాయ సంఘాల నేతలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. దశలవారీగా నిరసనలు చేపట్టేందుకు ఎ.పి యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ సమాయత్తమవుతోంది. విజయవాడలో ఫిబ్రవరి మొదటి వారంలో మహా ధర్నాతో ముగించాలని భావిస్తోంది. రూ.18 వేల కోట్ల మేరకు వివిధ పద్దుల కింద పెండింగ్ వున్న తమ బకాయిలు, ఎరియర్లను తక్షణమే చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

పారా మెడికల్ సిబ్బంది, 104, 108 అంబులెన్స్ సర్వీసుల్లో పని చేస్తున్న ఇతర ఉద్యోగులు జనవరి 23 నుండి ప్రతిపాదిత సమ్మెకు ఆరోగ్య శాఖకు నోటీసు ఇచ్చారు. ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు వేతనాలు, ఇతర ప్రోత్సాహకాలను పెంచాలని వారు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ఔట్‌సోర్స్‌డ్ సర్వీసెస్ కార్పొరేషన్‌లో తమని భాగం చేసినట్లైతే ఇవన్నీ తమకు వస్తాయని వారు పేర్కొంటున్నారు.

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మితో చర్చలకు తమ నేతలను ఆహ్వానించడంతో రాష్ట్ర వ్యాప్తంగా నిరవధిక సమ్మె చేస్తున్న ఔట్‌సోర్సింగ్ మున్సిపల్ వర్కర్లు తాత్కాలికంగా సమ్మె విరమించారు. దాదాపు 55,400 మంది అక్రిడేటెడ్ సామాజిక ఆరోగ్య కార్యకర్తలు కూడా విధులకు దూరంగా వున్నారు. తమకు నెలకు రూ.26 వేలు కనీస వేతనంగా ఇవ్వాలని వారు పట్టుబడుతున్నారు. మున్సిపల్ పాఠశాలలను విద్యా శాఖ పర్యవేక్షణ కిందకు




తీసుకువస్తూ జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వులపై మున్సిపల్ టీచర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ డిమాండ్లలో కొన్నింటిని అమలు చేయడానికి ప్రభుత్వం అంగీకరించడంతో సమగ్ర శిక్షా పథకానికి చెందిన కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 22 రోజుల నుండి చేస్తున్న సమ్మెను ఇటీవలే విరమించారు. మధ్యాహ్న భోజన కార్మికులు, విద్యుత్ శాఖ ఉద్యోగులు, నిర్మాణ కార్మికులు, గ్రామ రెవిన్యూ అసిస్టెంట్లు, గ్రామీణాభివృద్ధి విభాగానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లు వీరందరిదీ ఒకటే ఫిర్యాదు. ద్రవ్యోల్బణం నెలకొన్నప్పటికీ తమ ఆదాయాలు అస్సలు పెరగడం లేదని వాపోతున్నారు. 2019 ఎన్నికల సమయంలో పాదయాత్ర సందర్భంగా వేతనాలు పెంచుతానని, మరింత మెరుగైన పని పరిస్థితులు కల్పిస్తానని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి ఆనాడు హామీ ఇచ్చారని, కానీ నేడు వాటన్నింటినీ గాలికి వదిలేశారని, మాట నిలబెట్టుకోలేదని వారు విమర్శిస్తున్నారు.

తమ ఆందోళనలు, డిమాండ్ల పట్ల ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో ఆందోళన చేస్తున్న సంఘాలు తీవ్ర ఆగ్రహంతో వున్నాయి. సమ్మెల పట్ల ప్రభుత్వం తీసుకున్న కఠిన వైఖరితో సమస్య ఇంకా ముదిరిందని అత్యధికులు అభిప్రాయపడుతున్నారు. వేతనాలు పెంచినట్లైతే వాటిని ప్రస్తుత బడ్జెట్లలోనే చెల్లించాల్సిన అవసరం వుంది. అందుకే పరిష్కారాలను కనుగొనడంలో జాప్యం జరుగుతోందనేది వాస్తవం. ఇదిలావుండగా, ఈ వైఫల్యాలన్నింటికీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడానికి ఈ నిరసనలు, సమ్మెలు, ఆందోళనలన్నీ కూడా ప్రతిపక్షాలకు ఒక అవకాశాన్ని ఇచ్చాయి. తెలుగుదేశం-జనసేన కూటమి, బిజెపి, కాంగ్రెస్‌లు అన్నీ కూడా జగన్మోహన్ రెడ్డిపై దాడి చేస్తున్నాయి. ఈసారి ప్రజలు ఆయనకు ఓటు వేసేది లేదంటూ గట్టిగా చెబుతున్నాయి. రాష్ట్రానికి సేవ చేసేందుకు ఇచ్చిన 'ఒక్క అవకాశాన్ని' కాలదన్నుకున్నారని అంటున్నాయి. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో, మొత్తం 175 అసెంబ్లీ స్థానాలకు గాను జగన్ పార్టీ 151 గెలుచుకుంది. రాష్ట్రంలోని 25 లోక్‌సభ స్థానాల్లోనూ 22 సీట్లను కైవసం చేసుకుంది. ఇటువంటి సవాళ్ళతో కూడిన సంక్లిష్ట సమయంలో, ఈసారి మొత్తంగా 175 అసెంబ్లీ స్థానాలను గెలుచుకునేలా పార్టీ కార్యకర్తల్లో స్ఫూర్తిని, ఉత్సాహాన్ని నింపేందుకు జగన్మోహన్ రెడ్డి 'వై నాట్ 175' అంటూ ఒక నినాదాన్ని తెర మీదకు తెస్తున్నారు. స్వంత పార్టీలోనూ, బయట పెరుగుతున్న అసమ్మతి ప్రభావం ఎన్నికల ఫలితాలపై ఎలా వుంటుందో అంచనా వేయడం అంత సులభం కాకపోవచ్చు కానీ అందుకుగల అవకాశాలను తోసిపుచ్చలేం.

# నైతిక ప్రమాణాలను కోల్పోయిన భారత్

ఇజ్రాయిలీలు పాలస్తీనియన్లను నిర్దాక్షిణ్యంగా చంపడం గురించి మనం ఏమీ మాట్లాడకుంటే, మనం కూడా దానిలో భాగస్వాములమైనట్లే. మన నైతికతలో ఏదో ఒక మార్పు శాశ్వతంగా ఉంటుంది. ఇళ్ళు, ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలు, పాఠశాలలు, యూనివర్సిటీల పై బాంబులు కురిపిస్తుండగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులైనప్పుడు, శిథిలాల కింద నుంచి ప్రాణాలు కోల్పోయిన పిల్లల్ని బయటకు లాగుతున్నపుడు, మనం సహాయం చేస్తున్నామా? గాజా సరిహద్దులు మూసివేయబడ్డాయి. ప్రజలు ఎక్కడికీ వెళ్ళలేరు. వారికి గూడు, కూడు, నీళ్ళు లేవు. సగం కంటే ఎక్కువ జనాభా ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్యసమితి చెప్తున్నది. అయినా వారిపై నిర్విరామంగా బాంబులతో దాడి చేస్తున్నారు. ఒక జాతి హననాన్ని పట్టించుకోలేని స్థాయికి మొత్తం ప్రజల్ని అమానవీయంగా మార్చడాన్ని మరోసారి చూడబోతున్నామా మనం ?

నేనీరోజు అత్యవసరమైన విషయం గురించి మాట్లాడాలని అనుకుంటున్నాను. మన దేశం తన నైతిక ప్రమాణాలను కోల్పోయింది. అత్యంత హేయమైన నేరాలు, జాతి సంహారం, జాతి ప్రక్షాళనకు పిలుపునిచ్చే భయంకరమైన ప్రకటనలను రాజకీయ ప్రతిఫలాలతో స్వాగతిస్తున్నారు. సంపద కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతమై ఉంటుండగా, పేదలకు రొట్టె ముక్కలు విసరడమనేది వారిని పేదలుగా మార్చే శక్తులకు మద్దతునివ్వడమే అవుతుంది. నేడు మనల్ని తికమక పెట్టే చిక్కు సమస్య ఏమంటే ప్రపంచవ్యాప్తంగా ప్రజలు తమను తాము నిర్వీర్యం చేసుకునే విధంగా ఓట్లు వేస్తున్నట్లు కనపడుతున్నారు. వారు అందుకుంటున్న సమాచారం ఆధారంగా వారు ఈ పని చేస్తున్నారు. ఆ సమాచారం ఏమిటి? దానిని నియంత్రించేదెవరు? ఎవరు సాంకేతికతను నియంత్రిస్తారో వారే ప్రపంచాన్ని నియంత్రిస్తారు. కానీ చివరికి, ప్రజల్ని ఎవరూ నియంత్రించలేరనీ, ఒక కొత్తతరం తిరుగుబాటు చేస్తుందని నేను నమ్ముతాను. అక్కడ ఒక విప్లవం వస్తుంది. క్షమించండి, విప్లవాలు వస్తాయి.

ఒక దేశంగా, మనం మన నైతిక ప్రమాణాలను కోల్పోయామని నేను అన్నాను. ప్రపంచ వ్యాప్తంగా మిలియన్ల మంది ప్రజలు-యూదులు, ముస్లింలు, క్రైస్తవులు, హిందువులు, కమ్యూనిస్టులు, నాస్తికులు గాజాలో తక్షణమే కాల్పులు విరమించాలనే పిలుపుతో ప్రదర్శనలు చేస్తున్నారు. కానీ ఒకప్పుడు వలస ప్రజలకు, పాలస్తీనాకు నిజమైన స్నేహితుడు, ఒకప్పుడు వేలాది మంది ప్రదర్శనలను చూసిన మన దేశంలోని వీధులు నేడు నిశ్శబ్దంగా ఉన్నాయి. చాలామంది మన రచయితలు, ప్రజా మేధావులు, అందరూ కాదు కానీ కొద్దిమంది కూడా మౌనంగా ఉండిపోయారు. ఎంతటి ఘోరమైన అవమానం! ఎంతటి ముందు చూపు లేని తనం! మన ప్రజాస్వామ్య నిర్మాణాలు క్రమ పద్ధతిలో కూల్చివేయబడడం, అపురూపమైన వైవిధ్యంతో కూడిన మన దేశం ఒకే విధమైన జాతీయవాదం అనే సంకుచిత ఆలోచనగా మారడం గమనిస్తుంటే, తమను తాము మేధావులుగా చెప్పుకునే వారు,మన దేశం కూడా ముక్కలవుతుందనే విషయాన్ని తెలుసుకోవాలి.

ఇజ్రాయిలీలు పాలస్తీనియన్లను నిర్దాక్షిణ్యంగా చంపడం గురించి మనం ఏమీ మాట్లాడకుంటే, మనం కూడా దానిలో భాగస్వాములమైనట్లే. మన నైతికతలో ఏదో ఒక మార్పు శాశ్వతంగా ఉంటుంది. ఇళ్ళు, ఆసుపత్రులు, శరణార్థ శిబిరాలు, పాఠశాలలు, యూనివర్సిటీలు, ప్రభుత్వ రికార్డులపై బాంబులు కురిపిస్తుండగా, లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులైనప్పుడు, శిథిలాల కింద నుంచి ప్రాణాలు కోల్పోయిన పిల్లల్ని బయటకు లాగుతున్నపుడు, మనం సహాయం చేస్తున్నామా? గాజా సరిహద్దులు మూసివేయబడ్డాయి. ప్రజలు ఎక్కడికీ వెళ్ళలేరు. వారికి గూడు, కూడు, నీళ్ళు లేవు. సగం కంటే ఎక్కువ జనాభా ఆకలితో అలమటిస్తున్నారని ఐక్యరాజ్యసమితి చెప్తున్నది. అయినా వారిపై నిర్విరామంగా బాంబులతో దాడి చేస్తు న్నారు. ఒక జాతి హననాన్ని పట్టించుకోలేని స్థాయికి మొత్తం ప్రజల్ని అమానవీయంగా మార్చడాన్ని మరోసారి చూడబోతు న్నామా



మనం? పాలస్తీనియన్లను అమానవీయంగా మార్చే ప్రణాళిక బెంజమిన్ నెతన్యాహుతో, అతని సిబ్బందితోనే మొదలు కాలేదు. అది దశాబ్దాల క్రితమే ప్రారంభమైంది. 2002, సెప్టెంబర్ 11న, 2001 మొదటి వార్షికోత్సవంలో నేను అమెరికాలో 'సెప్టెంబర్.. రా..' (కమ్ సెప్టెంబర్) అనే ప్రసంగం చేశాను. దానిలో నేను ఇతర సెప్టెంబర్ 11 వార్షికోత్సవాల గురించి మాట్లాడాను. ఆ రోజున 1973లో చిలీలో అధ్యక్షుడైన సాల్వడార్ అలెండీకి వ్యతిరేకంగా సీఐఏ అండతో చేసిన తిరుగుబాటు గురించి, అదేవిధంగా 1990 సెప్టెంబర్ 11న అప్పటి అమెరికా అధ్యక్షుడు జార్జి డబ్ల్యూ బుష్ సీనియర్, ఇరాన్‌కు వ్యతిరేకంగా యుద్ధం చేయాలన్న తన ప్రభుత్వ ప్రకటనపై మాట్లాడాను. ఆ తరువాత నేను పాలస్తీనా గురించి మాట్లాడాను. ఆ భాగాన్ని చదువుతాను. అది నేను 21 సంవత్సరాల క్రితం రాసిన విషయమని నేను మీకు చెప్పకుంటే, అది ఈ రోజు గురించేనని మీరనుకుంటారు.

"సెప్టెంబర్ 11 మధ్య ప్రాచ్యంలో కూడా విషాద సంకేతం లాంటిది. 1922 సెప్టెంబర్ 11న అరబ్బుల ఆగ్రహాన్ని పట్టించుకోకుండా బ్రిటీష్ ప్రభుత్వం పాలస్తీనాలో ఒక ఆజ్ఞను జారీ చేసింది. సర్వోన్నతాధికారం గల బ్రిటన్ జారీ చేసిన 1917 బాల్ఫోర్ ప్రకటనను అనుసరించి, దాని సైన్యాన్ని గాజా గేట్ల బయట కేంద్రీకరించింది. బాల్ఫోర్ ప్రకటన, యూదు ప్రజల కోసం ఒక జాతీయ నివాసాన్ని ఇస్తామని యూరోపియన్ జియోనిస్టులకు హామీ ఇచ్చింది. ఆ సమయంలో రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యానికి జాతీయ మాతృభూములను లాక్కొని, స్వాధీనం చేసుకునే స్వేచ్ఛ ఉండేది. సర్వోన్నత అధికారం, ప్రాచీన నాగరికతలను అత్యంత నిర్లక్ష్యంగా బలిచేసింది. మానని రణాల వంటి పాలస్తీనా, కాశ్మీర్‌లు ఆధునిక ప్రపంచానికి సామ్రాజ్యవాద బ్రిటన్ ఇచ్చిన బహుమతులు. ఈనాడు రగులుతున్న అంతర్జాతీయ ఘర్షణలను పెంచేందుకే సృష్టించిన ఉద్రిక్త పునాదులు.

1937లో విన్‌స్టన్ చర్చిల్ పాలస్తీనియన్ల గురించి ఇలా అన్నాడు: "తాను అనుభవించలేని వాటిని ఇతరులకు కాకుండా చేసే వ్యక్తి తనకే ఆ హక్కు ఉంటుందనే విషయాన్ని నేను అంగీకరించను. ఉదాహరణకు అమెరికాలో రెడ్ ఇండియన్స్‌కు, ఆస్ట్రేలియాలో నల్లజాతి వారికి సంబంధించి పెద్ద తప్పు జరిగిందంటే నేను ఒప్పుకోను. ఒక బలమైన జాతి, ఉన్నత శ్రేణిలోని జాతి, ప్రాపంచిక జ్ఞానం గల జాతి ఆ రకంగా వచ్చి, వారి స్థానాన్ని ఆక్రమించడం ద్వారా ఈ ప్రజలకు తప్పు

జరిగిందనే విషయాన్ని నేనొప్పుకోను." అదే, పాలస్తీనియన్ల పట్ల ఇజ్రాయిల్ రాజ్యం వైఖరిని ఏర్పరిచింది. ఇజ్రాయిల్ ప్రధానమంత్రి గోల్డా మెయిర్, "పాలస్తీనియన్లు ఉనికిలో లేరు" అని 1969లో అన్నారు. ఆమె వారసుడు, ప్రధానమంత్రి లెవీ ఎస్కోల్, "పాలస్తీనియన్లు ఏమిటి? నేను పాలస్తీనా వచ్చినప్పుడు, 2 లక్షల 50 వేల మంది యూదేతరులు, ప్రధానంగా అరబ్బులు, బెడౌయిన్లు ఉండేవారు." అన్నాడు. "పాలస్తీనియన్లు రెండు కాళ్ల జంతువులు" అని ఒకరు, పాలస్తీనియన్లు అణగదొక్కాల్సిన "మిడతలు" అని మరొక ప్రధాని అన్నారు. ఇది రాజ్యాధినేతల భాష, ఇవి సామాన్యుల మాటలు కాదు.

భూమి లేని ప్రజల కోసం ప్రజలు లేని భూమి గురించిన భయంకరమైన కథనం అలా మొదలైంది. 1947లో ఐక్యరాజ్యసమితి పాలస్తీనాను విభజించి, పాలస్తీనా భూమిలో 55 శాతం జియోనిస్టులకు కేటాయించింది. సంవత్సరం లోపే వారు 76 శాతం భూమిని స్వాధీనం చేసుకున్నారు. 1948 మే 14న, ఇజ్రాయిల్ రాజ్యాన్ని ప్రకటించారు. ఈ ప్రకటన కొద్ది నిమిషాల తరువాత అమెరికా ఇజ్రాయిల్ ను గుర్తించింది. వెస్ట్ బ్యాంక్ ను జోర్డాన్‌లో కలిపారు. గాజా స్ట్రిప్, ఈజిప్ట్ మిలిటరీ నియంత్రణలోకి వచ్చింది. పాలస్తీనా, శరణార్థులుగా మారిన వందలాది, వేలాది మంది పాలస్తీనా ప్రజల మనసుల్లో, హృదయాల్లో తప్ప ఉనికిలో మాత్రం లేకుండా పోయింది. 1967లో ఇజ్రాయిల్ వెస్ట్ బ్యాంక్, గాజా స్ట్రిప్‌లను ఆక్రమించింది. దశాబ్దాలుగా తిరుగుబాట్లు, యుద్ధాలు కొనసాగుతున్నాయి. వేల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. సంధులు, ఒప్పందాలపై సంతకాలు చేశారు. కాల్పుల విరమణ జరగాలని ప్రకటించారు, వాటిని ఉల్లంఘించారు. కానీ రక్తపాతం మాత్రం అంతం కాదు. పాలస్తీనా ఇప్పటికీ అక్రమమైన ఆక్రమిత ప్రాంతంగానే మిగిలింది. దాని ప్రజానీకం అమానవీయమైన పరిస్థితుల్లో బతుకుతున్నారు. వారు అక్కడ సామూహిక శిక్షలకు గురవుతూ, 24 గంటల కర్ఫ్యూలో మగ్గుతున్నారు. ప్రతీరోజు వారిని క్రూరంగా అవమానిస్తున్నారు. వారి ఇళ్ళు ఎప్పుడు కూల్చివేయబడతాయో, వారి పిల్లలపై ఎప్పుడు కాల్పులు జరుగుతాయో, వారి విలువైన చెట్లను ఎప్పుడు నరికివేస్తారో, వారి రోడ్లు ఎప్పుడు మూసివేస్తారో, ఆహార పదార్థాలు, మందులు కొనేందుకు మార్కెట్లకు వెళ్ళేందుకు ఎప్పుడు అనుమతిస్తారో వారికి అస్సలు తెలియదు. వారెలాంటి గౌరవం లేకుండా, కనుచూపు మేరలో ఆశ కనిపించని స్థితిలో బతుకుతున్నారు. వారికి వారి భూములపై, వారి భద్రతపై, వారి కదలికలపై, వారి సమాచారంపై, వారి నీటి సరఫరాపై నియంత్రణ లేదు. తమ ఆగ్రహాన్ని అదుపు చేసుకోలేని పాలస్తీనా యువకులు తమను తాము మానవ బాంబులుగా మార్చుకొని, ఇజ్రాయిల్ వీధుల్లో, బహిరంగ ప్రదేశాల్లో సంచరిస్తూ వారిని వారు ఆత్మాహుతి చేసుకుంటూ, సాధారణ ప్రజల్ని చంపుతూ, రోజువారీ జీవితంలో భయాన్ని నింపుతూ చివరికి రెండు సమాజాల అనుమానాలను, పరస్పర ద్వేషాన్ని కఠినతరం చేస్తున్నారు. ప్రతీ బాంబు దాడి పాలస్తీనా ప్రజలపై కనికరం లేని ప్రతీకారాన్ని, కష్టాల్ని ఆహ్వానిస్తోంది. అయితే ఆత్మాహుతి దాడి అనేది వ్యక్తిగత నిరాశతో కూడిన చర్య అవుతుంది, అది విప్లవ వ్యూహం కాదు.

ఈ పరిస్థితుల్లో శాంతియుతమైన, నిష్పాక్షిక పరిష్కారాన్ని కోరుతూ ఐక్యరాజ్యసమితి చేసిన తీర్మానాన్ని ఇజ్రాయిల్‌తో పాటు అమెరికా ప్రభుత్వం నిరోధించింది. ఇజ్రాయిల్ చేసిన ప్రతి యుద్ధానికి అమెరికా మద్దతు పలికింది. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేసినప్పుడు, పాలస్తీనియన్ల ఇళ్ళను ధ్వంసం చేసేది అమెరికా క్షిపణులే. ప్రతీ సంవత్సరం అమెరికా పన్ను చెల్లింపుదారుల డబ్బును (కొన్ని బిలియన్ డాలర్లను) ఇజ్రాయిల్ పొందుతున్నది.నేడు పాలస్తీనా పౌరులపై ఇజ్రాయిల్ వేస్తున్న ప్రతి బాంబు, ప్రతి ట్యాంక్, ప్రతి బుల్లెట్ పైన అమెరికా పేరు ఉంటుంది. అమెరికా హృదయపూర్వక మద్దతు లేకుండా ఇంత జరగదు. డిసెంబర్ 8న, ఐక్యరాజ్యసమితి భద్రతామండలి సమావేశంలో కాల్పుల విరమణకు అనుకూలంగా 13 సభ్య రాజ్యాలు ఓటు వేసినప్పుడు ఏం జరిగిందో మనం చూశాం, అమెరికా దానికి వ్యతిరేకంగా ఓటు వేసింది. నల్ల జాతి అమెరికన్ అయిన అమెరికా డిప్యూటీ అంబాసిడర్ ఆ తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ చెయ్యి ఎత్తిన వీడియో చూస్తుంటే మనసు దహించివేస్తుంది. సామాజిక మాధ్యమంలో తీవ్ర విమర్శలు చేసిన కొందరు వ్యాఖ్యాతలు దీనిని పీకముడి సామ్రాజ్యవాదం (ఇంటర్ సెక్షనల్ ఇంపీరియలిజం) అన్నారు.

# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందపు డొల్లతనం

విదేశీ వాణిజ్యం మీద ఏ విధమైన నియంత్రణా గనుక లేకపోతే దేశంలో నిరుద్యోగం పెరుగుతుందన్నది మూడవ ప్రపంచదేశాలు వలసలు గా ఉండిన కాలంలో చవిచూసిన అనుభవం. ఐనా ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్యం చాలా మంచిది అన్న అభిప్రాయం ఎక్కువగా వ్యక్తమవుతోంది. ఈ అభిప్రాయానికి బలం చేకూర్చేలా చాలా బూటకపు వాదనలను ముందుకు తెస్తున్నారు. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు ఈ తప్పుడు వాదనను ఆధారం చేసుకునే రూపొందాయి. తక్కిన దేశాలకంటే తమకు ఏ సరుకుల ఉత్పత్తిలో పైచేయి ఉండవచ్చునో అటువంటి సరుకుల ఉత్పత్తిలో ఆ దేశం ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించాలి అన్నదే ఆ వాదన

ఎటువంటి నియంత్రణలూ లేని విధంగా ఒక దేశపు వాణిజ్యం ఇతర దేశాలతో సాగుతోందనుకుందాం. ఆ విధానం వలన ఆ దేశం రెండు రకాల సమస్యలను ఎదుర్కోవచ్చు. మొదటిది: విదేశీ మారకం చెల్లింపులో లోటు. దిగుమతులద్వారా పొందగలుగుతున్న విదేశీ మారకం కన్నా ఎగుమతులకోసం చెల్లించవలసినదే ఎక్కువగా ఉండడం వలన ఈ సమస్య వస్తుంది. రెండవది: దిగుమతులతో దేశీయ ఉత్పత్తులు పోటీ పడలేని స్థితి రావడం వలన దేశీయ ఉత్పత్తి స్థాపక సామర్థ్యం మేరకు జరగకుండా తగ్గిపోతుంది. దాని వలన దేశీయ వనరులు నిరుపయోగంగా ఉండిపోతాయి. ముఖ్యంగా నిరుద్యోగం పెరుగుతుంది. ఈ రెండు సమస్యలూ ఒకేమాదిరివి కావు. నిరుద్యోగం కేవలం దిగుమతులు ఎక్కువైపోయినందువలన మాత్రమే ఏర్పడదు. దిగుమతులకన్నా ఎగుమతులు ఎక్కువగా ఉన్నప్పుడు కూడా ఏర్పడవచ్చు. ఉదాహరణకు: మన దేశం వలసపాలనలో ఉన్న కాలంలో విదేశీ ఉత్పత్తులు మన స్వదేశీ పరిశ్రమలను వృత్తులను దెబ్బ తీశాయి. దాని కారణంగా చేతివృత్తిదారులు, నైపుణ్యం కల పనివారు భారీస్థాయిలో తమ ఉపాధి కోల్పోయారు. ఐతే ఆ కాలంలో దిగుమతులకన్నా మన దేశం చేసిన ఎగుమతులే ఎక్కువ. ( ఆ విధంగా ఏర్పడిన మిగులును బ్రిటిష్ పాలకులు స్వాహా చేశారు) ప్రస్తుతం నేను విదేశీ మారక ద్రవ్యం చెల్లింపుల్లో లోటు గురించి చర్చించబోవడం లేదు. ప్రధానంగా నిరుద్యోగ సమస్య గురించి, స్వేచ్ఛా వాణిజ్యంతో దానికి ఉన్న సంబంధం గురించి చర్చిస్తాను.

విదేశీ వాణిజ్యం మీద ఏ విధమైన నియంత్రణా గనుక లేకపోతే దేశంలో నిరుద్యోగం పెరుగుతుందన్నది మూడవ ప్రపంచదేశాలు వలసలు గా ఉండిన కాలంలో చవిచూసిన అనుభవం. ఐనా ఇప్పుడు స్వేచ్ఛా వాణిజ్యం చాలా మంచిది అన్న అభిప్రాయం ఎక్కువగా వ్యక్తం ఔతోంది. ఈ అభిప్రాయానికి బలం చేకూర్చేలా చాలా బూటకపు వాదనను ముందుకు తెస్తున్నారు. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు ఈ తప్పుడు వాదనను ఆధారం చేసుకునే రూపొందాయి. తక్కిన దేశాలకంటే తమకు ఏ సరుకుల ఉత్పత్తిలో పైచేయి ఉండవచ్చునో అటువంటి సరుకుల ఉత్పత్తిలో ఆ దేశం ప్రత్యేక నైపుణ్యాన్ని సాధించాలి అన్నదే ఆ వాదన. ప్రతీ దేశమూ తాను ఏ సరుకును బాగా ఉత్పత్తి చేయగలదో దానిమీదే కేంద్రీకరిస్తే అప్పుడు ప్రపంచం మొత్తంగా చూసుకున్నప్పుడు ఎక్కువ సరుకులు ఉత్పత్తి అవుతాయి, ప్రతీ దేశమూ ఆ క్రమంలో ఎక్కువ ప్రయోజనాన్ని పొందుతుంది. – ఇదే స్వేచ్ఛామార్కెట్ వాదన సారాంశం. ఇంతకు మించి వేరే ఇతర వాదనలు దానివద్ద ఏమీ లేవు.

ఇది పూర్తిగా చెత్త. ప్రతీ దేశమూ పూర్తి స్థాయిలో అందరికీ ఉపాధి కల్పిస్తున్నది అని, అందుచేత ప్రపంచం మొత్తం మీద పూర్తి స్థాయిలో ఉపాధికల్పన జరిగిందని ఈ వాదన ఊహిస్తుంది. అటువంటప్పుడు అంతకు ముందు చేసే పనులకు బదులుగా స్వేచ్ఛా వాణిజ్యం వచ్చాక వాళ్ళను ఇతర పనులకు మరలించడమే జరుగుతుంది తప్ప నిరుద్యోగం తలెత్తే సమస్యే ఉత్పన్నం కాదు అన్నది దాని తాత్పర్యం.

ఈ వాదన ప్రాతిపదికకు వాస్తవంలో గాని, సిద్ధాంతరీత్యా గాని ఎటువంటి ఆధారమూ లేదు. 1930 దశకంలోనే మైఖేల్ కాలెక్కీ, జాన్‌మేనార్డ్ కీన్స్ ఈ స్వేచ్ఛావాణిజ్య

సిద్ధాంతపు డొల్లతనాన్ని సైద్ధాంతికంగా ఎండగట్టారు. నిజానికి అంతకు 75 సంవత్సరాలకు మునుపే మార్క్స్ అటువంటి స్థితి వస్తుందని అంచనాకు వచ్చాడు. స్వేచ్ఛావాణిజ్యం ఒక దేశానికి ఎటువంటి హాని కలిగిస్తుందో ముందే స్పష్టంగా తేలిపోయింది.

దీనిని తేలికగా వివరించడానికి ఒక ఉదాహరణను తీసుకుందాం. మొత్తం ప్రపంచం ఉత్పత్తి సామర్ధ్యం 100 యూనిట్లు అనుకుందాం. ప్రపంచ మార్కెట్ మొత్తం డిమాండ్ 80 యూనిట్లు అనుకుంటే అప్పుడు మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 20 యూనిట్లు చెల్లకుండా మిగిలిపోతాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో డిమాండ్ ను బట్టే ఉత్పత్తి జరుగుతుంది గనుక 20 యూనిట్ల ఉత్పత్తి సామర్ధ్యం మేరకు పని జరగకుండా ఆగిపోతుంది. అలా మిగిలిపోయిన వనరులు ఆ యా దేశాలలో ఉండిపోతాయి. ఇక్కడ ఒక ప్రశ్న రావచ్చు. నిరుద్యోగాన్ని పెంచే పెట్టుబడిదారీ విధానంతో విసుగెత్తిపోతే కార్మికులు సోషలిజంవైపు మొగ్గు చూపుతారు కనుక పెట్టుబడిదారీ ప్రభుత్వమే జోక్యం కల్పించుకుని మార్కెట్ లో జోక్యం కల్పించు కుని డిమాండ్ పెరిగేలా, తద్వారా కార్మికులందరికీ ఉపాధి లభించేలా చూడాలని కీన్స్ సూచించాడు. ఒక దేశంలో ఆ విధంగా చేయగలిగేటప్పుడు యావత్తు ప్రపంచ స్థాయిలోనే అటువంటి ప్రయత్నం చేసి పూర్తి 100 యూనిట్ల ఉత్పత్తి మేరకు డిమాండ్ ను పెంచి తద్వారా పూర్తిస్థాయి ఉపాధికల్పన జరిగేట్టు చూడవచ్చుకదా ? అప్పుడ ఏ దేశంలోనూ ఉత్పత్తి వనరులు మిగిలిపోవు కదా ?

ఈ ప్రశ్నకు ఒకే ఒక, సూటి అయిన సమాధానం ఉంది. ఆ విధంగా జరగాలంటే ప్రపంచం మొత్తం ఒక రాజ్యంగా ఉండాలి. ప్రపంచం మొత్తం మీద ఒక ప్రభుత్వం ఉండాలి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉండగా అటువంటిది జరగదు. అటువంటప్పుడు ఏ యే దేశాలలో ఉత్పత్తి సామర్ధ్యం పూర్తిగా వినియోగంలోకి రాకుండా ఉండిపోతుందో, ఆ యా దేశాల ప్రభుత్వాలు తమ మార్కెట్ డిమాండ్ ను పెంచడానికి, తద్వారా ఎక్కువగా ఉపాధి కల్పించడానికి పూనుకోవచ్చు. ఐతే స్వేచ్ఛావాణిజ్యం అమలులో ఉన్నందువలన, మార్కెట్ లో పెరిగిన డిమాండ్ ను కేవలం దేశీయంగా ఉత్పత్తి అయే సరుకులే అందుకుంటాయని చెప్పలేం. విదేశీ సరుకుల దిగుమతులు పెరిగి ఆ డిమాండ్‌ను తామే అందుకోవచ్చు. దానివలన ఆ దేశానికి దిగుమతులు పెరిగి వాణిజ్య లోటు భారం పెరుగుతుందే తప్ప తన ఉత్పత్తి సామర్ధ్యం పెరగడం మాత్రం జరగదు. ఆ దేశాలు గనుక స్వేచ్ఛా వాణిజ్యం పరిధిలోకి లేకుండా ఉండివుంటే విచ్చలవిడి దిగుమతులను నిరోధించి దేశీయ సరుకుల డిమాండ్ ను, తద్వారా ఉపాధి అవకాశాలను పెంచుకోవచ్చు. కాని, ఇప్పుడు స్వేచ్ఛావాణిజ్యం ఆ దేశాలను కట్టిపడేసింది.

ఇలా స్వేచ్ఛావాణిజ్యం కారణంగా ఆ యా దేశాలు తమ తమ మార్కెట్ డిమాండ్ ను, తద్వారా తమ దేశీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకునేలా జోక్యం చేసుకోలేని అశక్తతలోకి పడిపోయాయంటే దానర్థం స్వేచ్ఛావాణిజ్యం వచ్చాక కలిగిన ఉపాధి అవకాశాలకన్నా, స్వేచ్ఛావాణిజ్యం లేకుండావుండి వుంటే రక్షణ చర్యలద్వారా ఎక్కువ ఉపాధిఅవకాశాలను కల్పించుకోగలిగి వుండేవి అన్నమాట. స్వేచ్ఛావాణిజ్య సమర్ధకులు ముందుకు తెచ్చిన వాదన ప్రకారం ప్రతీ దేశమూ తనకు ప్రత్యేక సామర్ధ్యం కల సరుకులను ఉత్పత్తి చేయడం మీద కేంద్రీకరిస్తే అప్పుడు మొత్తం ప్రపంచ ఉత్పత్తి పెరుగుతుంది. అప్పుడు అన్ని దేశాలకూ లాభం ఒనగూరుతుంది. కాని మన పరిశీలనలో స్వేచ్ఛావాణిజ్యం అమలులోకి వచ్చాక అంతకు మునుపటి ప్రపంచ డిమాండ్ కన్నా తక్కువస్థాయికి డిమాండ్ పడిపోతుందని తేలింది.

అసలు స్వేచ్ఛావాణిజ్యం అమలులో ఉన్నప్పుడు ప్రపంచ స్థూల డిమాండ్ అనేది దేనిమీద ఆధారపడివుంటుంది? ప్రపంచ స్థూల డిమాండ్ ను ప్రాథమికంగా నిర్ణయించేది ప్రపంచం మొత్తం మీద అగ్రస్థానంలో ఉన్న పెట్టుబడిదారీ దేశం. ప్రస్తుతం అది అమెరికా. అమెరికా ఇప్పుడు డిమాండ్ ను సృష్టించడం విషయంలో చాలా ఎక్కువ స్వయంనిర్ణయాధికార శక్తి కలిగివుంది. అలా పెంచిన డిమాండ్‌లో కొంత భాగాన్ని ఇతర దేశాల ఉత్పత్తులు కాజేయవచ్చుగాక. అయినా అమెరికాకి ఏమీ బెంగ లేదు. ఎందుకంటే విదేశీ వాణిజ్య లోటు పెరిగిపోతుందనే భయం దానికి లేదు. డాలర్ ను బంగారంతో సమానంగా ప్రపంచం పరిగణిస్తూ తమ తమ డాలర్ నిల్వలను ఆ యా దేశాలు పెంచుకోడానికి ప్రయత్నిస్తున్నంతకాలమూ




అమెరికా కావలసినన్ని డాలర్లను ముద్రించుకోవచ్చు.

అందుచేత అమెరికాలోని వినిమయం ం పెట్టుబడులు ం ప్రభుత్వ వ్యయం కలిస్తే ప్రపంచ స్థూల డిమాండ్ ను నిర్ణయించే ప్రాథమికాంశంగా ఉంటుంది. అమెరికన్ ప్రభుత్వం చేసే వ్యయం మీద నియంత్రణ వేరే ఏమీ ఉండదు. కొళాయి ఇప్పినట్టు ఇప్పుకోవచ్చు. వర్తమాన పెట్టుబడిదారీ ప్రపంచంలో తక్కిన పెట్టుబడిదారీ దేశాల ప్రభుత్వాలపై సూపర్ ప్రభుత్వం మాదిరిగా ఒకమేరకు అమెరికా వ్యవహరించగలుగుతోంది. అంటే ఒక విధమైన ప్రపంచ ప్రభుత్వం మాదిరిగా వ్యవహరిస్తోంది. ఐతే, ఈ విషయంలో ఇప్పుడు ఒక వైరుధ్యం తన ప్రభావాన్ని చూపడం మొదలుబెడుతోంది. ఎంతగా తక్కిన దేశాలమీద పెత్తనం చెలాయించగలుగుతున్నా, మౌలికంగా అమెరికా కూడా ఒక జాతిరాజ్యంగానే ఉంది. అందుచేత అమెరికన్ ప్రభుత్వం దేశీయ డిమాండ్ ను పెంచుకుంటూ పోతే, ఆ డిమాండ్ లో కొంత భాగం విదేశీ దిగుమతుల ద్వారా భర్తీ అవుతుంది. అప్పుడు అమెరికా వాణిజ్యలోటు పెరుగుతుంది. ఆలోటును అమెరికన్ ప్రభుత్వం భర్తీ చేయవచ్చు. కాని ఆ క్రమంలో అమెరికా ప్రభుత్వం అప్పులపాలవుతుంది. ఐనా ఆ దేశానికేమీ ఢోకా లేకపోవచ్చు. కాని అప్పులపాల.తూ తన ప్రభుత్వ వ్యయాన్ని పెంచుతూవుంటే దాని ఫలితంగా కలిగే ఉపాధిలో కొంత భాగం విదేశాలకు చెందుతోంది. ఇలా ఇతరదేశాలలో ఉపాధి కల్పన కోసం మనం ఎందుకు అప్పులపాలవ్వాలి? అన్న ప్రశ్న అమెరికాలో ఒక జాతీయ దృక్పథం నుంచి చూసినప్పుడు తలెత్తుతోంది. ఒక జాతి రాజ్యంగా తనకున్న బాధ్యతకు, అంతర్జాతీయంగా సూపర్ ప్రభుత్వంగా వ్యవహరిస్తున్నదానికి మధ్య వైరుధ్యం తలెత్తుతోంది. ఈ వైరుధ్యం ఇటీవల కొంత తీవ్ర రూపం దాల్చుతోంది. కరోనా కాలంలో తక్కిన సంపన్న దేశాల మాదిరిగానే అమెరికా కూడా తమ ప్రజానీకానికి సహాయం అందించడం కోసం భారీగా ద్రవ్యలోటు పెంచి వ్యయం చేసింది. కరోనా నెమ్మదించిన తర్వాత కాలంలో కూడా దేశీయ స్థూల డిమాండ్ ను పెంచడం కోసం ఆ భారీ ద్రవ్యలోటును కొనసాగించాలని చూసింది. కాని ఈ మధ్య తీవ్రంగా ద్రవ్యోల్బణం తలెత్తడంతో కొంత వెనక్కు తగ్గింది. ఐతే, ఈ ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టగానే మళ్ళీ ద్రవ్యలోటును పెంచడానికి పూనుకుంటుంది. ఐతే, ఈ మారు తమ దేశీయ డిమాండ్ పెరగడం ఇతర దేశాలలో ఉపాధిఅవకాశాల పెరుగుదలకు కాకుండా తమ దేశంలోనే పెరిగేవిధంగా కొన్ని రక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇప్పటికే ఈ రక్షణ విషయంలో చైనా పట్ల కొన్ని చర్యలు తీసుకుంది. ఇప్పుడు తక్కిన మూడవ ప్రపంచదేశాల విషయంలో కూడా అదేమాదిరిగా వ్యవహరించనుంది. ఈ ధోరణిని కొందరు ప్రపంచీకరణ–వ్యతిరేక క్రమం అంటూ అభివర్ణిస్తున్నారు. కాని అది సరైనది కాదు. సరుకుల దిగుమతి విషయంలో రక్షణ చర్యలకు అమెరికా పూనుకుంటోందే తప్ప ద్రవ్య పెట్టుబడి స్వేచ్ఛగా సంచరించే విషయంలో ఏ ఆంక్షలనూ విధించడం లేదు. పైగా మరేదైనా దేశం గనుక ద్రవ్య పెట్టుబడి కదలికలపై ఆంక్షలకు పూనుకుంటే అమెరికా ఆ దేశాన్ని శిక్షిస్తోంది. ఈ మాదిరి వైరుధ్యాలను అమెరికా పెద్దగా పట్టించుకోదు. తక్కిన అన్ని దేశాలకూ స్వేచ్ఛావాణిజ్యం గురించి గొప్పగా చెప్తుందే తప్ప తనవద్దకు వచ్చేసరికి మాత్రం అది రక్షణ విధానాన్నే పాటిస్తోంది కదా.

# జాతీయాకరణ నుండి జాతి గర్వించే స్థాయికి ..




జనవరి 19, దేశ ఆర్థిక వ్యవస్థలోనూ, మరీ ముఖ్యంగా భారతీయ జీవిత బీమా వ్యాపార రంగంలోను కీలకమైన రోజు. 245 ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలు ప్రజల నుండి ప్రీమియం రూపంలో వసూలు చేసిన మొత్తాలను తమ స్వంత ప్రయోజనాలకు ఉపయోగించుకుంటూ పాలసీదారులను మోసం చేస్తున్న నేపథ్యంలో అన్ని ప్రైవేటు ఇన్సూరెన్సు కంపెనీలను కలిపి భారతీయ జీవిత బీమా వ్యాపారాన్ని జాతీయం చేస్తూ ఆర్డినెన్సును జారీ చేసిన రోజు. భారత దేశ జీవిత బీమా వ్యాపారాన్ని ప్రభుత్వ ఆధీనంలోకి వచ్చేలా నిర్ణయం తీసుకున్న రోజు (1956 జనవరి 19) నుండి ఇప్పటి వరకు ఏ లక్ష్యాలతో అయితే భారతీయ జీవిత బీమా వ్యాపారాన్ని జాతీయం చేసి ”లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా”(ఎల్ఐసి)గా ఏర్పాటు చేసుకున్నామో ఆ లక్ష్యాలను సాధించటంలో ఎల్ఐసి కృతకృత్యమైంది.

1956 సెప్టెంబర్ 1న పార్లమెంట్‌లో ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పడిన లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గత 68 సంవత్సరాలుగా జాతీయాకరణ లక్ష్య సాధన ద్వారా దేశీయ ఆర్థిక రంగానికి వెన్నెముకగా నిలిచింది. 2023 మార్చి

31 నాటికి దేశ ఆర్థిక రంగాభివృద్ధికి, ప్రజల శ్రేయస్సు కోసం రూ. 43,97,204.59 కోట్ల నిధులను పెట్టుబడులుగా ఉంచింది. 1956లో కేవలం రూ.5 కోట్ల పెట్టుబడితో ప్రారంభమై అనంతరం 2011లో ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ నియమాల ప్రకారం రూ.100 కోట్లు పెట్టుబడిగా మార్పు చేసుకుంది. 'ప్రజల సొమ్ము ప్రజల శ్రేయస్సు'కే అనే లక్ష్యంతో ప్రారంభమైన ఎల్ఐసి దేశవ్యాప్తంగా 40 కోట్లకు పైగా వ్యక్తిగత మరియు గ్రూప్ ఇన్సూరెన్స్ పాలసీదారులు వున్నారు. 95 శాతం సర్ప్లస్‌ను పాలసీదారులకు బోనస్‌గా ప్రకటిస్తూ మిగిలిన 5 శాతాన్ని గవర్నమెంట్‌కు డివిడెండ్‌గా ఇస్తూ, పరస్పర సహకార స్ఫూర్తితో 6 దశాబ్దాలకు పైగా ప్రజలకు భరోసాను ఇచ్చింది. ఎల్ఐసికి రూ.45,50,571.73 కోట్ల విలువ కలిగిన ఆస్తులు, రూ.40,81,326.41 కోట్ల లైఫ్ ఫండ్ ఉంది. ఇది అనేక దేశాల ఆర్థిక వ్యవస్థల జిడిపి కన్నా ఎక్కువ.

ఎల్ఐసి ప్రతి సంవత్సరం సుమారు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులను దేశ ఆర్థికాభివృద్ధికి అందిస్తున్నది. 31.03.2023 నాటికి ఎల్ఐసి యాజమాన్యం ఆధీనంలో (ఏయూఎమ్) ఉన్న మొత్తం విలువ రూ.43,97,205 కోట్లుగా నమోదు చేసి దేశ జాతీయ ఆదాయంలో సింహభాగంగా నిలిచింది. మొత్తం భారతదేశంలో ఉన్న మ్యూచువల్ ఫండ్ సంస్థల ఆస్తుల కన్నా ఎక్కువ విలువైన ఆస్తులను ఎల్ఐసికి వున్నాయి. ఎల్ఐసి ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే రూ. 1,831.08 కోట్లను ప్రభుత్వానికి డివిడెండ్‌గా అందించింది.

భారత దేశ బీమా రంగంలో ప్రైవేటు, విదేశీ కంపెనీలను అనుమతించి 2 దశాబ్దాలు దాటిన నేపథ్యంలో కూడా 24 ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలతో పోటీ పడి 62.58 శాతం మొదటి ప్రీమియం ఆదాయాన్ని, 71.76 శాతం మేరకు పాలసీలను కైవసం చేసుకుని ప్రభుత్వ రంగ ఎల్ఐసి మార్కెట్ లీడర్‌గా నిలిచింది. 2023 ఆర్థిక సంవత్సరంలోనే ఎల్ఐసి మొత్తం ఆదాయం రూ.7,88,046.28 కోట్లు సముపార్జించింది. ఈ ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే 225.51 లక్షల మేరకు క్లైయిము లను పరిష్కరించి 2,09,938.63 కోట్ల మొత్తాన్ని చెల్లించింది. 98.6 శాతం డెత్ క్లెయిమ్‌లను పరిష్కరించి పాలసీదారుల నమ్మకాన్ని నిలబెట్టుకుంది. 27.74 కోట్ల పాలసీలకు సేవలనందిస్తూ, ప్రపంచంలోనే ఎక్కువ మంది పట్టాదారులను కలిగి వున్న అతి పెద్ద సంస్థగా ఎల్ఐసి ఆవిర్భవించింది.

ప్రభుత్వ, ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ ప్రతికూల విధానాల ఫలితంగా జాతీయ బీమా పరిశ్రమ నేడు అనేక సవాళ్ళను ఎదుర్కొంటోంది. ప్రభుత్వ డిజిన్వెస్ట్‌మెంట్ విధానాలలో భాగంగానే, ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినా, ఎల్ఐసి ఐపిఓ ద్వారా స్టాక్ మార్కెట్‌లో ప్రభుత్వం తన వాటాలో 3.5 శాతం మేర విక్రయించి జాతీయాకరణ లక్ష్యాలకు తీవ్ర విఘాతం ఏర్పరిచింది. అయినప్పటికీ 5.64 లక్షల కోట్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ఎస్‌బిఐని దాటి అత్యంత విలువైన ప్రభుత్వ రంగ ఆర్థిక వ్యవస్థగా ఎల్ఐసి ఆవిర్భవించింది.

అయితే, అంతటి కీలకమైన ఎల్ఐసిలో ప్రభుత్వ వాటాలను ఉపసంహరించి, ప్రభుత్వ లోటు బడ్జెట్‌ను పూడ్చుకునేందుకు వినియోగించుకోవడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోంది. ఖర్చులను తగ్గించుకునే ప్రయత్నాలు, లైసెన్సుల జారీ, మూలధన అవసరాల మార్పులు, ఏజెంట్స్ పోర్టబిలిటీ నిబంధనలు, బ్యాంక్ ఎష్యూరెన్స్, కార్పొరేట్ ఏజెన్సీ, ఆన్‌లైన్, పెట్టుబడుల నిబంధనలు మొదలైన అంశాలపై, మార్పులను తీసుకురావ డానికి ప్రభుత్వం, ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ డెవలప్‌మెంట్ అథారిటీ ప్రయత్నిస్తున్నాయి. వీటిని అమలు చేస్తే బీమా పరిశ్రమను జాతీయాకరణ ముందు పరిస్థితులకు తీసుకెళ్ళే ప్రమాదం ఉంది. గత ఆర్థిక సంవత్సరాన్ని పరిశీలించినట్లయితే అన్‌ఫెయిర్ బిజినెస్ ప్రాక్టీసెస్‌కు సంబంధించి నమోదైన మొత్తం ఫిర్యాదులలో 50.41 శాతం ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు సంబంధించినవనేది గమనార్హం.

అనేక సందర్భాలలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని తన ప్రతిభను, సత్తాను నిరూపించిన ఎల్ఐసి ఆఫ్ ఇండియా జాతీయాకరణ నాటి నుంచి జాతి గర్వించే స్థాయికి చేరుకోవడం దేశానికే గర్వకారణం. అయితే ప్రస్తుత పోటీ తత్వాన్ని, ప్రైవేటు రంగానికి ఎక్కువ చేయూతను, ప్రోత్సాహాన్ని ఇస్తున్న ప్రభుత్వ విధానాలను సైతం తోసిపుచ్చి తన ప్రస్థానాన్ని కొనసాగిస్తుందని ఆశిద్దాం.

# జిడిపిలో వ్యవసాయం ఎక్కడుంది?

మహారాష్ట్రలోని హింగోలి జిల్లాలో బ్యాంకు రుణాలు చెల్లించలేని పది మంది రైతులు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడారు. ''తీసుకున్న అప్పు చెల్లించలేకపోవడంతో బ్యాంకులు మాకు నోటీసు ఇచ్చాయి. తిరిగి కట్టడానికి మా దగ్గర ఒక్క పైసా కూడా లేదు. కాబట్టి, అప్పు తీర్చడానికి మేం మా శరీర భాగాలను అమ్మడానికి సిద్ధంగా ఉన్నాం'' (ఒక్కో అవయవం ధరను ఇలా ప్రకటించారు:లివర్-రూ.90,000, కిడ్నీ-రూ.70,000, కన్ను-రూ.25,000).బడా కార్పొరేట్లు పదేళ్లుగా బకాయిపడిన రూ.15 లక్షల కోట్ల మొండి బాకీలను బ్యాంకులు మాఫీ చేసిన దేశంలో పేద రైతులు తమ అవయవాలను అమ్ముకుని అప్పులు తీర్చుకోవడం తప్ప మరో మార్గం లేదని ప్రకటించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. రైతులు చేసిన ఈ ప్రకటన భారతీయ వ్యవసాయ-గ్రామీణ ఆర్థిక వ్యవస్థ విషాద చిత్రాన్ని వెల్లడిస్తుంది. ఇదిలా ఉండగా, దేశంలో వ్యవసాయ వృద్ధి ఎనిమిదేళ్లలో అత్యంత దారుణంగా క్షీణిస్తున్నదని నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ (ఎన్ఎస్ఓ) గత వారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు తెలియచేస్తున్నాయి. ఎన్ఎస్ఓ ప్రాథమిక అంచనా ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023-24) వ్యవసాయ రంగంలో వృద్ధి 1.8 శాతం మాత్రమే. దీనికి ముందు 2015-16లో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. అప్పుడు వృద్ధి 0.6 శాతం మాత్రమే. 2022-23లో 4 శాతం ఉన్న వృద్ధి ఇప్పుడు సగానికి తగ్గింది. నేషనల్ స్టాటిస్టిక్స్ ఆఫీస్ రిపోర్ట్ (జనవరి 6) ప్రచురించిన మరుసటి రోజు వెలువడిన బిజినెస్ స్టాండర్డ్ కథనం, జనవరి 10 'హిందూ' సంపాదకీయం వ్యవసాయంలో క్షీణత గురించి నొక్కిచెప్పాయి. జిడిపి లోనే, వాణిజ్యం, హోటల్, రవాణా, కమ్యూనికేషన్ కూడా గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే క్షీణించాయి. వీటన్నింటిలో గత సంవత్సరం 14 శాతం వృద్ధి ఉంటే, ఈసారి అది 6.3 శాతానికి పడిపోయింది. ఉపాధి అందుబాటులో ఉన్న అన్ని రంగాల్లో వృద్ధి తక్కువగా ఉంది.దేశంలోని శ్రామిక శక్తిలో 47 శాతం వ్యవసాయ రంగంలో ఉన్నారు. దాదాపు 70 శాతం గ్రామీణ కుటుంబాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపై ఆధారపడి ఉన్నాయి. మరో అంచనా ప్రకారం జనాభాలో దాదాపు సగం మంది (70 కోట్లు) వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కానీ ప్రస్తుతం రైతులు వ్యవసాయ కూలీలుగా, కాంట్రాక్టు కూలీలుగా మారుతున్నారు. దేశానికి వెన్నెముకగా ఉన్న వ్యవసాయ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను మోదీ పాలన పూర్తిగా విస్మరించిందని పతనానికి సంబంధించిన గణాంకాలు తెలియజేస్తున్నాయి. వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు గాని, ఉత్పత్తి ఖర్చులకు తగిన మద్దతునిచ్చేందుకు గాని ఎలాంటి చర్యలూ లేవు. ఎం.ఎస్.స్వామినాథన్ కమిషన్ సిఫార్సు ప్రకారం ఉత్పత్తి వ్యయంలో యాభై శాతం కలిపితే కనీస మద్దతు ధర. దీన్ని చట్టబద్ధంగా నిర్ధారించాలన్నది ఏడాది పాటు సాగిన రైతాంగ సమ్మె ప్రధాన డిమాండ్. అది ఇంకా అమలు కాలేదు. 2023-24లో వివిధ రంగాలకు మొత్తం బడ్జెట్ కేటాయింపులు రూ.45 లక్షల కోట్లు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.1.25 లక్షల కోట్లు మాత్రమే. మొత్తం బడ్జెట్‌లో 2.8 శాతం మాత్రమే. వ్యవసాయానికి ఇంత తక్కువ కేటాయింపులు జరగడం చూస్తుంటే సామాన్య రైతులు వ్యవసాయాన్ని వదిలేయాలని ప్రభుత్వం ఒత్తిడి చేస్తోందని స్పష్టమవుతోంది. ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఒఇసిడి) 54 దేశాలలో నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, వ్యవసాయానికి బడ్జెట్ మద్దతు లేని దేశం భారతదేశం. 1991 నుండి భారతదేశంలో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల తీవ్ర ప్రభావం వ్యవసాయంపైన ఉంది. వ్యవసాయ రంగంలో ఎక్కడ చూసినా రుణాలు అందక, తీసుకున్న అప్పులు తీర్చలేక, వడ్డీ వ్యాపారుల వలలో చిక్కుకుని, తమ ఉత్పత్తులకు తగిన ధర లభించక జీవనం సాగిస్తున్న దయనీయ పరిస్థితి మనకు కనిపిస్తుంది. మూడు దశాబ్దాల్లో మూడు లక్షల మంది రైతులు ప్రాణాలు తీసుకున్నారు. 1991 నుంచి 2011 మధ్య కాలంలో కోటిన్నర మంది రైతులు వ్యవసాయాన్ని వదులుకున్నారు. దాదాపు పదేళ్ల నరేంద్ర మోడీ పాలనలోనే 1,00,474 మంది




రైతులు ఆత్మహత్య చేసుకున్నారు (నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో అంచనాలు). 2021లో 10,881 మంది, 2022లో 11,290 మంది ప్రాణాలు కోల్పోయారు.ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రయివేటు బీమా కంపెనీలకు కోట్లకు పడగలెత్తే మార్గంగా మారింది. 2019లో ప్రకటించిన పి.ఎం కిసాన్ సమ్మాన్ పథకం, రైతులకు సంవత్సరానికి రూ. 6,000 అందజేస్తుంది. ఇది కొంతమందికి మాత్రమే అందుబాటులో ఉంది. భారతదేశ స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయం వాటా 1991లో 35 శాతం ఉండగా 2022-23 నాటికి 15 శాతానికి తగ్గిందని ప్రభుత్వమే ఇటీవల పార్లమెంటుకు తెలియజేసింది. దీన్నిబట్టి చూస్తే వ్యవసాయానికి తగిన ప్రాధాన్యం లేదని స్పష్టమవుతోంది. ఆర్థిక సర్వే 2016 ప్రకారం, 17 రాష్ట్రాల్లో వ్యవసాయ కుటుంబాల సగటు వార్షిక ఆదాయం రూ.20,000. అంటే నెలకు రూ.1700. రైతుల ఆదాయం వెనక్కు వెళ్లింది తప్ప ఏమాత్రం ముందుకు సాగలేదు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని మోడీ ప్రకటించారు మరి!వ్యవసాయ రంగంలోని వాస్తవాలను దాచి పెడుతున్నారని, ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని ప్రధాని మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రతిరోజూ ఊదరగొడుతున్నారు. దేశానికి తిండి పెట్టే అట్టడుగు వర్గాల రైతుల పట్ల వారికి దయ, ప్రేమ లేదు. వ్యవసాయ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఏడాది పాటు సాగిన రైతుల సమ్మెను అనివార్య పరిస్థితులలో ముగించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. మనందరికీ అన్నం పెట్టే రైతుపై మృత్యుపాశం విసిరేందుకు మోడీ ప్రభుత్వం ప్రయత్నించింది. పోరాటమే రైతు ముందున్న ఏకైక మార్గం. గణతంత్ర దినోత్సవమైన జనవరి 26న జిల్లా స్థాయిలో దేశవ్యాప్తంగా చేయనున్న ట్రాక్టర్ ర్యాలీలు కొత్త పోరాటాలకు నాంది కానున్నాయి.

# కేంద్రం పూర్తి పెత్తనంలోకి ఎన్నికల కమిషన్

ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆదేశాల అమలు కోసం ఈ చట్టం చేసినట్టు ప్రభుత్వం చెప్పుకుంది. కానీ వాస్తవానికి అక్షరాలా ఆ తీర్పు ప్రభావం లేకుండా చేయడానికీ అందులోని కీలక అంశాలను తిరస్కరిస్తూ చేసిన శాసనం ఇది. 140 మంది ఎంపీల సస్పెన్షన్, దాన్ని కప్పిపుచ్చడం కోసం ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌ను అనుకరించారనే గగ్గోలు నేపథ్యంలో కీలకమైన ఈ శాసనం మరుగున పడిపోయింది. వాస్తవానికి అది భారత ప్రజాస్వామ్య పరిరక్షణకు గొడ్డలి పెట్టు లాంటిది. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల ప్రక్రియకు ఆధ్వర్యం వహించే ఎన్నికల కమిషన్ నియామకం ప్రధాని ఇష్టారీతికి వదిలేసే దుర్మార్గమది. ఇదంతా సుప్రీంకోర్టు చెప్పినట్టు చెప్పడం మరింత విపరీతం.

దేశంలో ప్రజాస్వామిక విలువలను వమ్ము చేయడమే గాక రాజ్యాంగ వ్యవస్థల మూల స్ఫూర్తిని కూడా దెబ్బ తీస్తూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎన్నో నిరంకుశ చర్యలకు పాల్పడింది. ఈ క్రమంలో బాహాటంగా బరితెగించి వ్యవహరించినవి కొన్నయితే అచ్చంగా చట్టబద్దంగా చట్టం కోసమే చేస్తున్నట్టు కనిపిస్తూ చాప కింద నీరులా అనుకున్న పని కానిచ్చిన అతితెలివి వేషాలు అనేకం. ప్రధాన ఎన్నికల కమిషనర్, కమిషనర్ల నియామక ప్రక్రియకు సంబంధించి పార్లమెంటులో ఇటీవల బిల్లు ఆమోదింపచేసుకోవడం ఈ రెండవ కోవలోకి వస్తుంది. ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఆదేశాల అమలు కోసం ఈ చట్టం చేసినట్టు ప్రభుత్వం చెప్పుకుంది. కానీ వాస్తవానికి అక్షరాలా ఆ తీర్పు ప్రభావం లేకుండా చేయడానికీ అందులోని కీలక అంశాలను తిరస్కరిస్తూ చేసిన శాసనం ఇది. 140 మంది ఎంపీల సస్పెన్షన్, దాన్ని కప్పిపుచ్చడం కోసం ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కర్‌ను అనుకరించారనే గగ్గోలు నేపథ్యంలో కీలకమైన ఈ శాసనం మరుగున పడిపోయింది. వాస్తవానికి అది భారత ప్రజాస్వామ్య పరిరక్షణకు గొడ్డలి పెట్టులాంటిది. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నికల ప్రక్రియకు ఆధ్వర్యం వహించే ఎన్నికల కమిషన్ నియామకం ప్రధాని ఇష్టారీతికి వదిలేసే దుర్మార్గమది. ఇదంతా సుప్రీంకోర్టు చెప్పినట్టు చెప్పడం మరింత విపరీతం. చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్లు (నియామక షరతులు, సర్వీసు పదవీ నిబంధనలు) బిల్లు 2023 పేరిట వచ్చిన ఈ బిల్లును రాజ్యసభ డిసెంబర్ 12న ఆమోదించింది. ప్రధాన మంత్రి అధ్యక్షులుగా, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, ప్రధాని నియమించే మరో కేంద్రమంత్రి సభ్యులుగా కమిటీ ఈ ఎంపిక కోసం రాష్ట్రపతికి పేరు సిఫార్సు చేస్తుంది. ఇప్పటికే కార్యదర్శులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన వారే ఈ పదవికి అర్హులుగా వుంటారు. అంటే నియమించే కమిటీలో ప్రధాని మాట అమలవుతుంది. నియామకానికి అర్హులైన వారు కూడా ఆ ప్రభుత్వంలో పనిచేసిన వారే అయివుండాలి. ఇక ఎన్నికల కమిషన్ స్వతంత్ర ప్రతిపత్తి గురించి చెప్పేదేముంది (ఒకసారి సిఇసిగా పని చేశాక మరో పదవి చేపట్టరాదని మాత్రం ఇందులోవుంది.)? ఈ బిల్లు సభ ముందుకు రావడానికి ముందు జరిగిన తతంగం మరింత కీలకమైంది.

## రాజ్యాంగం, రాజకీయానుభవాలు

రాజ్యాంగం 324వ అధికరణం ఎన్నికల కమిషనర్‌ను రాష్ట్రపతి నియమిస్తారని మాత్రమే పేర్కొంది. అయితే ఎన్నికలు నిష్పక్షపాతంగా స్వేచ్ఛాయుత వాతావరణంలో శాంతియుతంగా జరిగితేనే ప్రజాస్వామ్యం అన్నపదానికి అర్థముంటుంది. దీర్ఘకాలం పాలన చేసిన కాంగ్రెస్ హయాంలోనే ఎన్నికల కమిషన్ల తీరు విమర్శలకు గురైంది. ఇందిరా గాంధీ హయాంలో ఎన్నికల, ఉప ఎన్నికల నిర్వహణ వాయిదా, కేంద్ర బలగాల వినియోగం వంటివి విమర్శల పాలైనాయి. 1972లో పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం, వామపక్షాలను అధికారంలోకి రాకుండా చేయడానికై సైన్యాన్ని దింపి రిగ్గింగ్ చేసినా ఎన్నికల సంఘం పట్టించుకోలేదు. చాలాసార్లు శాసనసభలను ముందే రద్దు చేయడం కూడా విమర్శల పాలైంది. ధనబలం, ఫిరాయింపులు వంటి అనైతికత తాండవించడం మొదలైంది. కాంగ్రెస్ నుంచి రాజీనామా చేసిన హెచ్ఎన్ బహుగుణ, వి.పి.సింగ్ వంటి వారు ఉప ఎన్నికలు కోరితే వాటిని వాయిదా వేస్తూ రద్దు చేస్తూ ఇష్టానుసారం వ్యవహరించడం కూడా దేశం చూసింది.




అప్పట్లో ఒకే ఎన్నికల కమిషనర్ వుండేవారు. అద్వానీ రథయాత్ర తర్వాత వి.పి.సింగ్ ప్రభుత్వాన్ని కూల్చివేసిన తర్వాత కీలుబొమ్మ చంద్రశేఖర్ సర్కారు వచ్చింది. ఆ సమయంలో ఎన్నికల కమిషనర్‌గా వివిఎన్ రమాదేవికి అర్హతలున్నా కాదని టిఎన్ శేషన్‌ను చేశారు. ఎన్నికల కమిషన్ అధికారాలను మొదటి సారి గట్టిగా ఉపయోగించిన శేషన్‌ను ఆదర్శంగా చెబుతుంటారు. కొన్ని విషయాల్లో అయన పాలక పార్టీలను అదుపు చేసిన మాట నిజమేగాని తనే ఒక నిరంకుశ కేంద్రంగా మారిపోయారు. మత రాజకీయాలను ఎన్నడూ పట్టించుకోలేదు. పార్టీల, ప్రభుత్వాల రాజ్యాంగ బద్ధమైన హక్కులను కూడా భంగపరిచారు. ఆ సమయంలో తనను తొలగించే అవకాశం లేదు గనక మరో ఇద్దరు అదనపు కమిషనర్లను నియమించడం ద్వారా అదుపు చేయాల్సి వచ్చింది.

## సిఇసిపై సుప్రీం కీలక తీర్పు

తర్వాతి కాలంలో వివిధ ప్రభుత్వాల హయాంలో ఈ తీరు మారిందని కాదు గానీ మోడీ హయాంలో మిగిలిన రంగాలలో వలెనే ఇక్కడా ఏకపక్ష ధోరణి ముదిరిపోయింది. సిబిఐ, ఇడి అధిపతులుగా ఆశ్రితులను నియమించి ప్రతిపక్షాలపై ప్రయోగించే ధోరణి పరాకాష్టకు చేరింది. దీనిపై అనేక సార్లు సంబంధిత వ్యక్తులు, సంస్థలూ కూడా సుప్రీం కోర్టులో సవాలు చేయడం చూశాం. ఎక్కువ సందర్భంలో నచ్చినవారిని అడ్డదోవలో అందలమెక్కించడం మాత్రం ఆగలేదు. పలుసార్లు సుప్రీం కోర్టు జోక్యం చేసుకుని అక్షింతలు వేసినా ఆగ్రహించినా ధోరణి మారింది లేదు. నచ్చిన వాళ్లను నియమించడం, వారికి పదేపదే పదవీ కాలం పొడిగించడం పరిపాటి అయ్యింది. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విషయంలో ముందే వద్దన్నా వినకుండా నియమించడమే గాక రెండుసార్లు పొడగింపు తీసుకున్నారు. చివరకు ఇదే ఆఖరి సారని హెచ్చరించింది కోర్టు. ఇక మరింత కీలకమైన ఎన్నికల సంఘం విషయంలోనూ ఇదే సమస్య ఎదురైంది. ఏకపక్ష నియామకాలు జరగకుండా ఒక నియామక ప్రక్రియ నిర్దేశించాలని కోరుతూ ఎడిఆర్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) తరపున 2022లో ఒక పిటిషన్ దాఖలైంది. దీన్ని త్రిసభ్య రాజ్యాంగ ధర్మాసనం విచారిస్తుండగానే సిఇసి పదవీ విరమణ వచ్చింది. ఆ సమయంలోనే అరుణ్ గోయెల్ అనే కార్యదర్శి తన పదవినుంచి స్వచ్ఛంద పదవీ విరమణ చేయడం, 24 గంటల్లోనే సిఇసిగా నియమించడం జరిగిపోయాయి. సుప్రీం కోర్టు ఒకవైపున ఈ విషయం విచారిస్తుండగానే ఇంత హడావుడి దేనికని తీవ్ర విమర్శలు వచ్చాయి. సిఇసి పదవీ కాలం ఆరేళ్లు. లేదా 65 ఏళ్లు నిండడం. ఇందులో ఏ కొలబద్దతో చూసినా గోయెల్ ఎంపికయ్యే అవకాశముండదు. తమ ముందుకు వచ్చిన నాలుగు పేర్లలోనూ గోయెల్ చిన్నవారు గనక తనను నియమించినట్టు అటార్నీ జనరల్ (ఎజి) సమర్థించుకున్నారు. ఈ నియామకాన్ని సవాలు చేస్తూ పిటిషన్ దాఖలైనప్పుడు కేంద్రం అధికారాన్ని ప్రశ్నించలేమని కోర్టు

చెప్పింది. అయితే ఎడిఆర్ కేసులో దీనిపై సమగ్ర తీర్పు వస్తుందని కూడా సూచించింది. తీరా ఆ కేసు విచారణకు వచ్చినపుడు ప్రభుత్వ నిర్ణయాన్ని ఎజి ఆర్.వెంకట్రామన్ ఏకపక్షంగా సమర్థించారు. రాజ్యాంగం సిఇసి నియామకంపై ఎలాంటి నిర్దేశకాలు చేయలేదని వాదించారు. ఏమీ చెప్పనప్పుడు మరింత జాగ్రత్తగా వుండాలని, దీనిపై ఏవైనా మార్గదర్శకాలు ఇస్తామని సుప్రీం కోర్టు చెప్పగా అలా జోక్యం చేసుకోవాలని న్యాయ వ్యవస్థకు అధికారం ఇవ్వలేదని కూడా ఆయన అభ్యంతరం చెప్పారు. రాజ్యాంగం ఈ విషయంలో మౌనం పాటించింది గనక కోర్టులు చేయడానికి లేదన్నారు. జస్టిస్ జోసఫ్ అధ్యక్షతన గల ధర్మాసనం దీనిపై తీర్పునిస్తూ సిఇసి నియామకంలో అనుసరించాల్సిన సూత్రాలపై పార్లమెంటు చట్టం చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఇచ్చిన తీర్పులో న్యాయమూర్తి రాజ్యాంగం సిఇసి కి ఎంత ప్రత్యేక స్థానం ఇచ్చిందో అంబేద్కర్ మాటల్లోనే ప్రస్తావించారు. ప్రజాస్వామ్యం అంటేనే ఎన్నికలు సక్రమంగా జరగడమనీ, దానికి ఎన్నికల సంఘం కీలకమని అంబేద్కర్ అప్పట్లో పేర్కొన్నారు. రాజ్యాంగ పరిషత్తు చర్చలో ఈ నియామకంపై నిబంధనలు నిర్దిష్టంగా వుండాల్సిన అవసరాన్ని నొక్కిచెబుతూ ప్రొఫెసర్ సిబ్బన్‌లాల్ సక్సేనా ప్రతిపాదించిన సమగ్ర సవరణ ఆ సందర్భంలో జరిగిన చర్చ వివరంగా పొందుపర్చారు. కాగ్ వంటి వాటితో పోలిస్తే ఎన్నికల సంఘం అత్యంత ముఖ్యం గనకే అందుకు ప్రత్యేక నియామక పద్ధతిని రాజ్యాంగం చెప్పిందనీ, ఇందుకు స్వతంత్రత అనేది కొలబద్ద అని స్పష్టం చేశారు. సిఇసి కార్యనిర్వాహక వర్గానికి లోబడి వుండకూడదనేది కీలకసూత్రం. పార్లమెంటు చట్టం చేసేలోగా కూడా స్వతంత్రత కాపాడేందుకు గాను ప్రధాని ప్రతిపక్ష నాయకుడు, భారత ప్రధాన న్యాయమూర్తులతో కూడిన కమిటీ రాష్ట్రపతికి సూచనను చేయాలని నిర్దేశించారు.

## తీర్పుకు తూట్లు పొడిచిన కేంద్రం

కోర్టు చెప్పినట్టే తాము కొత్త చట్టం తెచ్చామని కేంద్రం వాదించడం తీర్పును అపహాస్యం చేయడమే. ఎందుకంటే ఏ తీర్పులోనైనా రెండు భాగాలుంటాయి. ఒకటి ఒబిటర్ డిక్టా, రెండు రేషియో డిసిడెండి. మొదటిది ఆదేశపూర్వకం. తప్పక అమలు చేయాలి. రెండోది ఆ తీర్పునకు మూలమైన స్ఫూర్తి వివరణ. ఈ తీర్పులో కేంద్రం చట్టం చేయాలన్నది ఆదేశమైతే సిఇసి స్వతంత్రత కాపాడాలనేద స్ఫూర్తి. సాక్షాత్తూ ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా చేయడం ద్వారా సుప్రీంకోర్టు తన అభిప్రాయాన్ని స్పష్టంగా వెల్లడించింది. అయినా మోడీ సర్కారు ఏవో పొంతనలేని వాదనలతో బిల్లు తీసుకొచ్చింది. ప్రధాన న్యాయమూర్తిని భాగస్వామిగా వుంచాలని కోర్టు సూచనగా చెబితే దాని బదులు ప్రధాని నియమించే కేంద్ర మంత్రికి సభ్యత్వం కల్పించింది. ప్రతిపక్ష నాయకుడికి నామక: స్థానం కల్పించినా మెజారిటీ వారికే వుంటుందనేని స్పష్టం. అంతేగాక కార్యదర్శి హెూదా కలిగిన వారేనని చెప్పడం కూడా ఎంపికను పరిమితం చేసింది. ఇక ఎంపికయ్యేవారికి ప్రభుత్వం ఎలాంటి ప్రత్యేకాభిమానం చూపినట్టు వుండకూడదని కూడా కోర్టు చెప్పింది. కాని ఇక్కడ కావలిసిన వారినే తీసుకోవడం ద్వారా వారు లోబడి వుండాల్సిన పరిస్థితి కల్పించబడింది. ప్రధాన కమిషనరుగా నియమించబడేవారికి సుప్రీంకోర్టు జడ్జిలతో సమానంగా జీతభత్యాలు వుండాలని తీర్పులో చెబితే ప్రభుత్వం మొదట కార్యదర్శి స్థాయి వేతనం మాత్రమే ప్రతిపాదించింది. ప్రతిపక్షాల విమర్శల తర్వాతనే దాన్ని ఆ స్థాయికి చేరుస్తూ సవరణ తెచ్చారు. సిజెఐ కూడా సభ్యుడుగా వుండాలని వచ్చిన సవరణను సభ తోసిపుచ్చింది. కమిషన్ సభ్యులకు విధి నిర్వహణలో తీసుకున్న నిర్ణయాలకుగాను కేసులు పెట్టే అవకాశం, తొలగింపు అధికారం లేకుండా చేయాలన్న సూచనను కూడా ఆమోదించలేదు. ఒక్క సిఇసికి మాత్రమే సుప్రీం కోర్టు జడ్జిల తరహాలో కేసుల నుంచి రక్షణ కల్పించబడింది. కోర్టుల జోక్యం కన్నా రాజకీయ జోక్యమే ఎన్నికల సంఘానికి సవాలు గనక ఆ ఒత్తిడి అలాగే వుంటుందన్న మాట. ఈ విధంగా సుప్రీంకోర్టు మార్గదర్శకాలను ఉల్లంఘించి ఎన్నికల సంఘ బిల్లు తెచ్చారని ఎంపీలు విమర్శించగా రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌కర్ ఆగ్రహించారు. సభలో మనం స్వతంత్రంగా నిర్ణయాలు చేయాలిగాని ఎవరి పెత్తనం మనపై వుండరాదని సూక్తులు చెప్పారు. వాస్తవంగా జరిగింది వేరు. అన్ని విధాల కేంద్రానికి లోబడి వుండేలా ఎన్నికల కమిషనర్ల నియామకానికి రంగం సిద్ధమైంది. ఇక ఎన్నికల స్వతంత్ర నిర్వహణ మరింత ప్రశ్నార్థకమవుతుంది.

# హామీలు మరచిన సర్కారు !

ఈ వాగ్దానాల అమలు కోసం రాష్ట్రంలోని 123 నగర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పరిధిలోకి వచ్చే సుమారు 46 వేల మంది పారిశుధ్య కార్మికులు గత నాలుగున్నరేళ్లుగా అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ఇంకో మూడు నాలుగు నెలల్లో ఎన్నికల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు గోదాలోకి దిగిపోయాయి. 'మాట తప్పం, మడమ తిప్పంఅంటూ మీరిచ్చిన హామీలను అమలు చేయకుండా మరలా ఎన్నికలకు ఎలా వెళ్తారు?' అని ప్రశ్నిస్తూ మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు సైరన్ మోగించారు.

'ఇంకో ఆరు నెలల్లో మన ప్రభుత్వం వస్తుంది. మన ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తాం. టైం స్కేలు, సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం సమాన పనికి సమాన జీతం అమలు చేస్తాం. వారం రోజుల్లోనే సిపిఎస్ రద్దు చేస్తాం' అంటూ గత ఎన్నికలకు ముందు సంకల్ప పాదయాత్రలోనూ, శాసనసభలోను ప్రతిపక్ష నాయకుడిగా వైయస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీల అమలు కోసం ఈ నెల 26వ తేదీ నుండి ఎ.పి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో పారిశుధ్య ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెకు సిద్ధమయ్యారు.

ఈ వాగ్దానాల అమలు కోసం రాష్ట్రంలోని 123 నగర కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పరిధిలోకి వచ్చే సుమారు 46 వేల మంది పారిశుధ్య కార్మికులు గత నాలుగున్నరేళ్లుగా అవిశ్రాంతంగా పోరాడుతున్నారు. ఇంకో మూడు నాలుగు నెలల్లో ఎన్నికల కోసం అధికార, ప్రతిపక్ష పార్టీలు గోదాలోకి దిగిపోయాయి. 'మాట తప్పం, మడమ తిప్పంఅంటూ మీరిచ్చిన హామీలను అమలు చేయకుండా మరలా ఎన్నికలకు ఎలా వెళ్తారు?' అని ప్రశ్నిస్తూ మున్సిపల్ కార్మికులు నిరవధిక సమ్మెకు సైరన్ మోగించారు.

## పాలకులందరిదీ ఒకటే దారి

అధికార పీఠం ఎక్కే ముందు చెప్పే మాటలకు తీరా గద్దెనెక్కిన తర్వాత అనుసరించే విధానాలకు పాలకులందరిది ఒకటే దారి! "తెలుగుదేశం పార్టీని గద్దెనెక్కిస్తే రాష్ట్రంలో ఉన్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తాం" అంటూ 2014 ఎన్నికల మేనిఫెస్టోలో సైతం ప్రకటించింది టిడిపి. తర్వాత ఇచ్చిన హామీని అమలు చేయకుండా కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులకు మొండి చేయి చూపింది. కనుక తెలుగుదేశం పార్టీ 2019 ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల్లో ఉన్న అసంతృప్తిని సొమ్ము చేసుకునేందుకు నాడు ప్రతిపక్ష పార్టీగా ఉన్న వైసిపి నేత జగన్మోహన్ రెడ్డి గారు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని, సమాన పనికి సమాన వేతనం ఇస్తామని ఊరూవాడతో పాటు అసెంబ్లీలోను ఊదరగొట్టారు. గత నాలుగున్నరేళ్లుగా ఔట్‌సోర్సింగ్ కార్మికులు కళ్ళల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూస్తున్నారు. వారి ఆశలను గత టిడిపి ప్రభుత్వం మాదిరిగానే వైసిపి ప్రభుత్వం కూడా అడియాసలు చేసింది.

## ప్రభుత్వ ఫ్లాప్ సినిమా ఆప్కాస్

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వం వచ్చీ రాగానే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఆప్కాస్ పేర శఠగోపం పెట్టింది. గతంలో మధ్యవర్తి కాంట్రాక్టర్ ద్వారా పని చేసిన కార్మికులను దోపిడీ నుండి విముక్తి చేసేందుకు ఆప్కాస్ తెస్తున్నామంటూ 2019 ఆగస్టు 15వ తేదీన ప్రారంభించారు ముఖ్యమంత్రి గారు. ప్రతి పట్టణంలో ఉన్న మధ్య దళారీల బెడదైతే తొలగిపోయింది కానీ వైసిపి ప్రభుత్వం ద్వారా కొత్త సమస్యలు కార్మికులను చుట్టుముట్టాయి. అందుకు ఉదాహరణ గతంలో మున్సిపల్ కార్మికులకు రిటైర్మెంట్ పద్ధతి అమలులో లేదు. ఆప్కాస్ వచ్చాక రిటైర్మెంట్ విధానాన్ని బలవంతంగా కార్మికులపై రుద్దారు. ఆప్కాస్ మున్సిపల్ కార్మికులతో పాటు ఇతర డిపార్ట్‌మెంట్లలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులందరినీ ఉద్యోగులుగా నమోదు చేశారు.

ఉద్యోగులకు అమలు చేస్తున్న జీతభత్యాలు, సరెండర్ లీవులు, గ్రాట్యుటీ, పెన్షన్ వంటి పథకాలు ఏవీ వీరికి వర్తింపచేయలేదు. పేరు గొప్ప ఊరు దిబ్బలాగా తయారైంది ఔట్‌సోర్సింగ్ కార్మికుల పరిస్థితి. ఆప్కాస్‌లో ఉద్యోగులుగా నమోదు చేసినందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఎగిరిపోయాయి. పిల్లలకు అమ్మ ఒడి, ఫీజు రీయంబర్స్‌మెంట్, కుటుంబ సభ్యులకున్న వితంతు/వృద్ధాప్య పెన్షన్ దారులకు పెన్షన్ కట్ చేశారు. దీనితో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు, కరెంట్ చార్జీలు, పెట్రోలు, డీజిల్, వంట గ్యాస్ ధరలు, చెత్త పన్ను వంటివి కార్మికుల నెత్తిన బండలుగా మారాయి. ముఖ్యమంత్రి గారు నవరత్నాలు ప్రారంభిస్తూ పారిశుధ్య కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పిన హామీ అటకెక్కింది.

## కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఒకటేనన్నారే !

అధికార పీఠం ఎక్కక ముందు కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఒక్కటే, పేరులోనే తేడాలు తప్ప. చదువులు విధులు ఒక్కటే అన్నారు వైయస్ జగన్మోహన్ రెడ్డి. అయితే ముఖ్యమంత్రి అయ్యాక అందుకు విరుద్ధంగా కాంట్రాక్టు కార్మికులను మాత్రమే పర్మినెంట్ చేస్తూ ఔట్‌సోర్సింగ్ కార్మికులను గాలికొదిలేశారు. దసరా సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేస్తూ జీవో నెంబర్ 114ను జారీ చేసే సందర్భంలో తమకు కూడా తీపి కబురు వస్తుందని ఔట్‌సోర్సింగ్ కార్మికులందరూ వేయి కళ్ళతో ఎదురు చూశారు. కానీ ముఖ్యమంత్రి మాత్రం కటాక్షించలేదు. గత టిడిపి ప్రభుత్వం, వైసిపి ప్రభుత్వం రెండింటికి తేడా కనిపించడంలేదు. దొందూ దొందే చందంగా వుంది.

## చర్చలతో కాలయాపన చేస్తున్న ప్రభుత్వం

ఈ సమస్యపై మున్సిపల్ రంగంలోని అన్ని సంఘాలు కలిసి 2022 జులై 11 నుంచి 15వ తేదీ వరకు సమె నిర్వహించాయి. ఈ సమ్మెకు ముందు జులై ఏడో తేదీన డిఎన్ఏ ఆధ్వర్యంలోనూ, సమ్మె ప్రారంభమైన జులై 11వ తేదీ ఇరువురు మంత్రులు డాక్టర్ ఆదిమూలపు సురేష్, బొత్స సత్యనారాయణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి నేతృత్వంలో అన్ని సంఘాలతో సచివాలయంలో చర్చలు జరిగాయి. 2022 జనవరి నుండి జీతాలు 3000 రూపాయలు పెరిగాయి కనుక హెల్త్ అలవెన్స్ రూ.6000 కాకుండా రూ.3000 మాత్రమే చెల్లిస్తామంటూ ప్రభుత్వం మెలిక పెట్టింది. ఇంజనీరింగ్ కార్మికులకు సంబంధించి జీవో ఆర్టీ నెంబర్ 30 సవరించి వాటర్ సప్లై, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ఫైన్ దళం మొదలగు ఎనిమిది కేటగిరీలకు కార్మిక శాఖ ప్రతిపాదనల మేరకు జీతాలు చెల్లిస్తామని, పబ్లిక్ హెల్త్ పరిధిలోకి వచ్చే చెత్త తరలించే వాహన డ్రైవర్లు మలేరియా, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కార్మికులకు ఆక్యుపేషనల్ హెల్త్ అలవెన్స్ చెల్లిస్తామని, పారిశుధ్య కార్మికులతో పాటు ఇంజనీరింగ్ కార్మికులకు కూడా సంక్షేమ పథకాల అమలు చేస్తామని హామీలు ఇచ్చారు. పారిశుధ్య కార్మికులకు రూ.6000 హెల్త్ అలవెన్స్ మాత్రమే చెల్లిస్తూ మంత్రి గారు ఏకపక్షంగా ప్రకటించి ఇంజనీరింగ్ కార్మికులకు ద్రోహం చేశారు. అప్పటివరకు పారిశుధ్య కార్మికులకు అమలైన సంక్షేమ పథకాలను 2022 ఆగస్టు ఒకటో తేదీ నుండి ఎత్తివేశారు.

## హామీల అమలు కోసం సమరశీల పోరాటాలు

పట్టణాల విస్తరణ మేరకు పని భారం పెరిగి కార్మికులు అవస్థలు పడుతుంటే సిబ్బంది సంఖ్యను పెంచాలని కార్మికులు నిలదీస్తున్నారు. సిబ్బందిని పెంచుకునేందుకు మాకు అనుమతి ఇవ్వండి అంటూ 44 మున్సిపాలిటీలు ఆర్థిక శాఖకు మొరపెట్టుకొని ఏళ్లు గడుస్తున్నా అనుమతి ఇవ్వడం లేదు. రోడ్లమీద పని చేయాల్సిన కార్మికులను అధికారులు డ్రైవర్లుగాను ఇతర పనుల కోసం పెద్ద సంఖ్యలో వినియోగించుకుంటున్నారు. దీనివల్ల వీధుల్లో పని చేస్తున్న కార్మికులపై మోయలేని పని భారం పడుతున్నది. దీనితోపాటు జీవో నెంబర్ 30 సవరణ, పబ్లిక్ హెల్త్ పరిధిలోని వారికి హెల్త్ అలవెన్స్, ముఖ్యమంత్రి హామీలైన సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగాల పర్మినెంట్, సిపిఎస్ రద్దు డిమాండ్ల సాధన కోసం సిఐటియు అనుబంధ సంఘం మే, జూన్ మాసాల్లో రాష్ట్రవ్యాప్తంగా రెండు బస్సుయాత్రలు నిర్వహించింది. ఆగస్టులో మున్సిపల్ కార్యాలయాల ముట్టడి, జిల్లా కలెక్టరేట్ల ముట్టడి మిలిటెంట్‌గా జరిగాయి. అనేక జిల్లాల్లో మహిళా కార్మికులతో సహా తలలు పగిలి చేతులు విరిగాయి. పోలీసు నిర్బంధం పెద్ద ఎత్తున కొనసాగింది. రాష్ట్రమంతా చర్చనీయాంశంగా మారడంతో రాష్ట్ర మంత్రివర్యులు డాక్టర్




ఆదిమూలపు సురేష్ సిఐటియు అనుబంధ సంఘంతో ఆగస్టు 10వ తేదీన ప్రత్యేకంగా చర్చలు జరిపారు. గత నాలుగున్నరేళ్లలో 20 నుండి 25 దఫాలు చర్చలు జరిగినప్పటికీ ఏ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదు.

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారానికి కలిసి వచ్చే సంఘాలను కలుపుకొని డిసెంబర్ 21వ తేదీ తరువాత సమ్మెకు వెళ్తామని ప్రభుత్వానికి అధికారులకు సిఐటియు అనుబంధ సంఘం సమ్మె నోటీసులు ఇచ్చింది. మరోవైపు ఏఐటీయూసీ నాయకత్వం కూడా డిసెంబర్ 27 నుండి సమ్మెలోకి వెళ్తామంటూ ప్రకటనలు చేశారు. ఈ సందర్భంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై శ్రీలక్ష్మి డిసెంబర్ 14వ తేదీ మున్సిపల్ కార్మిక సంఘాలతో చర్చలు జరిపారు. ప్రధానమైన డిమాండ్లు ఒక్కటి కూడా పరిష్కారానికి నోచుకునే దిశలో చర్చలు జరగలేదు. ఈ నేపథ్యంలో సిఐటియు అనుబంధ సంఘం డిసెంబర్ 26వ తేదీ నుండి నిరవధిక సమ్మె తేదీని ప్రకటించింది. సమ్మెని ఫెయిల్ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం స్థానిక మున్సిపల్ అధికారులను రంగంలోకి దించి మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో జాయింట్ మీటింగులు పెట్టి స్థానిక సమస్యలు పరిష్కరిస్తాం. మీరు సమ్మెలోకి వెళ్ళొద్దంటూ కార్మికులను లొంగదీసుకునేందుకు, బెదిరించేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. రాష్ట్ర ప్రభుత్వం బెదిరింపులు, హెచ్చరికలను లెక్క చేయకుండా కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక సమ్మెకు సర్వం సన్నద్ధం చేస్తున్నారు. సమ్మె జయప్రదం కావడం కోసం ప్రజల మద్దతు కోరుతున్నారు.

# పెన్షన్ల గురించి

ప్రస్తుతం నయా ఉదారవాద వ్యవస్థ అధికోత్పత్తి సంక్షోభంలో తీవ్రంగా కూరుకుపోతున్న పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ద్వారా ఆ సంక్షోభాన్ని నివారించడానికి పూనుకోవచ్చు. అలా చేసినందువలన సామాన్య ప్రజలకు కాస్తంత గౌరవప్రదమైన జీవన పరిస్థితులను కల్పించినట్టూ ఔతుంది. కాని నయా ఉదారవాదం సంపన్నుల మీద పన్నులను పెంచడానికి ఒప్పుకోదు. అటు ద్రవ్య లోటును పెంచి ప్రభుత్వం ఖర్చు చేయడానికీ ఒప్పుకోదు. అందుచేత ఈ నయా ఉదారవాద చట్రంలో ఆర్థిక వ్యవస్థ కొనసాగుతున్నంత కాలమూ పెన్షన్ సమస్యకు పరిష్కారం లభించదు. సంక్షోభాన్ని, దాని భారాలను ఎదిరించి పోరాడే క్రమంలో నూతన వ్యవస్థను నిర్మించుకోవడమే పరిష్కారం.

మనకిప్పుడు ఒక వింత దృశ్యం కనిపిస్తోంది. ప్రపంచం లోని ప్రధాన ఆర్థిక వ్యవస్థలలోకెల్లా మనది అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా ప్రధానమంత్రి మొదలు ప్రభుత్వ అధికార ప్రతినిధులందరూ అదే పనిగా విసుగెత్తి పోయేలా ప్రచారం చేస్తూనే వున్నారు. త్వరలోనే అది 5 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థ కానుందని, జిడిపి వృద్ధి రేటులో చైనానే మించిపోతుందని గొప్పలు పోతున్నారు. అదే ప్రభుత్వ ప్రతినిధులు, నాయకులు పాత పెన్షన్ విధానం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ చెల్లించే విషయం వచ్చేసరికి ప్రభుత్వం దగ్గర నిధులు లేవని ప్రకటిస్తున్నారు. ఇక అసంఘటిత రంగంలో పని చేస్తూ, ఎటువంటి పెన్షన్ సదుపాయమూ లేని కోట్లాదిమంది కార్మికులకు సార్వత్రిక పెన్షన్ చెల్లించే సంగతి గురించి చెప్పేదేముంది? ప్రపంచంలోనే అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న పెద్ద ఆర్థిక వ్యవస్థ తన దేశంలోని వృద్ధులకు పెన్షన్లు చెల్లించే పరిస్థితిలో లేదు. అంతే కాదు, తన దేశంలోని మాతృమూర్తులకు కడుపు నిండా తిండి పెట్టలేని స్థితిలో ఉంది. 15 నుండి 49 సంవత్సరాల మధ్య వయస్కులైన స్త్రీలలో 57 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నారని జాతీయ కుటుంబ ఆరోగ్య, సంక్షేమ సర్వే వెల్లడించింది. ఇది 2019-20 నాటి సర్వే. ఇక ప్రపంచంలోనే అతి వేగంగా పెరుగుతున్న మన ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆకలి సూచికలో 125 దేశాలకు గాను 111వ స్థానంలో ఉంది. అంటే తన ప్రజలకు పౌష్టికాహారాన్ని అందించలేని స్థితిలో ఉంది. కనీసం 2200 క్యాలరీల శక్తినిచ్చే ఆహారాన్ని రోజూ పొందలేకపోతే అలాంటివారు నిష్టదరిద్రంలో ఉన్నట్టేనని పాత ప్లానింగ్ కమిషన్ నిర్ధారించింది. ఆ విధంగా చూస్తే గ్రామీణ ప్రాంతాల్లో కనీసం 80 శాతం మంది నిష్టదరిద్రులు ఉన్నారు. 2017-18 జాతీయ శాంపిల్ సర్వేలో ఈ విషయం బైటపడింది. కొత్త పెన్షన్ స్కీములో పెన్షన్ కోసం ఉద్యోగుల జీతాల నుండి ప్రతీ నెలా మినహాయిస్తున్నారు. పాత పెన్షన్ విధానం అటువంటిది కాదు. ఆ విధానం ప్రకారం పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు. దానిని చెల్లించే బాధ్యత యజమాని అయిన ప్రభుత్వానిదే. ఐతే ఆ పాత పెన్షన్ విధానాన్ని ఎందుకు అమలు చేయడం లేదని అడుగుతున్న వారందరికీ ప్రభుత్వ అధికార ప్రతినిధులు, మంత్రులు అందరూ చెప్తున్న సమాధానం ఒక్కటే. "ప్రభుత్వం దగ్గర అంత స్తోమత లేదు". పాత పెన్షన్ విధానంలో ఉద్యోగి రిటైర్ అయ్యేనాటికి అతనికి, లేదా ఆమెకు వచ్చే నెల జీతంలో బేసిక్ పే, కరువు భత్యం లెక్కించి, అందులో సగం పెన్షన్‌గా చెల్లించడం జరుగుతుంది. ఆ తర్వాత పెరిగే ధరలకు అనుగుణంగా ఆ పెన్షన్‌ను సవరిస్తారు. ధరల పెరుగుదల ప్రభావాన్ని పరిగణించి, నిజ పెన్షన్ విలువను అందుకు అనుగుణంగా లెక్కిస్తే ఆ పెన్షన్‌లో నిజానికి ఏ పెరుగుదలా లేనట్టే. ఇప్పుడు ఆర్థిక వ్యవస్థ 6-7 శాతం చొప్పున ప్రతీ ఏడూ పెరుగుతోంది. కాని పెన్షనర్ల సంఖ్య అంత వేగంగా పెరగడం లేదు. అంటే జిడిపిలో పెన్షన్ కోసం చెల్లించే మొత్తం శాతం (జిడిపికి పెన్షన్ మొత్తానికి మధ్య నిష్పత్తి) ఏటికేడూ పడిపోతోందన్నమాట. అలా పడిపోతున్నప్పుడు ఆ పెన్షన్ చెల్లించడం ప్రభుత్వానికి ఏళ్ళు గడుస్తున్న కొద్దీ తేలిక కావాలి. ప్రభుత్వం చెప్పే లెక్కల్ని బట్టే ఇది నిర్ధారణ అవుతోంది. కాని, ఇందుకు పూర్తి విరుద్ధంగా పాత పెన్షన్ విధానాన్ని అందరికీ వర్తింపజేయడం మోయలేని భారం అవుతుందని ఎందుకు ప్రభుత్వ ప్రతినిధులు చెప్తున్నారు? అంటే జిడిపి వృద్ధి వేగంగా ఉన్నకాలంలో ప్రభుత్వ ఆర్థిక పరిస్థితి బలహీనపడుతున్నట్టు అనుకోవాలి. ఏ విధంగా చూసినా, అలా అనుకోలేము. అసలు కారణం ఏమంటే, ఈ ప్రభుత్వం జిడిపిలో మరింత ఎక్కువ వాటా పెట్టుబడిదారులకు దక్కేలా చేయాలని భావిస్తోంది. అలా చేయడాన్ని సమర్ధించుకోడానికి ఈ ప్రభుత్వం దగ్గర ఒక వాదన ఉండనే వుంది. పెట్టుబడిదారులకు ఎంత ఎక్కువ వాటా దక్కితే అంత ఎక్కువగా వాళ్ళు పెట్టుబడులు పెట్టి జిడిపి మరింత ఎక్కువగా వృద్ధి చెందడానికి తోడ్పడతారు అన్నదే ఆ వాదన. ఈ వాదన ఏ మాత్రమూ సమర్ధనీయం కాదు. పెట్టుబడిదారులకు ఎక్కువ ధనాన్ని ఇస్తే వాళ్ళు ఎక్కువ పెట్టుబడులు పెడతారు అనే వాదన ఎంత పసలేనిదో దాదాపు ఒక శతాబ్దం క్రితమే బూర్జువా ఆర్థిక శాస్త్రవేత్త

అయిన కీన్స్, పోలిష్ ఆర్థికవేత్త, మార్క్సిస్టు అయిన మైకేల్ కాలెక్కీ నిరూపించారు. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో సప్లైకి తగిన స్థాయిలో డిమాండ్ లేని పరిస్థితే సాధారణంగా కొనసాగుతూ వుంటుంది. అటువంటి వ్యవస్థలో ఉత్పత్తి, పెట్టుబడి, వృద్ధి పెరగాలంటే దానికి ముందు పెరగవలసినది మొత్తం డిమాండ్. అంతే కాని, పెట్టుబడిదారులకు ధనాన్ని ఎక్కువ ధారపోస్తే దానివలన ప్రయోజనం ఉండదు. ఈ సంగతి మోడీ ప్రభుత్వానికి కూడా తెలుసు. కాని, పాత పెన్షన్ విధానాన్ని అముల చేయడానికి తిరస్కరిస్తోంది. దానిని బట్టి ఈ ప్రభుత్వం పెట్టుబడిదారుల పక్షాన వ్యవహరిస్తున్న ప్రభుత్వం అని స్పష్టం అవుతోంది. ప్రభుత్వం జిడిపి వృద్ధి రేటు పెరుగుదల పట్ల ప్రదర్శిస్తున్న ఈ వ్యామోహం, ఆ వృద్ధిరేటు గురించి ప్రచారం చేసుకుంటున్న తీరు అర్ధరహితం. ఇటువంటి ధోరణినే గతంలో కొందరు మహారాజులు ప్రదర్శించారు. ప్రజలకి ఉపాధి లేకుండా చేసి, వాళ్ళు అడుక్కు తినే పరిస్థితిలో ఉన్నప్పుడు బలవంతంగా వాళ్ళతో చాకిరీ చేయించి పెద్ద పెద్ద కోటలను, రాజ హర్మ్యాలను నిర్మించారు. తమ పాలనలో ఎంతో అభివృద్ధి జరిగిందంటూ గొప్పలు పోయేవారు. అందుకు తార్కాణంగా ఆ కోటలను, భవంతులను చూపించేవారు. ఈ క్రమంలో ప్రజల పట్ల తమ ప్రవర్తన ఎంత అమానవీయంగా ఉన్నా అది వాళ్ళకేమీ పట్టేదే కాదు. బహుశా అడుక్కు తినే స్థితిలో ప్రజలు ఉండడం గర్వకారణంగా వాళ్ళు పరిగణించి వుండాలి. అదే మాదిరిగా ఇప్పుడు కూడా కోట్లాదిమంది వృద్ధులు అత్యంత దయనీయ స్థితిలో జీవించేటందుకు నెట్టబడుతున్నారు. వారిలో చాలా తక్కువ మందికి ప్రభుత్వం నెలనెలా ఇచ్చే రూ.200 దక్కుతోంది. అది చాలా స్వల్పం. ఇలా జరగడానికి కారణం ప్రభుత్వం దగ్గర ఆర్థిక వనరులు లేకపోవడం ఎంత మాత్రమూ కానే కాదు. వనరులను పెట్టుబడిదారులకు కట్టబెట్టడమే కారణం. ఆ విధంగా కట్టబెట్టడాన్ని సమర్ధించుకోడానికి ప్రభుత్వం చేస్తున్న వాదన బొత్తిగా అర్థం లేనిది. ఈ వనరుల సమస్యను మరికాస్త వివరంగా పరిశీలిద్దాం. 2018-19 నాటికి దేశంలో 60 ఏళ్ళు పైబడినవారు సుమారు 13 కోట్ల మంది ఉన్నారు. వాళ్ళు జీవించడానికి నెలకు తలా రూ.3000 కావాలి. ఆ ఏడాది స్థూల జాతీయ ఆదాయం రూ.187 లక్షల కోట్లు, లేదా రూ.187 ట్రిలియన్లు. వృద్ధులకు గనుక నెలకు తలా రూ.3000 చొప్పున చెల్లించాలంటే అందుకు కావలసిన మొత్తం స్థూల జాతీయాదాయంలో 2.5 శాతం మాత్రమే. ఈ మొత్తాన్ని చెల్లించాక దానిని అందుకున్న పెన్షనర్లు తిరిగి దానిని ఖర్చు చేస్తారు. ఆ




ఖర్చులో పన్నుల రూపంలో ప్రభుత్వానికి తిరిగి కనీసం 30 శాతం వెనక్కి వచ్చేస్తుంది. అంటే నికరంగా ప్రభుత్వం పెన్షన్ల కోసం తన స్థూల జాతీయా దాయంలో 1.75 శాతం కేటాయిస్తే సరిపోతుంది. ఈ మొత్తాన్ని సమకూర్చుకోడానికి సంపన్నుల మీద 1 శాతం సంపద పన్ను విధిస్తే చాలు. అలా ఒక శాతం పన్ను అదనంగా విధించినంత మాత్రాన ఆ సంపన్నుల వినిమయం ఏమీ తగ్గిపోదు. అందుచేత ఇతరత్రా పెన్షన్ సదుపాయం లేని వృద్ధులకు నెలకు రూ.3000 చొప్పున సార్వత్రిక పెన్షన్ విధానాన్ని అమలు చేయడానికి వనరుల కొరత ఏమీ లేదు. 2018-19తో పోల్చితే ఇప్పటికి పెన్షన్ పొందే అర్హత గలవారి సంఖ్య ఇంకా పెరిగివుంటుంది కదా అన్న సందేహం రావచ్చు. అలాగే 2018 నాటి రూ. 3000 ఇప్పటి ధరలకు అనుగుణంగా సవరిస్తే ఇంకా ఎక్కువ అవుతుంది కదా? అటువంటప్పుడు ఆర్థిక భారం ఇంకా ఎక్కువ అవుతుంది కదా? అని సందేహం వస్తుంది కూడా. ఆ సందేహానికి ఆస్కారం లేదు. ఈ కాలంలో జాతీయ ఆదాయం కూడా పెరిగింది గనుక పెన్షనర్లకు చెల్లించే మొత్తం కూడా అందులో ఒకానొక శాతంగా ఉంటుంది గనుక అది కూడా పెరుగుతుంది. ఒకవేళ ఇప్పుడు కూడా రూ.3000 చొప్పున మాత్రమే చెల్లించాలనుకుంటే ఆ శాతం తగ్గుతుంది కూడా.

ప్రస్తుతం నయా ఉదారవాద వ్యవస్థ అధికోత్పత్తి సంక్షోభంలో తీవ్రంగా కూరుకుపోతున్న పరిస్థితుల్లో. ప్రభుత్వ వ్యయాన్ని పెంచడం ద్వారా ఆ సంక్షోభాన్ని నివారించడానికి పూనుకోవచ్చు. అలా చేసినందువలన సామాన్య ప్రజలకు కాస్తంత గౌరవప్రదమైన జీవన పరిస్థితులను కల్పించినట్టూ ఔతుంది. కాని నయా ఉదారవాదం సంపన్నుల మీద పన్నులను పెంచడానికి ఒప్పుకోదు. అటు ద్రవ్య లోటును పెంచి ప్రభుత్వం ఖర్చు చేయడానికీ ఒప్పుకోదు. అందుచేత ఈ నయా ఉదారవాద చట్రంలో ఆర్థిక వ్యవస్థ కొనసాగుతున్నంత కాలమూ పెన్షన్ సమస్యకు పరిష్కారం లభించదు. సంక్షోభాన్ని, దాని భారాలను ఎదిరించి పోరాడే క్రమంలో నూతన వ్యవస్థను నిర్మించుకోవడమే పరిష్కారం.

# స్టాక్ మార్కెట్ వీరంగం దేనికి సంకేతం?

దేశంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలు ఈ మార్కెట్ వీరంగానికి ప్రధాన కారణం. దేశంలో ఒక శాతం ధనికులు లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కలిగి ఉన్నారు. ప్రతీ ఏటా ధనికుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. దేశంలోని ధనిక కుటుంబాలు 2022-23లో 20 లక్షల కోట్ల రూపాయల వ్యక్తిగత సంపద పెంచుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు. దీనిలో కొంతభాగం దేశీయ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. అందుకే గత ఏడాది దేశీయ ఫండ్స్ నుంచి 20 బిలియన్ డాలర్లు, 15 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు మన దేశీయ స్టాక్ మార్కెట్ లోకి వచ్చాయి.

మన దేశీయ సెన్సెక్స్‌లో ఇండెక్స్ 72,000 దాటిందని, ఇది ప్రభుత్వ ఘనతగా కొన్ని పత్రికలు, ప్రభుత్వ అనుకూల ఆర్థికవేత్తలు హంగామా చేస్తున్నారు. ఇదే ఊపులో ఇండెక్స్ ఒక లక్ష దాటినా ఆశ్చర్యం లేదని ఊదరకొడుతున్నారు!! లోతుగా పరిశీలిస్తే సెన్సెక్స్‌లో ఉండే 30 కంపెనీల వెయిటేజీలో ఆరు కంపెనీలకు దాదాపు 48 శాతం వెయిటేజీ ఉంది. అవి ఆర్ఐ ఎల్, ఐటిసి, ఇన్ఫోసిస్, ఐసిఐసిఐ బ్యాంక్, హెచ్‌డిఎఫ్‌సి ఈ షేర్‌ల ధరలను బట్టి సెన్సెక్స్ పెరగడం, తగ్గడం జరుగుతోంది. సెన్సెక్స్ పెరుగుదల, తగ్గుదల ఆరు కంపెనీలపై ఆధారపడి ఉంటే, అది ఆర్థిక వ్యవస్థ తీరుతెన్నులను ఎలా ప్రతిబింబిస్తుంది? దేశ ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా ఉంటే అభివృద్ధి సూచికలు అన్నింటిలో మన దేశం ఎందుకు తీసికట్టుగా ఉంటోంది? 80 కోట్ల మంది ప్రభుత్వం నెలకు ఇచ్చే ఐదు కేజీల తిండిగింజలపై ఎందుకు ఆధారపడి ఉన్నారు? ప్రజల ఆదాయాలు, జీవన ప్రమాణాలు దిగజారి, కుటుంబ అప్పు ఎందుకు పెరుగుతోంది? కనీవినీ ఎరుగని నిరుద్యోగం దేశంలో ఎందుకు తాండవ మాడుతోంది? కాబట్టి ఆర్థిక వ్యవస్థ తీరు తెన్నులకు, సెన్సెక్స్ పరుగులకు ఎలాంటి సంబంధం లేదని మనకు తెలుస్తుంది. దేశంలో పెరుగుతున్న ఆదాయ అసమానతలు ఈ మార్కెట్ వీరంగానికి ప్రధాన కారణం. దేశంలో ఒకశాతం ధనికులు లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కలిగి ఉన్నారు. ప్రతీ ఏటా ధనికుల సంపద ఇబ్బడిముబ్బడిగా పెరుగుతోంది. దేశంలోని ధనిక కుటుంబాలు 2022-23లో 20 లక్షల కోట్ల రూపాయల వ్యక్తిగత సంపద పెంచుకున్నట్లు నిపుణులు చెబుతున్నారు. దీనిలో కొంతభాగం దేశీయ స్టాక్ మార్కెట్‌లోకి ప్రవేశించింది. అందుకే గత ఏడాది దేశీయ ఫండ్స్ నుంచి 20 బిలియన్ డాలర్లు, 15 బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు మన దేశీయ స్టాక్ మార్కెట్ లోకి వచ్చాయి.

గతేడాది సెన్సెక్స్‌లో ధనికుల పెట్టుబడులపై వారికి 20 శాతం దిగుబడి రావడం విశేషం!! 2024లో సైతం ధనిక మదుపుదారులకు లాభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీరేట్లు తగ్గించే సూచనలు కనిపిస్తున్నాయి. దీని ప్రభావం మన దేశంపై కూడా పడుతుంది. అమెరికాలోని మదుపుదారులు అక్కడ చౌకగా రుణాలు పొంది, వాటిని అమెరికన్, ఇండియా స్టాక్ మార్కెట్‌లలో సైతం పెట్టుబడులు పెట్టే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) కూడా వడ్డీరేట్లు తగ్గిస్తే, ఇక్కడ దేశీయ మదుపుదారులు స్టాక్ మార్కెట్‌లలో పెట్టే మొత్తాలు ఇంకా పెరుగుతాయి. స్టాక్ మార్కెట్ల పూనకం కొనసాగుతుంది. అయితే, రిటైల్ మదుపుదారులు స్టాక్ మార్కెట్‌లలో స్పెక్యులేటివ్ పెట్టుబడులు పెద్దఎత్తున పెడుతుండడం ఆందోళనకరం. ఫ్యూచర్ మార్కెట్‌లో లాభాలు రావాలంటే, ఎక్కువ సంఖ్యలో షేర్‌లు కొనాలి. ఉదాహరణకు క్యాష్ మార్కెట్‌లో 100 ముఖవిలువతో 20 వేల షేర్లు కొనాలంటే, 20 లక్షల రూపాయలు ఖర్చు చేయాలి. అదే డెరివేటివ్ మార్కెట్‌లో పది శాతం మార్జిన్ అమౌంట్ చెల్లిస్తే సరిపోతుంది. అయితే, షేర్ ధరలు పడిపోతే, భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఇతర దేశాల్లో క్యాష్ మార్కెట్‌లో డెరివేటివ్ మార్కెట్ వాటా ఐదు నుంచి పది శాతం ఉంటుంది. మన దేశంలో ఇది 400 రెట్లు ఉంది. ఒకవేళ, మార్కెట్లు ఉన్నపళంగా కుప్పకూలితే దీని ప్రభావం అప్పుల మీద, చెల్లింపుల

మీద పడుతుంది. అప్పుడు పారు బకాయిల భారం పెరుగుతుంది. దీనర్థం ఏమిటంటే ప్రజల సొమ్ముతో కార్పొరేట్లు, బడా ఇన్వెస్టర్లు స్టాక్ మార్కెట్‌లో పెద్దఎత్తున లాభాలు ఆర్జిస్తున్నారు. నష్టం వస్తే బ్యాంకులకు, ఎన్‌బిఎఫ్‌సి లకు పంగనామాలు పెడుతున్నారు. ఒక రైతు ట్రాక్టర్ కొనుక్కోవ దానికి ఆయనకు 14 శాతం నుండి 16 శాతం వడ్డీ వసూలు చేస్తున్నారు. కానీ కాల్ మనీ, షార్ట్ టర్మ్ లోన్ పేర్లతో స్టాక్ బ్రోకర్లకు, మదుపుదారులకు కారుచౌకగా అప్పులు దొరుకుతున్నాయి. నిజ ఆర్థిక వ్యవస్థ కన్నా, స్టాక్ మార్కెట్ అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వాలు పనిచేయడం వల్ల ఇదంతా జరుగుతోంది

1996లో ఎన్రాన్ కంపెనీ విద్యుత్ ఉత్పత్తి చేస్తామని ఇలాగే ప్రభుత్వ బ్యాంకుల నుండి అప్పు తీసుకుని, ఆనాటి మహారాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందాలు కుదుర్చుకుని చివరికి ఉత్పత్తి చేయకుండానే మన దేశం నుంచి ఉడాయించింది. దానికి అప్పు ఇచ్చిన బ్యాంకులు మునిగాయి. ఆ కంపెనీలో షేర్లు కొన్న సామాన్య మదుపుదారులు మునిగారు. చివరికి ఆ కంపెనీ ఉద్యోగులు కూడా మునిగిపోయారు. స్టాక్ అప్షన్లు పేరుతో ఎన్రాన్ ఉద్యోగులకు ఇచ్చిన షేర్లు చిత్తు కాగితాలుగా మిగిలాయి. కింగ్ ఫిషర్, నీరవ్ మోడీల కథలు ఇవే కదా!! 2021-22లో ఎఫ్‌డిఐ రూపేణా రూ. 4.37 లక్షల కోట్లు మన దేశ ఆర్థిక వ్యవస్థలోకి ప్రవేశిస్తే, 2022-23 సంవత్సరంలో మన దేశంలోకి విదేశీ పెట్టుబడులు భారీగా తగ్గి రూ. 3.67 లక్షల కోట్లు మాత్రమే వచ్చాయి. మన దేశంలోకి వచ్చిన ఎఫ్‌డిఐ కూడా సేవా రంగంలోకి, సాఫ్ట్‌వేర్ రంగంలోకి కీలకంగా వచ్చింది. తయారీ రంగం, నిర్మాణ రంగంలో, నైపుణ్య మెరుగుదల రంగంలోకి ఎఫ్‌డిఐ నామమాత్రంగా వచ్చింది. ఇది దేశ అభివృద్ధికి ఎలా దోహదపడుతుంది? అస్థిరమైన విదేశీ పెట్టుబడుల కోసం అర్రులు చాస్తున్నారు. విదేశీ పోర్టుఫోలియో పెట్టుబడులు దేశ ఆర్థిక వ్యవస్థలను ఎలా దెబ్బ తీస్తాయో, 80, 90 దశకంలో ఆగ్నేయాసియా దేశాల ఆర్థిక వ్యవస్థల పతనం చూస్తే తెలిసి పోతుంది. ఇన్ని దశాబ్దాల అనుభవం ఉన్నా, ప్రభుత్వాలు విదేశీ పెట్టుబడులు కోసం ఎగబడుతూ, చేయని పని లేదు.

దేశంలో నియంత్రణా వ్యవస్థల నిర్వహణ సామర్థ్యం




వల్లే 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభాన్ని మన దేశం సమర్థవంతంగా ఎదుర్కొనగలిగింది. బ్యాంకులలో ద్రవ్య లభ్యత ఎంత ఉండాలి, ఎంతమేర అప్పులివ్వాలి, మూల ధనం ఎంత ఉండాలో మన దేశంలో కఠిన చట్టాలు ఉన్నాయి. అయితే, అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఒత్తిడి మేరకు, వాటిని నిర్వీర్యం చేయాలనే ప్రయత్నాలు వేగవంతమయ్యాయి. అందుకే రానురానూ దేశంలో నియంత్రణా వ్యవస్థల పరిధికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇచ్చే పరపతి రుణాలు కోతకు గురవుతున్నాయి. కార్పొరేట్ రుణాలు, అంత కంతకూ పెరుగుతున్నాయి. ప్రజల సొమ్ముతో వ్యాపారాలు చేసి కార్పొరేట్లు వేల కోట్ల రూపాయలు ఆర్జించడం, అప్పులను ఎగ్గొట్టి బ్యాంకులను ముంచడం, ఆ బ్యాంకులను కాపాడే మిషతో ప్రభుత్వం ప్రజాధనాన్ని మళ్లీ బ్యాంకులకు కాపిటల్‌గా అందించడం ఇదే పరిపాటి అయ్యిందికార్పోరేట్ కంపెనీల పారు బకాయిలను ఎందుకు మాఫీ చేస్తున్నారు? వారి అప్పులను గోళ్ళూడగొట్టి ఎందుకు వసూలు చేయరు? బ్యాంకులను ఎందుకు ప్రయివేటుపరం చేస్తున్నారు? ప్రజలు చైతన్యపూర్వకంగా ఈ ప్రశ్నలు అడిగి, ప్రభుత్వాలను నిలదీయనంత కాలం ఈ దోపిడీ విశృంఖలంగా సాగుతూనే ఉంటుంది!! ప్రజల డబ్బుతో కొంత మంది బడా బాబులు స్టాక్ మార్కెట్‌లో జూదం ఆడుతూనే ఉంటారు!! స్టాక్ మార్కెట్‌ల వీరంగం చూసి, నిజ ఆర్థిక వ్యవస్థ పెరుగుతోందని భ్రమ పడేవారు ఈ వాస్తవాలు గ్రహించాలి.

# రాష్ట్ర ఎన్నికల్లో కీలకం కానున్న మైనారిటీలు !

**మణిపూర్‌లో క్రిస్టియన్లపై దాడులు చేసినా కేంద్రంలోని, ఆ రాష్ట్రంలోని బిజెపి సర్కారు సరిగ్గా స్పందించలేదనే అసంతృప్తి ఎ.పి లోనూ నెలకొని ఉంది. ఈ ఘటనపై పలు క్రిస్టియన్ సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. పై పరిణామాలతో ముస్లిం, క్రిస్టియన్ సామాజిక వర్గాలు బిజెపి పై ఆగ్రహంతో, ఆ పార్టీతో అంటకాగే పార్టీని కూడా శిక్షించాలనే దృఢ నిశ్చయంతో ఉన్నాయి. అయితే రాష్ట్రంలో వైఎస్ఆర్‌సిపి, టిడిపి-జనసేన కూటమి మైనార్టీల భావాలను పట్టించుకోకుండా ముందుకెళ్తే ఎదురుదెబ్బ తప్పదు.**

వేసవి కాలంలో జరగనున్న ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు చలికాలంలోనే వేడిని పుట్టిస్తున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ముగియడంతో ఇప్పుడు తెలుగువారి దృష్టి అంతా ఆంధ్రా ఎన్నికలపైనే ఉంది. సంక్షేమ పథకాలే తమను మళ్లీ అధికారంలోకి తెస్తాయని వైఎస్ఆర్‌సిపి ఆశిస్తుండగా, ప్రభుత్వ వ్యతిరేకతతో అధికార మార్పిడి ఖాయమని టిడిపి-జనసేన కూటమి భావిస్తోంది. ఆ పార్టీలు సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రభుత్వ వ్యతిరేకత వంటి అంశాలపైనే దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. అంతకంటే ఎక్కువగా ముస్లిం, క్రిస్టియన్ మైనార్టీలు రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కీలక పాత్ర పోషించనున్నారని చెప్పవచ్చు.

మైనార్టీల జనాభా, గత ఎన్నికల్లో వారు అనుసరించిన విధానం అంశాలను పరిశీలించడంతోపాటు ప్రస్తుత రాష్ట్ర రాజకీయ పరిస్థితులను కూడా పరిగణలోకి తీసుకుంటూ 'పీపుల్స్ పల్స్' శాస్త్రీయంగా అధ్యయనం చేసింది. ఎపి లో సుమారు పది శాతం ముస్లింలు, ఒక శాతం క్రిస్టియన్లు ఉన్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఎస్‌సి, ఎస్‌టి, బిసి లతో పాటు అగ్రవర్ణాలలో కూడా మత మార్పిళ్లు జరుగుతున్నాయి (ఇలాంటివి అధికారిక గణాంకాల్లో వ్యక్తం కావు). ఎన్నికల్లో మైనార్టీల ప్రభావం ఉండబోతోంది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, నెల్లూరు, అనంతపురం, చిత్తూరు జిల్లాలలో పది శాతానికి పైగా, కడప, కర్నూలు జిల్లాలలో పదిహేను శాతానికి పైగా మైనార్టీలున్నారు. ప్రధానంగా ముస్లింలు 64 స్థానాలకు పైగా అసెంబ్లీ నియోజక వర్గాల్లో నిర్ణయాత్మకంగా ఉన్నారని అంచనా.

మైనార్టీల నిర్ణయం రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితుల కంటే బిజెపి పైనే అధికంగా ఆధారపడి ఉంటోంది. ఇక్కడి పార్టీలు బిజెపి కి అనుకూలంగా, వ్యతిరేకంగా వ్యవహరించే తీరునుబట్టి ముస్లింలు నిర్ణయం తీసుకుంటారని గత ఎన్నికల అనుభవాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో టిడిపి, వైఎస్ఆర్‌సిపి గత ఎన్నికల్లో పొందిన ముస్లిం ఓట్ల శాతాన్ని పరిశీలిస్తే ఆసక్తికరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. సిఎస్‌డిఎస్-లోక్‌నీతి డేటాను పరిశీలిస్తే బిజెపి తో పొత్తు పెట్టుకోకుండా పోటీ చేయడంతో టిడిపి 1996లో 36.7 శాతం, 1998లో 46.6శాతం, 2009లో 24.8శాతం, 2019లో 46శాతం ముస్లిం ఓట్లు పొందింది. అదే బిజెపి తో కలిసి పోటీ చేసిన 1999లో 28.2శాతం, 2004లో 34శాతం, 2014లో 33శాతం ముస్లిం ఓట్లు పొందింది. బిజెపి తో పొత్తు పెట్టుకొని పోటీ చేసినప్పుడు ముస్లిం మద్దతు కోల్పోతున్న టిడిపి, బిజెపి తో కలవకుండా పోటీ చేసినప్పుడు మాత్రం అధికంగా ముస్లిం ఓట్లను పొందుతోంది. బిజెపి తో పొత్తు లేకుండా 2009లో పోటీ చేసిన టిడిపి కి 24.8 శాతం ఓట్లే రావడానికి ప్రధాన



కారణం అప్పుడు జరిగిన ప్రత్యేక తెలంగాణ ఉద్యమం కీలక దశలో ఉండడమే.

రాష్ట్ర విభజన తర్వాత వైఎస్ఆర్‌సిపి 2014లో రికార్డు స్థాయిలో 66 శాతం మైనార్టీల మద్దతు పొందింది. అదే 2019 ఎన్నికలొచ్చే సరికి 17 శాతం ఓట్లు కోల్పోయి 49 శాతం ఓట్లే పొందింది. దీనికి ప్రధాన కారణాలు ఆ ఎన్నికలకు ముందు జగన్ బిజెపి కేంద్ర నాయకులతో సత్సంబంధాలు కొనసాగించ డంతో పాటు చంద్రబాబు బిజెపి కి వ్యతిరేకంగా కఠినంగా వ్యవహరించడం. ఈ చరిత్రలను పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో ఏ మాత్రం ప్రభావం లేని బిజెపి పరోక్షంగా ఇతర పార్టీల గెలుపోటములపై ప్రభావం చూపిస్తుందని చెప్పవచ్చు.వైఎస్.రాజశేఖర రెడ్డిని తమ ఆరాధ్య దైవంగా భావించే వైఎస్ఆర్‌సిపి ప్రస్తుతం వైఎస్ఆర్ ప్రధాన ఆశయమైన సెక్యులర్ భావాలకు తిలోదకాలిస్తుందనే భావన రాష్ట్రంలోని మైనార్టీలలో నెలకొంది. వైఎస్ఆర్ ఎప్పుడూ రాజీ పడకుండా బిజెపి, సంఘ్ పరివార్ సంస్థలకు వ్యతిరేకంగా వ్యవహరించారు. ఒకానొక సమయంలో వైఎస్ఆర్‌పై ఆర్ఎస్ఎస్ కేసు కూడా పెట్టింది. ఇందుకు భిన్నంగా వైఎస్.జగన్ ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా అనేక కారణాలతో మొదటి నుండి బిజెపి తో ప్రత్యక్షంగా, పరోక్షంగా సయోధ్యగానే మెలుగుతున్నారు. 2014లో వైఎస్ఆర్‌సిపి ఓడిపోయిన తర్వాత నరేంద్ర మోడీ ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయకముందే జగన్ కలిశారు. అప్పటి నుండే జగన్ బిజెపి పై సాఫ్ట్‌కార్నర్‌గా ఉంటున్నారు. వైఎస్ఆర్‌సిపి ఇప్పటి వరకూ బిజెపితో ప్రత్యక్షంగా పొత్తు పెట్టుకోకపోయినా, కేంద్రంలో అందరి కంటే ముందే బిజెపి కి మద్దతు ఇస్తుండడంతో రాష్ట్రంలోని మైనార్టీలు జగన్ ప్రభుత్వంపై ఆగ్రహంగా ఉన్నారు. వైఎస్ఆర్‌సిపి కి రాష్ట్రంలో మొదటి నుండి ముస్లింలు, క్రిస్టియన్లు ఏకపక్షంగా మద్దతిస్తున్నారు. ముస్లింలతోపాటు క్రిస్టియన్లకు కూడా జగన్ బిజెపి దోస్తీ నచ్చడం లేదు. క్రిస్టియన్ల

ఓటింగ్ శాతం తక్కువే అయినా మత మార్పిడితో క్రిస్టియన్లుగా మారుతున్న సామాజిక వర్గాలకు కూడా బిజెపి తో సయోధ్యపై జగన్ అంటే గుర్రుగా ఉన్నారు. బిజెపి తో జగన్ తీరు ఇలాగే కొనసాగితే అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్ఆర్‌సిపి ముస్లిం ఓట్లను నష్టపోయే అవకాశాలున్నాయని ఆ పార్టీ సానుభూతిపరులు భావిస్తున్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు మొదటి నుండి బిజెపి పట్ల దృఢవైఖరితో లేకుండా అవకాశవాద రాజకీయాలకు పాల్పడుతున్నారు. 1998లో చంద్రబాబు బిజెపి ని విమర్శిస్తూ ఆ పార్టీ మసీదులు కూలుస్తుంటే తాము మసీదులు నిర్మిస్తున్నా మంటూ వ్యాఖ్యానించారు. 1999 పార్లమెంట్ ఎన్నికల సమయంలో 13 పార్టీలతో కూడిన యునైటెడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్న చంద్రబాబు కూటమిలోని నేతలకు చెప్పకుండా బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ వైపు మళ్లారు. 2004 ఎన్నికల్లో ముస్లింలు బిజెపి కి వ్యతిరేకంగా ఉండడంతో ఆ పార్టీతో పొత్తు పెట్టుకొని ఓడిపోయానని, ఇకపై బిజెపి తో కలవనని చంద్రబాబు చెప్పారు. మళ్లీ 2014లో బిజెపి తో జతకట్టిన చంద్రబాబు 2019 ఎన్నికల ముందు బిజెపి కి రాంరాం చెప్పారు. ఇకపై భవిష్యత్తులో ప్రాణం పోయినా బిజెపి తో కలవమని ఆయన చెప్పగా, టిడిపి తో ఇక ముందు పొత్తు పెట్టుకోమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా అన్నారు. ఆ సమయంలో రాష్ట్రానికి వచ్చిన అమిత్ షాను టిడిపి శ్రేణులు అడ్డుకొన్నాయి. నిప్పు, నీరుగా సాగిన వీరి తీరులో 2019లో టిడిపి ఓటమి తర్వాత మార్పు వచ్చింది. 2019కి ముందు బిజెపి పై కఠినంగా వ్యవహరించిన చంద్రబాబు వైఖరిలో మార్పు స్పష్టంగా కనిపించింది.

ఆంధ్రప్రదేశ్‌కు దక్కాల్సిన ప్రత్యేక హోదాతో పాటు ఇతర హామీలపై మోడీ ప్రభుత్వం వివక్ష చూపిస్తుందని, రాష్ట్రానికి కావాల్సింది పాచిపోయిన లడ్డూలు కావని 2019లో బిజెపి పై తీవ్ర విమర్శలు చేసిన జనసేనాని పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎన్‌డిఎలో భాగస్వామి అయ్యారు. బిజెపి తో పొత్తు కొనసాగిస్తున్నారు. పొత్తుపై ఆయన అనేక వివరణలు ఇచ్చినా మైనార్టీలకు అన్యాయం జరిగితే మొదటగా తానే స్పందిస్తానని పవన్ చెబుతున్నా ప్రస్తుత బిజెపి పోకడలతో ఆయన మాటలను మైనార్టీలు విశ్వసించడం కష్టమే. బిజెపి వ్యవహారాలను వ్యతిరేకించే మైనార్టీలకు ఇతర రాష్ట్రాల్లో ప్రత్యామ్నాయాలున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో ఎస్‌పి, బిఎస్‌పి, కాంగ్రెస్, బీహార్‌లో ఆర్‌జెడి, జెడియు, పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి, వామపక్షాలు, కాంగ్రెస్, ఒడిస్సాలో బిజెడి, కాంగ్రెస్‌లు ప్రత్యామ్నాయాలుగా ఉన్నాయి. ఆంధ్రాలో వైఎస్ ఆర్‌సిపి, టిడిపి–జనసేన కూటమే ఉండడం ఇబ్బందికరమే !

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాలను మొదటి నుండి పరిశీలిస్తే ప్రత్యక్షంగా, పరోక్షంగా బిజెపి ప్రభావం నామమాత్రమే. రాష్ట్రంలో నోటాతో పోటీ పడుతున్న బిజెపి గురించి మైనార్టీలు పెద్దగా పట్టించుకోలేదు. 2014లో నరేంద్ర మోడీ నేతృత్వంలో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారం చేపట్టినప్పటి నుంచి తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలతో మైనార్టీలలో అభద్రతా భావం పెరగడంతో పాటు ఆ పార్టీపై ఆగ్రహం కూడా ప్రారంభమైంది. అయోధ్య రామాలయం అంశంపై బిజెపి దూకుడు, కాశ్మీర్ 370 ఆర్టికల్ రద్దు, సిఎఎ, ఎన్‌ఆర్‌సి, కామన్ సివిల్ కోడ్ ప్రతిపాదన వంటి నిర్ణయాలతో తమ ఉనికికే ప్రమాదం ఏర్పడిందని ముస్లింలు భావిస్తున్నారు.

మణిపూర్‌లో క్రిస్టియన్లపై దాడులు చేసినా కేంద్రంలోని, ఆ రాష్ట్రంలోని బిజెపి సర్కారు సరిగ్గా స్పందించలేదనే అసంతృప్తి ఈ రాష్ట్రంలోనూ నెలకొని ఉంది. ఈ ఘటనపై పలు క్రిస్టియన్ సంఘాలు, ప్రజా సంఘాలు పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టాయి. పై పరిణామాలతో ముస్లిం, క్రిస్టియన్ సామాజిక వర్గాలు బిజెపి పై ఆగ్రహంతో, ఆ పార్టీతో అంటకాగే పార్టీని కూడా శిక్షించాలనే దృఢ నిశ్చయంతో ఉన్నాయి. అయితే రాష్ట్రంలో వైఎస్ఆర్‌సిపి, టిడిపి–జనసేన కూటమి మైనార్టీల భావాలను పట్టించుకోకుండా ముందుకెళ్తే ఎదురుదెబ్బ తప్పదు.

బిజెపి పోకడలపై దేశ వ్యాప్తంగా అనేక ప్రజా సంఘాలు, ఎన్‌జీవోలు, మేధావుల సంఘాలు మండిపడుతున్నాయి. వారు కర్ణాటకలో బిజెపి ప్రభుత్వాన్ని పడగొట్టడంలో, తెలంగాణలో బిజెపి ని అడ్డుకోవడంలో విజయవంతమయ్యారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఏపి లో వైఎస్ఆర్‌సిపి, టిడిపి–జనసేన కూటమి బిజెపి తో ఎంత దూరం పాటిస్తే అంత మంచిదనే వాస్తవాన్ని గుర్తించి మెలిగితేనే మంచిది.